


రవి ఆర్ట్ థియేటర్స్
భాగస్థులు
నిర్మాతలు:
సి.హెచ్.రాఘవరావు - కె.బసవయ్య
దర్శకత్వం:
ఎ.భీమ్‌సింగ్
నవయుగ

జ్యోతి

ఏప్రిల్ 1975

సచిత్ర మాసపత్రిక సంపుటి: 13: సంచిక: 3


విషయ సూచిక

మారుతీ ప్రొడక్షన్స్‌వారి 'బాబు' లో శోభన్‌బాబు, లక్ష్మి

సంస్థాపకులు: కీ. శే. వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్: శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జ్యోతి, 40/1 మూసాపెయిట్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-600017.
ఫోన్: 440548; సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు. 20/-


భవాని ఆర్ట్ పిక్చర్స్ సమర్పించు
సౌభాగ్యవతి
స్క్రీన్‌ప్లే - దర్శకత్వం
పి. చంద్రశేఖర రెడ్డి బి.ఏ.,
నిర్మాత
పి. నాగభూషణం యాదవ్
ఆంధ్ర: రఘురామా ఫిలిమ్స్, నైజాం: సీతారామ ఫిలిమ్స్, సీడెడ్: నవభారత్ ఫిలిమ్స్

తొలిమాట

ఇతరులకు హాని తలపెట్టని స్వార్థ చింతనలో తప్పులేదు. మనమూ, మనదీ....అనుకోవడం, అందుకోసం సరైన కృషిచేసుకోవడమూ జరుగవలసిన పనులే।

ప్రపంచంలో పలు ప్రాంతాలవున్న తెలుగువారూ, తెలుగు భాషాభిమానులూ ఒకచోట చేరి, ఒకరి భావాలు ఒకరు తెలుసుకొని సంస్కృతీ పరంగానూ, భాషా పరంగానూ బలమైన బంధాలు పెంచుకొనేందుకు నిర్దేశింపబడి తెలుగు ఉగాదినుండీ హైదరాబాదులో జరగబోతున్న ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతంగా జరగాలని కోరుకొంటోంది జ్యోతి.

తెలుగు మహాసభ నిర్వాహకులు ఆశించినట్లు భాష, సాహిత్యం, సంస్కృతి మరియు కళారంగాలలో ఒకరికొకరు తోడ్పడే అవకాశంగా ఈ సభను ప్రతినిధులు ఉపయోగించుకోవాలి.

మహాసభ పటాటోపంగా నిర్వహించబడటం మాత్రమేగాక సభ అనంతరం కూడా తెలుగువారిలో ఆ సభ తాలూకు ప్రభావం నిలబడి నిర్మాణాత్మకమైన కార్యక్రమాల వైపు నడిపించగలదని ఆశిద్దాం.

కబుర్లు

బలసాని ప్రసాదరావు

ఈ ఏడాదంతా మన మహిళాలోకానికి పండుగ. ఇది అంతర్జాతీయ మహిళా సంవత్సరం. ఏడాది పొడుగునా మనం చాలా ఉపన్యాసాలు వింటాం. మహిళాభ్యుదయాన్ని గురించి సచిత్ర వ్యాసాలనేకం చదువుతాం. ఆఫ్రికన్ మహిళల పురోగతిని గురించీ, అమెరికన్ అమ్మల వెనుకబడిన తనాన్ని గురించీ పరిశోధనా గ్రంధాలు కూడా బహుళా వెలువడుతాయి.

"కానీ, తెలుగు మహిళలకు మాత్రం ఇది రాక్షసనామ సంవత్సరం గదండీ! మరెలాగ" అని వాపోయిందో తెలుగుమహిళ.

కావచ్చుగానీ, రాక్షసులకే భయపడని మన మహిళలు రాక్షస నామానికి బెదురుతారా? సత్యభామ ఏంచేసింది? "బాబోయ్! రాక్షసుడితో యుద్ధానికా! వద్దు నాధా, వద్దు ఇటనే పాచికలాడుకొందుముగాక" అని అయ్యగారి గోచీ పుచ్చుకు వెనక్కు లాగిందా? లేఁగాక లేదు.

పోనీ, "రాక్షసుడితో నీకు తగాదా లేంటి? బోడిప్రజాసేవా, నువ్వూను. పోయి క్యూలో తగలడి సాయంత్రంలోగా పంచదార పట్టుకురా! లేకుంటే ప్రొద్దున్నే బెల్లం కాఫీ త్రాగాల్సొస్తుంది కామ్రేడ్!" అని హెచ్చరించిందా! అబ్బే అదేంలేదు.

"సరే! పొమ్మా క్రిష్ణా! కనీసం రెండ్నెల్లు ఓపిగ్గా యుద్ధంచేసి తీరిగ్గా రా! ఈ లోగా నేనో నాలుగు చీరియల్ నావల్స్ రాసుకుంటాన్లే!" అని యన్నదా? పాపం శమించుగాక! అట్లా అనియుండలేదు.

మరేమన్నది?


"ఓకే! డార్లింగ్! ఇదో, వస్తున్నా" నంటూ తక్షణం అట్లకాడ పుచ్చుకుని కిష్టాప్ వెనకాల స్కూటరెక్కి దండకారణ్య ప్రాజెక్టువద్ద పిక్నిక్ పూర్తిచేసుకుని భుక్తాయాసం తీరగానే అట్లకాడతో సదరు నరకాసుర నామరాక్షసుడిని ఒక్కదెబ్బతో చంపేసింది. ఆవిడగారు నవలలు రాయక పోతేనేంగాక! ఆవిడను గురించి ఎన్ని కావ్యాలు రాలేదుగనుక!

అలాంటి భామ వారసులైన మన మగువలు రాక్షసనామ సంవత్సరం అనగానే బేజారై పోతారా!

ఈ మాత్రానికే బెదిరిపోయేవారైతే మన భారత మహిళల్లో సగంమందికిపైగా


ఉగాది శుభాకాంక్షలతో!

మీ భవిష్యత్తు బంగారు బాట కావాలని ఆకాంక్షిస్తూ



ఏనాడో ఉరేసుకుని సుఖపడివుండేవారు. లేదా కనీసం బావుల్లోనైనా దూకివుండే వారు. శాంతి సహనాలకు మన మహిళలది పెట్టింది పేరు. కనుకనే అలాంటి ఘన కార్యాలేవీ చేయలేదు. గుట్టుచప్పుడు కాకుండా సంసారాలు లాక్కొస్తూ దేశ ప్రతిష్టనూ, దేశమాత ఇందిరాజీ పరువునూ విదేశాల్లో కాపాడుతున్నారు.

లేకుంటే మన భారత మహిళలకు సాటి రాగలవారీ ప్రపంచంలో మరెక్కడేనా ఉన్నారా? సరోజినీ నాయుడు, దుర్గా బాయమ్మలాంటి వాళ్ళ సంగతి కాదు నేను చెప్తూంట! మచ్చుకు మన రాజధానీ నగరం



గమనించండి!

జ్యోతి మే 1975 సంచికనుంచీ, ఎక్కువ పేజీలతో, ఎక్కువ ఆకర్షణలతో వెలువడుతుంది. ధరలో కూడా స్వల్పమైన మార్పు, జ్యోతి విడి ప్రతి వెల మే సంచిక నుంచీ రు. 3/—

పూర్తి వివరాలు 14, 15 పేజీలలో

లోని మధ్య తరగతి మహిళామణినే తీసుకుందాం. ఆవిడ సహనం ముందు రామాయణం హీరోయిన్ సీతమ్మ వారి సహనం ఓ లెక్కలోదా? సీతమ్మ వార్ని గురించి కనీసం వాల్మీకి ఓ సీరియల్ నావెల్ అన్నా రాసేడు. ఆవిడ కీర్తి పంచరంగుల తెరల మీద కూడా ప్రకాశించింది.

కానీ, కానీ, మన మధ్యతరగతి భారత మహిళను గురించి బ్లాక్ అండ్ వైట్ సిన్మాలు కూడా ఏమంతగా వచ్చినట్టు లేవు. ఆ వచ్చిన నాలుగున్నర సిన్మాల్లో కూడా ఆవిడ అతుకులు వేసిన పట్టు జాకెట్టు, అతుకుల్లేని నైలాన్ చీరతోనే కనుపిస్తుంది తప్ప నిత్యం మన కంటికి ఎదురయ్యే అసలు సిసలు మధ్య తరగతి మహిళలా ఉండదు గాక ఉండదు.

ఈ మన మహిళా రత్నం ఏంచేస్తుంది! అర్ధరాత్రి రెండు గంటలకు, తప్పితే నాలుగు గంటలకే లేస్తుంది.

"వ్హాట్??" అని నోరు తెరుస్తున్నారా! జాగ్రత్త! నోట్లో ఈగలు కాకుంటే దోమలయినా దూరగలవు. మన రాజధానీ భాగ్య నగరంలో పంపుల్లో పగలు నీళ్ళు రావు. అర్ధరాత్రి జోలపాటలా, మేలుకొలుపులా

జలజలా రాల నారంభిస్తాయి పంపుల్లోంచి. తెల్లారేందుకు అరగంట ముందుగా ఆగి పోతాయి. ఈలోగా మన మహిళా రత్నం ఆ నీళ్ళను అమృతధారల్లా కుండల్లో, బిందెల్లో, చెంబుల్లో, ముంతల్లో నింపి భద్రం చేసుకోవాలి. లేదా తాగేందుకు నీటి చుక్కలేక చావాలి. ఈ ఘట్టం సత్యజిత్ రాయ్ బ్రాండు సిన్మాలకు అద్భుతంగా పని కొస్తుంది. ఆ నీళ్ళ చప్పుడూ, కుండల-బిందెల గలగలలూ కర్ణపేయమైన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌గా పనికొస్తాయి.

ఆ తర్వాత వంట పర్వం! వంటచేయా లంటే ఏంకావాలి? ముందు పొయ్యి! గ్యాసయిపోయి నెలరోజులయి ఉంటుంది. కిరసనాయిలయిపోయి నాలుగు రోజులయి ఉంటుంది. మరి వంట ఎలా గంటారా? ఓస్! దాందేముంది. బొగ్గుల పొయ్యి, లేదా కట్టెలపొయ్యి. ఓ పావుగంట సేపు పొయ్యి విసురుతూ, మధ్యమధ్య తనకూ విసురుకుంటూ కాలక్షేపం.

ఆ తర్వాత పొయ్యిమీదికి బియ్యం ఎక్కించాలి. అలా చేయాలంటే బియ్యం లోంచి ముందుగా రాళ్ళు ఏరాలి. అయితే మన భారతనారి రాళ్ళేరదు. ఆవిడ అంత తెలివి తక్కువదేంకాదు. బియ్యంలోంచి రాళ్ళేరటంకన్నా. రాళ్ళల్లోంచి బియ్యం ఏరటం సులభమని ఆవిడ ఏనాడో కని పెట్టింది. కనుక ఆ పనిని ఓ అరగంట

జ్యోతి సప్లిమెంట్
ఏప్రిల్ 1975 సంచికలో

స్నేహచిహ్నం

(నవల)

రచన: ముద్దంశెట్టి హనుమంతరావు

మరియు

మరో బోనస్ నవలిక

చదవండి!

లోగా ముగించేస్తుంది. అరకిలో బియ్యం ఏరటానికి అరగంటా? అని అబ్జక్షన్ చెప్పకండి. ఆశ్చర్యపోకండి. మన మధ్య తరగతి భారత మహిళ శాంతి సహనాలకు నిలయమని ముందే మనవిచేసేను గదా!

అయితే ఈ ఘట్టం మాత్రం సత్యజిత్ రాయ్ సినిమాకేగాదు, మరేసినిమాకు కూడా పనికిరాదు. ఎందుకంటారా? ఈ దృశ్యం అంతా పొగమయం. ఆ పొగలో మనుషులు కనపడరు. పొగనుచూపి సంతోషించే ఓపిక ప్రేక్షకులకు వుండదు గానీ మన మహిళా రత్నం మాత్రం ఏడవలేక నవ్వుతూనే బ్రతుకుతుంది. వంటావార్పూ పూర్తిచేస్తుంది. చేసేలోగా కడివెడుకన్నీళ్లు కారితే, కళ్లుబ్బితే ఏంచేస్తాం! సీతమ్మవారి కన్నీటి కథ నెమరేసుకుని తనను తనే ఓదార్చుకుంటుంది.

ఆ తరువాతి కథంతా చెప్పి మిమ్మల్ని బోరుకొట్టించటం నా అభిమతంకాదు. కానీ, సార్! లేదా మేడం! మీకు తెలియదు గనుక నా ఇవన్నీ!

అయినా మనం చాలా వాటికి అలవాటు పడిపోయాం. మామూలు విషయాల్లా చూసీ చూడనట్టు పోవటం నేర్చేసుకున్నాం! కనుక ఓసారి గుర్తుచేసుకోవటం మంచిదే గదా! కనుక.

ఈ అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో మన ఈ మామూలు మహిళామణి సంసారం చూసి సంతోషిద్దామా? లేక మహిళారత్నం ఇందిరాజీ పాలనక్రిందే మన మహిళల జీవితం ఇంత ఘనంగా ఉన్నందుకు గంతులు వేద్దామా? ఆకాశవాణిలో ఉపన్యాసా లిద్దామా?

ఇప్పుడు చెప్పండి. ఈ మహిళా సంవత్సరంలో సన్మానించేందుకు మనం ఎవర్ని ఎన్నిక చేయాలి!

ఇందిరాజీనా? లేక,

మన మామూలు మహిళనా? ★

వచ్చే సంచికనుండీ ప్రారంభం

పెళ్ళీడుకొచ్చిన యువతులకు ప్రత్యేక రచన

ఎవర్ని చేసుకోను?

(మినీ సీరియల్)

ఆద్యంతమూ నవ్వులు రువ్వే యీ రచన చేసినవారు

అబ్బూరి ఛాయాదేవి

(షరా: పెళ్ళయినవారుకూడా యీ రచన చదవవచ్చును)

పాఠకులు గమనించాలి!

మే సంచికనుంచీ జ్యోతి విలువలు పెంచుకొంటూ, పేజీలు కూడా పెంచుకొంటోంది. ఇప్పటివరకూ **128** పేజీలతో వెలువడుతున్న జ్యోతి ఇకనుంచీ **176** పేజీలతో ఒక పూర్తినవలా, సీరియల్సూ, చక్కని కథలూ కవితలూ...ఇంకా 'జ్యోతి'కి మాత్రమే ప్రత్యేకమై, పాఠక జనరంజకమైన మరెన్నో శీర్షికలతో వెలువడుతుంది.

విడి ప్రతివెల: రు. 3 సంవత్సర చందా: రు. 36

దీపావళి ప్రత్యేక సంచికతో రు. **42/=**

చందా దారులకు విజ్ఞప్తి

మే నుంచీ జ్యోతి వెల పెరుగుతున్న కారణంగా ప్రస్తుతం ఉన్న చందాదారుల చందా గడువులను కొత్త రేట్ల ప్రకారం సవరించడం జరుగుతుందని విజ్ఞప్తి.


—మేనేజింగ్ ఎడిటర్, జ్యోతి.

జ్యోతి నవలానుబంధం



చివరిభాగం చదవాలని ఆత్రపడుతున్నారు కదూ!
వెంటనే 87 వ పేజీ చూడండి!

సీరియల్



పుట్టుమని పాతికేళ్ళు లేకుండానే జీవితంలో అన్ని సుఖాలకి దూరమైన నా బ్రతుకుని గూర్చి నాకంటె అమ్మ ఎక్కువ బాధ పడేది. ఒక్కగా నొక్క కూతురు బ్రతుకు ఈవిధంగా తయారయినందుకు, నా బ్రతుకు ఈవిధంగా మారడానికి తామే కారణం అన్న పశ్చాత్తాపంతో తనలో తను కుమిలి పోయేది. నా అవస్థలు, ఇంట్లో ఆయన నన్ను పెట్టే హింసలు...క్షణం విశ్రాంతి లేకుండా నలిగిపోతూ చాకిరిచేసే నన్నుచూసి బాధ పడ్తూ ...యింట్లో ఆయన ప్రవర్తన చూస్తూ ఆవేశపడ్తూ ...ఆమెకి మనశ్శాంతి లేక ఆరోగ్యం క్షీణించడం మొదలు పెట్టింది. చాలా హై బ్లడ్‌ప్రెషర్‌తో బాధ పడడం మొదలు పెట్టింది. ''నా ఖర్మానికి నీవెందుకమ్మా బాధపడ్తావు నేనింతే పెట్టి పుట్టాను. నాకోసం నీ ఆరోగ్యం పాడు చేసుకోకు. నీవూ దూరమైతే వంటరిగా యీ జీవితంతో పోరాడేశక్తి నాకుండ దమ్మా'' అనేదాన్ని. అది వింటూ కళ్ళనీళ్ల

నింపుకునేది అమ్మ. నిజంగా అమ్మ అంటూ నాకు తోడుండబట్టి ఆ యింట్లో ఆ పరిస్థితులలో ఆ మాత్రం ధైర్యంగా బ్రతకగలిగాను. లేకపోతే - వంటరినయి ఆ బాధలకి తట్టుకోలేక పిచ్చిదాన్నయ్యేదాన్ని. యింట్లో అమ్మవుంటూ యిల్లు వాకిలిని, పిల్లలని చూసుకుంటుండబట్టి కాని లేకపోతే రోజంతా ఆస్పత్రిలో పడుండే నేను మరింత అవస్థలకి లోనయ్యేదాన్ని. అమ్మ బ్లడ్‌ప్రెషర్ చూస్తుంటే, ఆవిడకి మనశ్శాంతి లేకపోతే, ఆవిడ ఏమవుతుందోనని భయం పట్టుకుంది నాకు. ప్రతీదానికి బాధపడద్దని మందలించేదాన్ని. మందులు యిస్తూ జాగ్రత్తగా చూసేదాన్ని. మందులంటే యీయగలనుగాని ఆవిడకి మనశ్శాంతిని ఎక్కడ తెచ్చి యీయగలను? ఆవిడ మనస్తాపాన్ని తగ్గించడం నా చేతులలో వుందా?

మా కాపురం యింక చక్కపడే మార్గం మరింక లేదని అమ్మకి అర్థమైంది నాకు సరే.... ఇంకా ఆశ మిగలలేదు! ఏ విషయంలోనూ బ్రతుకుపట్ల ఆశలేదు! అయితే—

ఈ నా చీకటి జీవితంలో చిన్న వెలుగు రేఖ అయ్యాడు బావ! జీవితేచ్ఛ నశించిన యీ బ్రతుకులో, నా చుట్టూ చీకటిని కాస్తంతయినా పారద్రోలే చిన్న ఆశాదీపం బావ ఆరిపోయే నా జీవనజ్యోతికి చమురు పోసి, వొత్తి ఎగదోసి, బ్రతుకుమీద కాస్తంత ఆశ రగిలించాడు! పిల్లలని పెంచడం మాత్రమే నా బ్రతుకిక్కి అర్థంకాదని, ఎప్పటికయినా తను నావాడని, తనకోసం నేను బ్రతకాలని, మేం యిద్దరం కలిసి బ్రతకగలిగే భవిష్యత్తు వుండగలదన్న నమ్మకం ఆ ఆశతో బ్రతుకు భారం కాకుండా వుండటానికి చిన్న ఆశ, ప్రోత్సాహం అయ్యాడు బావ. వాడి, నేల రాలిపోయే నా జీవనలతకి నీరు పోసాడు. మళ్ళీ చిగురింపేట్లు చేశాడు.

52

మా కాపురం యిలా మారాక, ఆయన నామీద కక్ష సాధించడం మొదలు పెట్టాక ఆయన ఆమెని తీసుకొచ్చి నా కళ్ళ ఎదురుగా తాగి తందనాలు ఆడుతూన్నప్పుడు, అవన్నీ చూస్తున్నప్పుడు నాలో ఏదో కసి బయలుదేరేది. ఆయన ఆయనిష్టం వచ్చిన వాళ్ళతో సుఖంగా, హాయిగా వుండగా నేనేం పాపంచేశానని ఇలా అన్ని సుఖాలకి దూరమై బాధపడాలనిపించేది. ఆడదానిగా పుట్టడమా నేచేసిన పాపం? ఈ దేశంలో ఆడదానిగా పుట్టినందుకా యీ శిక్ష అనుభవించాలి అని ఆవేశపడేదాన్ని! ఆయనకి అక్కరలేని నీతి నియమాలు నాకెందుకు? ఎవరికోసం, ఎవరి మెప్పుకోసం యీ నీతి నియమాలు? నా సుఖాలన్నింటినీ బలిపెట్టి పవిత్రురాలినని, పతివ్రతనని పేరు తెచ్చుకోడంవల్ల నాకేం వొరుగుతుంది? నా అనందాన్ని, సుఖాలని త్యాగంచేసి పతివ్రతననిపించుకోడం ఎవరికోసం? యీ త్యాగం లోకం కోసమా? ఇలా జీవచ్ఛవంలా బ్రతికే నన్ను సంఘం ఏవిధంగా ఆదుకుంటుంది? నా కష్టసుఖాలతో ప్రమేయంలేని లోకంకోసం నేనెందుకిలా బ్రతకాలి— నేనూ నా యిష్టంవచ్చిన రీతిని ప్రవర్తిస్తా,

: జరిగిన కథ :

డాక్టర్ కల్యాణి దగ్గర హౌస్ కీపర్ సుజాత. కల్యాణి దగ్గర అసిస్టెంటుగా చేరిన రామకృష్ణ, సుజాతలు ప్రేమించుకున్నారు. వారి పెళ్లి కళ్యాణే జరిపించింది. కళ్యాణి భర్త డాక్టర్ రంగారావు త్రాగుబోతు. భార్యను చాలా హీనంగా చూస్తుంటాడు. బావ ఆనంద్ వచ్చి తన దగ్గర వున్నంతకాలం ఉత్సాహంగా ఉండేది కల్యాణి. ఎంతో మంచిదనుకున్న కల్యాణి భర్తను మోసంచేస్తూ బావతో ప్రేమకలాపాలు సాగించడం వింతగా అన్పించింది సుజాతకు. సుజాత అనుమాన నివృత్తిచేస్తూ తనకథ చెప్పసాగింది కల్యాణి.

కల్యాణి మామయ్య కొడుకు ఆనంద్. పేదవాడు. కల్యాణి ఇంట్లోనే ఉండేవాడు. యౌవనంలో ప్రవేశించిన కల్యాణి,ఆనంద్‌లు ప్రేమించుకొన్నారు. కల్యాణి తండ్రి వారి పెళ్ళికి ఒప్పుకోలేదు. కల్యాణి ఎదురు తిరిగింది. ఆనంద్ ఇంట్లోంచి వెళ్ళగొట్టబడ్డాడు. కళ్యాణిని బలవంతాన పెళ్లికి ఒప్పించారు. కల్యాణిని చూడటానికి ఆనంద్ చాలా కాలానికి రావడంతో ఆనందం, బాధపట్టలేక అతన్ని కౌగలించుకొని ఊరటచెందింది కల్యాణి. అదిచూచిన ఆమెభర్త రంగారావు వీరిద్దరినీ అనుమానించి, ఆనంద్‌ను అవమానించి పంపాడు. యుద్ధంలో గాయపడ్డ ఆనంద్‌ను కల్యాణి ఇంటికి తీసుకరావడంతో భార్యాభర్తల మధ్య కలత లెక్కువయ్యాయి. రంగారావు స్త్రీలోలుడై, తన ప్రియురాలిని ఇంటికి తీసుకరావడంతో పరిస్థితులు మరెంత అధ్వాన్నమయాయి. అది సహించలేని కళ్యాణి రంగారావుపై విరుచుకు పడింది. రంగారావు పిల్లల్ని తీసుకుని ఇల్లువదిలి పోయాడు-బిడ్డల ఎడబాటు సహించలేని కల్యాణి రంగారావు దగ్గరకెళ్లి తిరిగి రమ్మని ప్రాథేయపడింది. రంగారావు కల్యాణి అభ్యర్థననూ అంత తేలికగా ఒప్పుకోలేదు. చివరకు తానడిగినంత డబ్బు ఇస్తూ, తానేం చేసినా ప్రశ్నించకుండా వుండే 'కండిషన్'తో తిరిగి ఇంటికి వచ్చాడు.

నా బావతో నేనూ సుఖిస్తాను. ఆయన మీద కసి తీర్చుకుంటాను.

ఆవేశంలో అనుకోవడం తప్ప ఆచరించగలిగే ధైర్యం యీ దేశంలో పుట్టిన ఆడదానికెక్కడిది? యుగ యుగాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన సంస్కృతి అంతకు తెగించనిస్తుందా? పతివ్రతలకథలు చెప్పుకు మురిసిపోయే మన మనస్తత్వాలు యిలాంటి తిరుగుబాటు, తిరుగుబోతు ఆలోచనలని ఎలా ఆమోదిస్తాయి? ఎన్నో అనుకునేదాన్ని. బావతో చెప్పాలనుకునే దాన్ని! కాని ఎలా చెప్పగలను? నోరు విడిచి, చెప్పుకోగల సంగతా?

మొదట్లో ఆయన ఆమెని యింటికి తీసుకొచ్చి నానా అల్లరి చేస్తున్నప్పుడు క్రొత్త గనక-అలవాటు పడలేదు కనక-చాలా ఆవేశపడ్తూ, చాలా పంతంగా, పౌరుషంగా "ఆయన ఆయనిష్టం వచ్చిన వాళ్లతో తిరిగితే నేనూ నా యిష్టం వచ్చిన వాళ్లతో తిరగ్గలను తిరిగి బుద్ధి చెప్పగలను" అన్నాను. బావ అదోలా నవ్వాడు. బావ ఆ నవ్వు ఎందు కొచ్చిన మాటని

అంటున్నట్టున్న' ఆ నవ్వు చూసి నేను మరింత ఆవేశంగా'' ఎందు కలా నవ్వు తావు? ఏం నేను చెయ్యలేననుకుం టున్నావా? నాకీ లోకం, యీ మనుష్యులు అంటే భయమనుకుంటున్నావా? నా యిష్టం వచ్చినట్లు తిరుగుతాను. ఎవరడ్డం వస్తారో, నన్నేం చేస్తారో చూస్తాను. నాకేం యీ పరువు. మర్యాదలమీద ప్రలోభం ఏంలేదు.

''సరే తిరుగు...నిన్నెవరు వద్దన్నారు'' అన్నాడు చిన్నగా నవ్వి బావ.

''అదిగో ఆ నవ్వు మాను . ఆడదా న్నని నేనలా చేయలేననేగా మీ మగాళ్ల ధైర్యం'' బావ నవ్వులో భావం అర్థం అయి ఉక్రోషంగా అన్నాను. బావ అలా చిరునవ్వుతో వినోదిస్తున్నట్టు నవ్వుతూ కూర్చున్నాడు. నేను చాలా ఆవేశంగా, పౌరుషంతో ఏవేవో చేస్తానని, ఆయనకి బుద్ధి చెప్తానని, యిలా మేమూరుకోబట్టే మా స్త్రీ జాతి ఎన్నాళ్లయినా అట్టడుగునే పడివుంటుందని, మగాడికి అక్కరలేని నీతి నియమాలు ఆడవాళ్ల నెత్తిన రుద్దడం అన్యాయమని, తర తరాలుగా సంస్కృతి, పవిత్రత, శీలం అన్న పేరుకి స్త్రీని బంధించి పతివ్రత, ధర్మపత్ని అంటూ బిరుదులిచ్చి స్త్రీలని పొగిడి, మంచి చేసు కుని తమ గుప్పిటలో వుంచి ఈ మగాళ్లు ఆటలాడుతున్నారని, ఈ నాటి స్త్రీ కళ్లు విప్పి తనకి జరిగే అన్యాయాలని చూడ గలగడం నేర్చుకుందని ఆ అన్యాయాలని ఎదుర్కోగలిగే ఆత్మస్థైర్యాన్ని అలవరుచు కుంటుందని, ఇంక మమ్మల్నిలా నీతి నియమాలపేరుతో బంధించి మీ యిష్టం వచ్చినట్లు ఆటలాడే అవకాశం మరి యీయ మని ఏమిటేమిటో ఆవేశంతో ఉపన్యాసం యిచ్చినట్లు వాగాను.

అంతా విని ''కళ్యాణీ, నిజంగా నీ విప్పుడు చెప్పిందంతా మీ స్త్రీలు చేయ గలిగిననాడు అందరికంటె ముందు ఆనం దించేవాడిని, అభినందించేవాడిని నేనే అవు తాను! కానీ కళ్యాణీ ఇన్ని కబుర్లు చెప్పిన నీ సంగతే ఆలోచిద్దాం. ఏదీ ఈ ఆవేశం కార్యా చరణలో పెట్టగలవేమో ప్రయత్నించు? లాభంలేదు కళ్యాణీ! రక్తంలో జీర్ణించుకు పోయిన యీ భావాలు, యీ సంస్కృతి అంత సుళువుగా మరిచిపోలేం. నీవు మారినా నీ చుట్టూ మారని మనుష్యుల మధ్య, మారని సంఘం మధ్య నీవు బ్రతకలేవు. నిన్ను కాకుల్లా పొడుస్తారు ఈ మనుష్యులు...మనిషి సంఘజీవి! ఎవర్నీ లెక్కచెయ్యం, ఎవరి అవసరం మాకు లేదని సంఘంమధ్య బ్రతకలేం. మన కవసరం లేకపోయినా మనతో సంఘానికి అవసరం వుంది.ఆ మార్పు నీవనుకున్నంత సుళువుగా రాదు! మంచో చెడో కొన్ని కట్టుబాట్లు, నియమాలు వున్నాయి. అవి ఉల్లంఘించడం, ఉల్లంఘించి మర్యాదగా బ్రతకగలగడం అన్నంత సుళువుగాదు మార్పు అన్నది మంచికైనా, చెడుకైనా రావడానికి కొంతకాలం పడ్తుంది. ఆడ వాళ్ళు గుమ్మం బయటికి రాకూడదనే రోజునించి చదువుకుని ఉద్యోగాలు చేసే దశకి రావడానికి యిన్నేళ్ళు పట్టింది.''

''అవును పడ్తుంది. నాలాంటి చేత కాని ఆడవాళ్ళు. అసమర్థులు వుండగా


మీ ఇంటిని హాయిగా ఉంచుకోవాలంటే
ఒక్కసారి సందర్శించండి
చీరెలు, దుప్పట్లు కర్టెన్లు ఇంకా అన్నిరకాల
గుడ్డలకి మీరు కోరుకున్న మేలయిన అద్దకమును
పొందగలరు
బాటిక్
హోమ్
మోహన్ టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్
185, రాయపేట హైరోడ్. మద్రాసు-600014
ఫోన్.811344
పర్సనల్.811388
Prabhakar.

ఎందుకు పట్టదు? యుగయుగాలుగా కట్టి పడేసిన యినప గొలుసులని విప్పుకునే శక్తన్నా మాకెక్కడ మిగిల్చారు? అన్ని విధాలుగా, అన్నివైపులనించి ఆడది, అబల అని మాకు మామీదే నమ్మకం పోయేట్టు, మా శక్తి సామర్థ్యాల మీద మాకే అపనమ్మకం కలిగేట్టు పిరికిమందు పోశారు. నీతి, శీలం, పవిత్రత బంధాలతో మమ్మల్ని బంధించి చీకటి గదుల్లో పారేశారు. ఆ చీకటిలో మగ్గడం అలవాటయిన మాకు వెలుగనేది వుంటుందని తెలియక అది చీకటే సహజం అనుకుంటు గుడ్డిగా కళ్ళుమూసుకు బ్రతికాం. కానీ, మా అదృష్టమో, మీ దురదృష్టమో . .''

''బంధాలు విప్పుకున్నారు. చీకటికి వెలుగుకి తేడా తెలుసుకున్నారు. ముందుకి వెలుగులోకి నడిచారు. గుడ్ పదండి ముందుకు.'' నా ఆవేశానికి చప్పట్లు కొడుతూ నవ్వుతూ అన్నాడు బావ.

''నవ్వకు బావా! మా బాధ మీ కెలా తెలుస్తుంది. మీ మగాళ్ళు దేన్లోనూ మా కంటె గొప్పవాళ్ళకరని, మాకోనీతి,మీకో నీతి; మీకోన్యాయం, మాకోన్యాయం పనికి రాదని చెప్పేరోజు రాకపోదు. అయితే నీవన్నట్టు ఆ మార్పు ఒక్క రోజులో రాదు. అంతవరకు నాలాంటి అభాగ్యులు కుమిలి కుమిలి ఏడ్చి కృంగి కృశించి పోతారు. ఎందరో నాలాంటి అభాగినులు ఆత్మార్పణ చెయ్యాలి. బలికావాలి.'' అప్రయత్నంగా నాకళ్ళలో నీరునిండింది. బావకి మొహం చూపలేక ప్రక్కకి తిప్పుకున్నాను.

'కళ్యాణీ!'బావ దెబ్బతిన్నట్టు చూశాడు. నేను మాట్లాడలేక చేతుల్లో మొహం కప్పుకుని ఏడవసాగాను. బావ లేచివచ్చి నా ప్రక్కన కూర్చుని నా చేతులు పట్టుకున్నాడు.

''బాధ పడ్తున్నావా కళ్యాణీ!' అన్నాడు విచలితుడై.

'బాధ! బాధపడడంకంటె చేయగల్గింది ఏముంది? బాధకి బాధపడే స్టేజి కూడా దాటి పోతూంది బావా!' అన్నాను ఏడుస్తూ. ''నేనేం పాపం చేశానని నన్నిలా శిక్షిస్తున్నాడు దేముడు. ఏ నేరానికి నన్నింత క్రూరంగా హింసిస్తున్నాడు. నా బ్రతుకుతో ముందునించి ఎందుకిలా ఆడుకుంటున్నాడు.''

బావ అలా ఎంతోసేపు ఏం మాట్లాడకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు. అలా నాచేయి నిమురుతూ ఆఖర్న 'ఏడవకు కళ్యాణీ, నీబాధ నా కర్థం అవుతూంది. కానీ నీవు నీతోపాటు నేను నిస్సహాయులం' అంటూ మొహం త్రిప్పుకుని గదిలోకి వెళ్ళిపోయాడు. పిచ్చిబావ! యీ దేశంలో యీ మనుష్యుల మధ్య బావ మాత్రం ఏం చెయ్యగలడు. అనుకుని కన్నీళ్ళు తుడుచుకున్నాను.

ఇలాగే బావ ఎప్పుడు వచ్చినా ఈ ప్రసంగం ఏదో ఒకవిధంగా మా మధ్యకి వచ్చేది. బావలేనప్పుడు ఏదో నిర్లిప్తంగా, గానుగెద్దులా జీవితం గడపగలిగే నాకు, బావని చూసేసరికి మానుతున్న గాయాన్ని కెలికి నట్లయ్యేది! ఈ జీవితంతో రాజీపడి బ్రతికే నా మనసు మళ్ళీ తిరగబడేది! నేను కోల్పోయిన సుఖాలకోసం మనసు, శరీరం

ఏకమయి తిరగబడి నన్ను నిలేసేవి। నేనంతగా ప్రేమించిన బావ ఎదుటబడగానే నాకు తెలియకుండానే చలించే దాన్ని। బావ కౌగిట్లో నా యీ దుఃఖం అశాంతి మరిచిపోయి ఓదార్పు పొందాలనిపించేది బావ వడిలో శారీరకంగా, మానసికంగా అలిసిపోయిన నేను విశ్రాంతి తీసుకోవాలనిపించేది. అలాచేసే ధైర్యంలేక, చెయ్యలేని పిరికితనం అడ్డురాగా నామీద నాకు కోపం ఎవరి మీదో కసి। ఈ లోకంమీద కక్ష। తప్పు ఒప్పుల మధ్య మానసిక సంఘర్షణ, నీతి అవినీతికి మధ్య ఊగులాట. ఆవేశానికి, పిరికితనానికి మధ్య కొట్టుకోడం. కోరికలకి, పవిత్రతకి మధ్య నలిగిపోవడం, నా పరిస్థితి దుర్భరంగా వుండేది. ఆ సంఘర్షణలో పూర్తిగా ఓడిపోలేక, గెలిచేశక్తిలేక నలిగిపోయేదాన్ని. ఆ ఆవేశాన్నంతా ఎవరిమీద చూపాలో తెలియక, బావ నన్నర్థం చేసుకోడంలేదని కోపంవచ్చేది। యీ నీతి, శీలం అన్నవంతా ట్రాష్ అని మనసు చెప్పినట్లు నడవాలని బావ ఎందుకు ప్రోత్సహించడు అని వళ్లుమండేది। "నేనున్నాను నీకు తక్కిన లోకంతో నీకేమిటి అని ధైర్యంచెప్పి నన్నెందుకు ఓదార్చడు అని ఆవేశ పడేదాన్ని. ఏ బావకోసం అయితే నేను నాజీవితాన్ని యిలా అర్పణ చేసుకున్నానో ఆ బావ లోకానికి భయపడి నన్నిలా దూరం చేస్తాడా అని ఉక్రోషంగా అనుకునేదాన్ని। మగాడయివుండి, జనకాశాన్ని జారవిడుస్తూ పెద్ద పవిత్రుడి ననుకోడం చాతగాని తనంగాని గొప్పేమిటి." అని కసిగా కూడా అనుకునేదాన్ని.

ఈ ఆవేశం బావసమక్షంలో కాస్త కాక పోతే కాస్తయినా దూకేసి. నా దూకుడు నా ఆవేశంచూసి బావ నవ్వేవాడు. ఆ నవ్వు చూసి . 'నవ్వడం మాత్రం వచ్చు ' అని కవ్వించేదాన్ని. "అయితే ఏడవమన్నావా?" "అంతేలే. నీవు, నేను చేయగల్గింది" అన్నాను ఉక్రోషంగా.

"నీకీమధ్య ముక్కుమీద కోపం వస్తూంది. ఏదన్నా కరుస్తున్నావు."

'కోపంకాక మరేమిటి వస్తుంది. నీలాంటి వాళ్ళని చూస్తే."

"నాలాంటి వాళ్ళంటే."

"నీలాంటి చాతకాని వాళ్ళని చూస్తే" కసిగా నొక్కి అన్నాను. బావమొహం ఎర్రపడింది. అలా నామొహంలో ఏదో వెతుకుతున్నట్టు చూశాడు. బావ అలా చూస్తుంటే అలా అంత చులకనగా మాట్లా డక పోవలసిందేమో ననిపించి తలదించు కున్నాను. బావతో కళ్లు కలపలేక, రెండు మూడుక్షణాలు పోయాక వున్నట్టుండి,

'కళ్యాణీ! నాతో లేచిరాగలవా? ఇద్దరం వెళ్ళిపోదాం" అన్నాడు. నేను తెల్లపో యాను. నామొహం ఎర్రబడింది. జవాబు ఏం చెప్పాలో తెలియక తడబడ్డాను.

"ఏం కళ్యాణీ, రాలేవా నాతో" అన్నాడు మళ్ళీ సవాల్ చేస్తున్నట్టు.

నే నలా హేళన చేశానని యిలా అడుగుతున్నాడు. చెప్పక్కర లేదు. నేను రాలేననే గదా! యిలా అడగడం?

"ఏం, ఎందుకు రాలేవు!" రెట్టించాడు బావ "నీకీ మనుష్యులు, సంఘం, పరువు మర్యాద ఏమీ అక్కర లేదన్నావుగా!"

"మహా తీసికెళ్ళేవాడిలాగ పెద్ద కబుర్లు చెప్పకు" ఉక్రోషంగా అన్నాను.

"నేను తీసికెళ్ళగలనో లేదో తర్వాత చూద్దువుగాని, ముందునీవు వచ్చేది లేనిది చెప్పు. పెళ్ళి అంటే చేసుకోలేంగాని, లేచిరావడానికేం?" బావ ఆమాట పదే పదే అంటుంటే జవాబు చెప్పలేని నిస్సహా యతతో కోపం ముంచుకు వచ్చింది. "ఇదిగో బావా, నేనొకటి అంటే నీవోటి అంటూ మాట తప్పించి పెద్ద కబుర్లు చెప్పకు. నే అన్నది యిదికాదు."

"మరేది?" నిలేశాడు బావ. ఏం చెప్పను? ఎలా చెప్పను? ఉక్రోషంగా మొహం ఎర్రపరుచుకున్నాను. "నే చేయ లేనని తెలిసే అడిగి నన్ను దెబ్బతీస్తు న్నావు కాదూ, ఆఖరికి, ఆఖరికి నీకూ నామీద సానుభూతిలేదు. నీకూ లోకు వయింది నాబ్రతుకు." నేరం బావమీదకి తోస్తూ తప్పించుకున్నాను. కాని కళ్లలో నీరు నిండింది. నా కన్నీరు చూసి బావ మళ్ళీమామూలు అయ్యాడు. తనమామూలు నవ్వు నవ్వాడు.

"కళ్యాణీ, నా పిచ్చి కళ్యాణీ. నీవాపని చెయ్యలేవని నాకు తెలుసు! రంగారావుగారి భార్యగా వుండగా నీవాపని ఎలా చెయ్య లేవో, నీవు రంగారావు భార్యగా వుండగా నేనూ నీవనుకునేది చెయ్యలేను."

"ఇంకా, నేను రంగారావు భార్యననే నమ్ముతున్నావా?' కళ్ళనీళ్లు విసురుగా తుడుచుకుంటూ అన్నాను.

"నీవు, నేను అనుకోకపోయినా లోకం దృష్టిలో నీవింకా రంగారావు భార్యవే!"

"హుం! లోకం! లోకానికంతకూ తెలుసు మా యిద్దరి మధ్య భాగోతం. ఎవరికీ తెలియ దనుకుంటే అది మన తెలివి తక్కువతనం. యింకా యీలోకం నా పవిత్రతని నమ్ముతుం దనుకుంటున్నావా? అయినా పాడులోకం ఎవరో ఏదో అను కుంటారని.''

"ఎవరినీ లెక్కచెయ్యక పోయినా, నీ మనసన్నది ఒకటుంటుంది. దాన్ని మభ్య పెట్టగలవా? నీ విలా యిక్కడున్నంత కాలం, ఆయన నీవు చట్టబద్ధంగా విడిపో నంతకాలం మనం చేసేది వ్యభిచారం. చాటు మాటు వ్యవహారంగానే వుండాలి. మనం ఏ పరిస్థితుల్లోవున్నాం అన్నది ఎవరికీ అక్కరలేదు. మనంచేసేది తప్పుగాకాక ఒప్పుగా చెలామణికాదు. ఎవరికో అక్కర లేదు మనకే ఏదో దొంగతనం, ఏదోపాపం చేస్తున్నట్లు పాపభీతితప్ప ఆనందం కన్పిం చదు. సహజంగా వుండదు. కళ్యాణీ, నీమీద నాకెంత ప్రేమవున్నా రంగారావు భార్యగా నీ వున్నంతకాలం, నీవు నా దానివి కావన్న నిజం అనుక్షణం గుర్తువస్తుంటే నీవు నాదానివని ఎలా అనుకోగలను? నా మనసు అందుకు అంగీకరించడంలేదు కళ్యాణీ అసలు నా ఆలోచనలూ అప్పు డప్పుడు పెడత్రోవను పడుతూంటే, నేను ఎంతో ప్రేమించిన నీవు నే కావాలంటే దగ్గిర చేసుకోగలనని, ఆ అవకాశా లున్నా యని తెలిసే నామనసుని ఎంత నిగ్రహించు కుంటున్నానో నీకేం తెలుసు! ఇలా తప్పు ఒప్పుల మధ్య, నీతి నియమాలు, కోరికల మధ్య ఊగిసలాడే మనసుని.''

"మనసులో నేను కావాలనుకుంటూ, నన్ను ప్రేమిస్తూ, పైకి లోకంకోసం పవి త్రంగా వుండాలనుకోడంలో ఆత్మవంచన లేదా? పవిత్రత శరీరానికి వుంటే చాలా, మనసుకి అక్కరలేదా?'' తీవ్రంగా ప్రశ్నిం చాను. "మనం ఒకరినొకరం మన స్ఫూర్తిగా వాంఛించుకుంటూ, శరీరాలు మాత్రం పవిత్రంగా వుంచుకోడంలో నా మొగుడికి చేసే ద్రోహం వుండదా! భర్తని ప్రేమించలేక మరొకరిని ప్రేమించడంలో లేని ద్రోహం, అపవిత్రత కేవలం శరీ రానికి మాత్రం అంటుతుందా!''

బావ కళ్లు దించుకున్నాడు. "ఆరా ధనలో అపవిత్రతకి చోటులేదు కళ్యాణీ. ఎవరి తోటలోనన్నా చక్కగా విరిసిన అందమైన పూవుని అందరూ చూడచ్చు. ఆ పూవు అందాన్ని మెచ్చుకోవచ్చు. ఆ సోయగానికి పులకించవచ్చు. ఆ పూవు కావాలని ప్రలోభపడడం మానవ సహ జం . కాని, దొంగచాటుగా వెళ్ళి ఆ పూవు కోసి తెచ్చుకోడం నేరం గాదూ ... మనసన్నది మనిషి చెప్పుచేతల్లో వుండక పోవచ్చు కాని. శరీరాన్ని అదుపాజ్ఞల్లో వుంచుకోగలం.''

"బావా! ఆ పూవు ఎవరికీ అక్కర లేనిది అయి, ఆ పూవు అందాన్ని చూసే వారు, కావాలనుకునేవారు. ఆస్వాదించే వారు ఆ యింట్లో ఎవరూ లేకపోతే అలా వృథాగా వాడి నేల రాలిపోయేకంటె ఎవ రన్నా కోసుకుని ఏ దేముడి పాదాలముందో తనని అర్పించాలని, ఏ ప్రియుడో ప్రియు రాలి జడలో తురిమి తన్మయించే క్షణ

కాలం కావాలని కోరుకుంటుంది గాని ఎవరికి పనికిరాకుండా తను వాడి నేల రాలాలని ఆ పూవుకి వుండదు బావా! ఆ చెట్టు నాటిన మనిషి అది చిగురించి పుష్పించే వేళకి ఎక్కడికో వెళ్ళిపోతే, తాత్కాలికంగా ఆ యింటిని మరెవరో ఆక్రమిస్తే .. ఆ పువ్వుని ఆ మాత్రం కోసుకునే అధికారం పూర్తిగా కోల్పోయి నట్టేనా?'' ఆవేశంగా ప్రశ్నించాను.

''ఆ యింటితోపాటు ఆ మొక్క పరాయి సొత్తయ్యాక యింకే హక్కు మిగులుతుంది కళ్యాణీ.''

''ఆ యింటివారు ఆ మొక్కకి నీళ్ళయినా పోయకుండా వదిలేసి లేచి పోయారు. అలా వాడిపోతూ చావలేక బ్రతకలేక ఎప్పుడో వచ్చి కురిసే వర్షం చినుకుల ఆసరాతో కాస్త కాస్త చిగురిస్తూ బ్రతుకుతూ ఓ పూవు పూసింది. అలనా పాలనా చూడకుండా వదిలేసి పోయినా, ఆ యింటి ఆవరణలో వుంది గనక యింకా ఆ యింటివారికే చెందుతుం దంటావా ఆ పూవు. ఎవరి ఆసరాతో వేళ్ళను తన్ని, ఒగిర్చి బ్రతికిందో ఆ మనిషికి ఆ మొక్కమీద ఏ చిన్న హక్కూ, అభిమానం మిగలదా? ఆ మనిషే, తనది కాదు కనక తన చేతుల్తో నాటిన మొక్క వాడిపోతున్నా చూస్తూ వూరుకుంటాడా? తన కన్నబిడ్డ ఆకలికి మలమల మాడి చచ్చిపోవడానికి సిద్ధంగా వుంటే కన్నతల్లి దొంగతనం కాదు, వళ్ళమ్ముకునైనా తన బిడ్డని దక్కించుకోడానికి తాపత్రయ పడు తుంది. ఆ తల్లికి ఆ క్షణంలో గుర్తు రావలసింది నీతి, ధర్మం, న్యాయం కాదు. తన బిడ్డ. ఆకలితో మాడే బిడ్డ మాత్రమే! అలా కాక ఆ సమయంలోనూ నీతికోసం ప్రాకులాడితే ఆమె నిజమైన తల్లిగాదు. అలాగే, తన చేతుల్తో నాటిన ఆ మొక్క తన కళ్ళముందే చావడానికి సిద్ధంగా వుంటే చూస్తూ వూరుకోడం...''నా గొంతు ఆవేశంతో వణికింది. పెదాలు అదిరాయి. మాట తడబడింది. బావ ఆశ్చర్యంగా, వింతగా అలా నా మొహంలోకి చూస్తూ ''కళ్యాణీ....కళ్యాణీ...'' అన్నాడు ఆరా టంగా. చప్పున నా ఆవేశం దిగజారి పోయింది. సిగ్గుతో మొహం త్రిప్పు కుంటూ ''ఏమిటో వాగుతున్నాను అర్థం పర్థం లేకుండా. కాదూ.''

బావ తదేకంగా అలా చూస్తూ ''కళ్యాణీ... నిజంగా నీవిలా అనుకుంటు న్నావా'' అన్నాడు ఆశ్చర్యంగా. నేను తల దించుకున్నాను. బావ ఏదో ఆలోచిస్తున్న ట్లుండిపోయాడు.

53

నా మానసిక వేదన, శారీరక శ్రమ రెండూ కలిసి, నా ఆరోగ్యంమీద దెబ్బ తీయసాగాయి. అధిక శ్రమ, అనుక్షణం నన్ను పీల్చివేసే అశాంతి, యీ రెండూ కలిసి నన్ను మానసికంగా, శారీరకంగా కృంగదీయసాగాయి. రోజురోజుకి క్షీణించి పోసాగాను. మొఖంలో కాంతి లేదు. కళ్ళక్రింద నల్ల చారలతో కళ్ళు, దవడలు పీక్కుపోయి, రంగంతా పోయి, ఏభై ఏళ్లు పైబడి వృద్ధాప్యం వచ్చేసినట్లు ఒకే అలసట, నీరసం, నిస్తేజం, నిరుత్సాహం!

నా బ్రతుకులో యింకేమి మిగలనట్లు, చరమాంకంలోకి అడుగుపెట్టినట్లు బ్రతుకు పట్ల విరక్తి। ఈ సంసారాన్ని యింక యీదలేనన్న అధైర్యం, నాకు కావల్సింది దొరకలేదన్న కసి, సంపాదించుకోలేని పిరికితనం, ఎవరికీ చెప్పుకోలేని దైన్యత, యివన్నీ నామీద ఎంత దెబ్బతీసి వుంటాయో ఆలోచించు. క్రమక్రమంగా క్షీణించిపోతున్న నన్ను చూచి అమ్మ ఏడిచేది. అద్దంలో నా మొహం చూసుకోడానికి నాకే వెగటనిపించేట్టు తయారయింది నా ఆకారం.

మూడునెలల తర్వాత మళ్ళీ వచ్చిన బావ నన్ను చూసి నిర్ఘాంతపోయాడు. "కళ్యాణీ, ఏమయింది? ఏమిటిలా అయిపోయావు? నీకేమయింది" అంటూ ఆత్రుతగా అడిగాడు. "వంట్లో బాగులేదా? నాకు రాయనన్నా లేదేం" అంటూ ఆరాటంగా అడిగాడు.

"ఎందుకు రాయడం? నీవేం ఆర్చేవాడివా, తీర్చేవాడివా?" నిర్లిప్తంగా జవాబిచ్చాను.

"కళ్యాణీ," దెబ్బతిన్నట్టు చూశాడు బావ. "అవును నీవు నాకేం అవుతావని నా కష్టసుఖాలు నీతో చెప్పుకోవాలి" కఠినంగా అన్నాను. బావ అత్యాశ్చర్యంగా చూశాడు.

"కళ్యాణీ నీకేం అయింది? ఎందుకిలా అయ్యావు....ఏం జరిగింది?"

"ఇంకా ఏం జరగాలని నీ ఉద్దేశ్యం? ఇంకా నేను సర్వనాశనం కావడానికి ఏమన్నా మిగిలిందా?" బావ నిరుత్తరుడై చూస్తూండిపోయాడు.

"చూడు, ఇంకా బాగా చూడు. నీ కళ్యాణి నీ ధర్మమా అని ఎలా నాశనం అయిందో చూసి సంతోషించు. నేనిలా నాశనం అవడమేగా నీకు కావాలి ...

ఇంకేం, నీ కోరిక తీరింది. ఆనందించు బాగా'' వెర్రి నవ్వు నవ్వాను. నా కసి, కోపం అంతా బావమీద చూపిస్తూ. ''కళ్యాణీ! ఏమిటిలా మాట్లాడుతున్నావు" అంటూ ఆదుర్దాగా వచ్చి నా చేయి పట్టుకున్నాడు. విసురుగా విదిలించుకున్నాను. ''ముట్టుకోకు నన్ను, నన్ను ముట్టుకుంటే మైల పడతావు. వదులు... ముందు వదులు నన్ను....నన్ను చూస్తే అపవిత్రత అంటుతుంది నీకు. వెళ్లు...నా మొఖం చూడకు... నా దగ్గిరకు రాకు...నా కెవరూ లేరు .. నే నెవరికీ లేను....వెళ్లు'' అంటూ హిస్టిరికల్‌గా ఏడుస్తూ అరిచాను. బావ దిగ్భ్రాంతుడై ఒక్క క్షణం నిలబడి, తరువాత చటుక్కున వచ్చి నేల వ్రాలిపోతున్న నన్ను పట్టుకున్నాడు. ''కళ్యాణీ, అయ్యో ఏమిటి, నీ వళ్ళిలా కాలిపోతూంది.''

"కాలిపోతున్నది వళ్లు కాదు .. మనసు! మండి బూడిద అవడానికి సిద్ధంగా వుంది. వదులు నన్ను....నేను చచ్చిపోతాను.... యింక యీ బ్రతుకు నా కక్కరలేదు. ఈ బ్రతుకు, యీ వంటరి బ్రతుకు నా కక్కర లేదు .... వదులు .. '' అంటూ గింజుకున్నాను. కానీ బావ బలమైన చేతులనించి తప్పించుకోలేక బావ చేతులలో తోటకూర కాడలా రాలిపోయాను.

అప్పటికి రెండురోజులుగా బొత్తిగా నా వంట్లో బాగులేదు. లోలోపల జ్వరం వుందని నా అనుమానం. వళ్లు నెప్పులు. తల దిమ్ము, నీరసం అయినా అలాగే మొండిగా ఆస్పత్రికి వెళ్ళిపోయాను. అమ్మకి చెప్పలేదు. మందు వేసుకోలేదు. ఏదో నిర్లక్ష్యం. ఏదో విరక్తి. కాని ఆ రోజు ఉదయం లేచేసరికి వళ్లు స్వాధీనం లోకి రాలేదు. వళ్లంతా వకటే నెప్పులు, తల బరువు. రెండు రోజులు నిర్లక్ష్యం చేసిన జ్వరం ఆ రోజు ఎక్కువయి నన్ను వశం చేసుకుంది. ప్రక్కమీదనుంచి లేవ లేకపోయాను. ఆస్పత్రికి వెళ్ళలేక పోయాను. అప్పుడొచ్చిన బావని చూసే సరికి జ్వరం, నీరసం, ఆవేశం అన్నీ కలిసి నన్నో రకం విరక్తితోపాటు ఉద్రేకంతో పడేశాయి. నన్ను నేను మరిచి పోయాను. అయితే అంతటి ఆవేశానికి, ఉద్రేకానికి తట్టుకోలేని నా నీరస దేహం, మనసు, ఆ ఉద్వేగానికి నన్ను అదో అర్ధ అచేతనావస్థలో పడేశాయి ... నా కళ్ల ముందు చీకటి వలయాలు .... నిలబడలేక కూలిపోయిన నన్ను బావ పొదివి పట్టుకున్నాడు. రెండు చేతులతో ఎత్తి ప్రక్క మీద పడుకోబెట్టాడు. ఏదో కలలోమాదిరి, మెలకువ, మగతగాని ఆ అవస్థలో అలా ప్రక్కమీద నిస్తేజంగా పడివున్న నాకు బావ గొంతు ఏదో కలలోమాదిరి వినిపించ సాగింది. ''కళ్యాణీ, కళ్యాణీ ..నన్ను క్షమించు. మూర్ఖుడిలా ప్రవర్తించాను యిన్నాళ్ళూ. వెధవ ప్రిన్సిపల్స్. అర్ధం పర్ధం లేని సెంటిమెంట్స్‌తో నన్ను నేను మోసం చేసుకుంటూ నిన్ను బాధించాను. కళ్యాణీ ...నీవు నాకు కావాలి, నాకోసం బ్రతకాలి. కళ్యాణీ నీకోసం, నీ సంతోషం కోసం, నీ సుఖంకోసం యీ ప్రపంచం అంతా ఏకమై అడ్డు నిలిచినా చివరి క్షణం వరకు పోరాడుతాను. నీ కోసం, నీ ప్రేమ

కోసం ఏదన్నా చేయడానికి సిద్ధంగా వున్నాను. నీవు నాకెంత కావాలో, నేను నీకెంతగా అవసరమో అర్థం చేసికోడానికి యిన్నిరోజులు పట్టింది. నా ప్రేమ నీకెంత అవసరమో బోధపడింది కళ్యాణీ, యింక నిన్నెప్పుడూ బాధించను. ఇంకీ వెధవ లోకం ఏమనుకున్నా లెక్కచెయ్యను. నీ ప్రేమ ముందు యీ నీతి నియమాలేమిటి? యీ కట్టుబాట్లేమిటి అన్నింటిని తృణప్రాయంగా తీసిపారేస్తాను. నన్ను నమ్ము. యీ క్షణంనించీ నీవు నాదానివి. యింక ఏ శక్తీ నన్నడ్డలేదు కళ్యాణీ' బావ పూర్తిగా చలించిపోయి, ఆవేశంగా, ఆరాటంగా నన్ను గుండెలకి హత్తుకుంటూ, నా తల నిమురుతూ, నా కళ్ళంతా స్పృశిస్తూ పదేపదే ఆవేశంగా కళ్యాణీ కళ్యాణీ అంటూ నన్ను గుండెలకి అదుముకుంటూ కన్నీళ్ళతో అంటున్నమాటలు చెవులో వినిపించాయి. బావ మాటలు మండే నా హృదయంమీద పన్నీటిజల్లు కురిపించింది. కాలిపోయే నా శరీరానికి బావ స్పర్శ చల్లని మంచిగంధం పూసినట్లనిపించింది. కళ్ళు విప్పాను బావ నావంక ఆదుర్దాగా చూస్తున్నాడు బావ కళ్ళలో నీళ్ళు. బావ మొహంలో ఆరాటం. 'బావా, నన్ను వదిలిపోకు బావా,' అంటూ బావ గుండెల్లో మొహం దాచుకుని వదిలితే పారిపోతాడన్నట్టు గట్టిగా బంధించాను చేతులు. "బావా, నీవు లేకుండా నేను బ్రతకలేను. నీ ఆసరా కావాలి నాకు. నీ తోడు లేనిదే యీ వంటరి జీవితాన్ని యీదలేను యింక, లోకం అంతా కలిసి మనల్ని వెలేసినా నీవు నన్ను వదలిపోకు. ఒక్క నీ వుంటే యింకేం అక్కరలేదు నాకు." అంటూ వెక్కివెక్కి ఏడ్చాను. "వెళ్ళను కళ్యాణీ, నన్ను నమ్ము, యిన్నాళ్ళు తెలివి తక్కువగా ప్రవర్తించి నిన్ను హింసించాను, యింక నిన్ను బాధపెట్టను." అంటూ బావ నన్ను గుండెలకి పొదువుకున్నాడు. నేనలా కళ్ళు మూసుకుని వుండిపోయాను అలసటగా.

అదే సమయంలో ఆయన, అమ్మ లోపలికి వచ్చారు లోపలికి. "చూడండి, బాగా చూడండి, ఇన్నాళ్ళు నామాట నమ్మలేదు మీరు. మీ కూతురు పతివ్రత అని అన్నారుగా! యిప్పుడు చెప్పండి! ఇప్పుడు ఏమంటారు?" ఆయన గొంతు విని బావ, నేను ఈ లోకంలోకి వచ్చాం! నేను కళ్ళు విప్పాను. ఆయన అమ్మ గుమ్మంలో నిలబడ్డారు. ఆయన మొహంలో గర్వం, తిరస్కారం, హేళన అన్నీ కన్పించాయి అమ్మ! చూస్తున్నది నమ్మలేనట్టు నోరు తెరుచుకుని నిర్ఘాంతపోయి చూస్తూంది. వాళ్ళని చూస్తూ ఒక్కక్షణం కంగారు పడ్డాను కాని, అంతలోనే ఏదో తెగింపే కాక, అలా అక్కడనించి లేవలేనంత నీరసం, నిర్లిప్తత వచ్చింది. లేచే ప్రయత్నం చెయ్యలేదు.

"కళ్యాణీ!" అమ్మ గర్జించింది. బావ నెమ్మదిగా జాగ్రత్తగా నన్ను తలగడమీద పడుకోబెట్టి, తొణక్కుండా బెణక్కుండా నెమ్మదిగా లేచి నించున్నాడు. అమ్మ చరచర నా దగ్గిరకి వచ్చి "ఛీ! ఛీ! కళ్యాణీ! ఆఖరికి యిలా తయారయ్యావా? యింతకి

తెగించావా? సిగ్గెలా లేకపోయిందే నీకు? నా కడుపున చెడబుట్టావే!'' ఆవేశంగా అమ్మ ఏవేవో అంటూంది. నేనలా చూస్తూ పడుకున్నాను

''అత్తయ్యా!'' వారించాడు బావ. ''ఛీ! నన్నలా పిలవకు నీచుడా, యిదా ఆఖరికి నీవు చేసేపని, తిన్నయింటి వాసాలు లెక్క పెట్టేట్టు తయారయ్యావా! అసలు నీవేరా, నీవేరా! దాని బ్రతుకు యిలా పాడుచేశావు నీవల్లేరా దాని కాపురం యిలా తగలబడింది. అప్రాచ్యుడా, తల్లి తండ్రి లేని వాడివని యింటికి తీసుకొచ్చినందుకు మా యింట సర్వనాశనంకి కారకుడవయ్యావు! అందరిని నాశనం చేశావు! యింకా యీ విధంగా కూడా దాన్ని నాశనం చేయడానికి పూనుకున్నావన్నమాట!'' అమ్మ బావకి మాట్లాడే సందీయకుండా కోపంతో దుమ్మెత్తి పోసింది.

''అత్తయ్యా, నీ వన్నదంతా నిజమే! కళ్యాణి జీవితం నాశనం కావడానికి నేనే కారణం! యిప్పుడు కనీసం, ఆమె నాశనం అయిపోకుండా కాపాడాలనే తపనతో, నేను చేసింది మీ రందరూ తప్పనుకున్నా, ఆమె కోసం, తనని బ్రతికించుకోడం కోసం నేను దేనిని లెక్కచెయ్యను యింక! మీ అందరి దృష్టిలో మేము ఎంత దిగజారినా, లోకం అంతా కలిపి మమ్మల్ని వెలేసినా మాకు పరవాలేదింక! యింకా యీ లోకం కోసం, నీతి నియమాల పేరుతో కళ్యాణిని బలిపెట్ట దలచుకోలేదు.''

అమ్మకి బావ అంటున్నది అర్థం అయినట్లు లేదు. ''నోర్మూయరా! చేసింది చాలక యింకా ఏమిటి గొప్పగా చెపుతున్నావ సిగ్గుతో తలవంచుకోవాల్సిందిపోయి.''

''నేను తప్పు చేశానని అనుకోడం లేదు అత్తయ్యా'' బావ తలెత్తి ధీమాగా అన్నాడు. ''చూడండి అత్తగారూ: ఆ మాటలు చూడండి, తప్పు చెయ్యలేదుట. ఇంకోడి పెళ్లానితో కులకడం తప్పుగాదుట!'' ఆయన చిన్నపిల్లాడిలా అమ్మతో అన్నారు. బావ తిరస్కారంగా చూశాడు. ''రంగారావుగారూ, రత్నంని బొగ్గు అనుకుని మీరు యింట్లోంచి తీసికెళ్ళి పెంట కుప్పమీద పారేశారు. అది రత్నం అని తెలిసిన మనిషి, దాని విలువతెలిసిన మనిషి ఆ పెంటమీద రత్నంని భద్రంగా తీసికెళ్ళి జాగ్రత్త చేసుకుంటే అది యింక మీదని అనే హక్కు వుందా? రోడ్డుమీద పారేసాక ఎవరికి దొరికితే అది వారిదే అవుతుంది. అది దొంగతనంగా లెక్క అవదు.'' బావ నిశ్చలంగా నిబ్బరంగా అన్నాడు. నేనంతా వింటూనే వున్నాను, నిండా మునిగాక చలేమిటి!

''దాచుకో పెంటకుప్పమీద బొగ్గు ముక్కని రత్నం అని భ్రమిసి, ఆ చెత్త చెదారం అంతా కడుక్కుని దాచుకున్నందుకు! ఐ ఒన్లీ పిటీ యూ మై బాయ్! బయట పారేశాక, అది రత్నం కాదు, వజ్రం అయినా యీ రంగారావు ముట్టుకోడు! నీలా నేనంతకి యింకా దిగజారలేదు.'' ఆయన గర్వంగా తల ఎగరేసి వ్యంగ్యంగా అన్నారు. ''మై డియర్ అత్తగారూ! మీరు పాపం మీ కూతురు పరమ పతివ్రత! అల్లుడు అష్టకష్టాలు పెడుతున్నాడు

పొరపడుతున్నారని మీకు చూపించా
కి! మీ అమ్మాయి ఒకడితో కాదు పది
రితో కులికినా నాకేం సంబంధం లేదు
పంటకుప్పని వెతుక్కునే అవసరం నాకు
లేదు నా క్కావలసింది డబ్బు! వస్తా!''
అంటూ నావైపొక వంకర చూపు విసిరి
నవ్వుకుంటూ వెళ్లపోయారు ఆయన.

''యివన్నీ చూడడానికి, యీ అవమానా
లన్నీ సహించడానికే నే నింకా బ్రతికి
వున్నాను. దాటిపోయిన ఆయన ఎంత
అదృష్టవంతులు'' అమ్మ నెత్తి కొట్టుకుంది.

''అత్తయ్యా, దయచేసి వూరుకో,
కళ్యాణి వంట్లో ఏమి బాగులేదు, జ్వరం
మండిపోతూంది. అసలే చితికిపోయిన ఆ
హృదయాన్ని తల్లివై వుండీ నీవూ మరింత
చితక్కొట్టి హింపించకు. కళ్యాణి సుఖ
పడాలని నీకు లేదా! కళ్యాణి ఆనందంగా
బ్రతకాలని కోరవా?''

''సుఖం అంటే యిలా సుఖపడా లనా
నా కోరిక, యింతకంటె, యింతకంటే''
అమ్మ మాట్లాడలేక కొంగు నోట్లో దోపు
కుంటూ ఆ గదిలోంచి పారిపోయింది.

అంతవరకు జరిగిందంతా నా విషయం
ట్లు చూస్తున్న నేను తెలివి తెచ్చుకుని
రావా!'' అన్నాను ఆదుర్దాగా. ''కళ్యాణీ,
ంది? ఎలా వున్నావు?'' ఆదుర్దాగా
వచ్చాడు. బావ చేతిని గట్టిగా పట్టు
న్నను నీళ్ళల్లో మునిగిపోతున్న వాడికి
చిన్న ఆసరా దొరికినట్లు, బావ యిచ్చిన ఆస
రాని వదలకుండా పట్టుకున్నాను. అలా
నాకు తెలియకుండానే మగతలోకి జారాను.
ఆ జ్వరం, జ్వరం పదిరోజులు వళ్ళు తెలి
యని ' టైఫాయిడ్‌లోకి దింపింది.
ఆ వళ్ళు తెలియని జ్వరంలో, అపస్మారక
స్థితిలో. అనుక్షణం నా కళ్లముందు
కూర్చున్న బావ, బావ చేసిన సేవలుమాత్రం
లీలగా గుర్తువున్నాయి. దేముడితో పోరాడి.
గెల్చుకున్నట్టు నన్ను మళ్ళీ బ్రతికించు
కున్నాడు. నన్ను మళ్లీ తన కళ్యాణిగా
చేసుకున్నాడు. పునర్జన్మ ఎత్తినట్లు, పాత
కధ లేనట్టు, తక్కిన లోకంతో మాకేం
సంబంధం లేనట్టు, బావకి నేను. నాకు బావ
మాత్రం మిగిలాం!''

ఆ రాత్రే అమ్మకి పెరాల్సిస్ స్ట్రోక్
వచ్చింది.

54

''సుజాతా! ఇదీ నాకధ! యిప్పటివరకు
జరిగిన యీ కధకి ముగింపు మాత్రం
ఏమిటో తెలియడం లేదు.'' ఏకధాటిగా
రెండు గంటలసేపు చెప్పిన కళ్యాణి
శుష్కహాసం చేస్తూ అంది.

కళ్యాణి చరిత్రలో లీనమయి, పరిసరా
లను మరిచిన సుజాత ఒక్కసారిగా తెలివి
తెచ్చుకుని భారంగా నిట్టూర్చింది. ''అబ్బ
మీ కధ ఎంత ట్రాజెడీ! నిజంగా యింత
తక్కువ జీవితంలో మీరెంత వ్యధ అనుభ
వించారు. మిమ్మల్ని చూస్తే, ఎవరన్నా
అందం వుంది, ఆస్తివుంది, సంపాదిస్తూంది
అంటూ మిమ్మల్ని, మీ యిల్లు వాకిలి చూసి
అసూయపడతారు. కానీ ఎవరూ మీ
జీవితం యింత వ్యధాపూరితం అని
అనుకోలేరు.''

''సుజాతా, ఎవరెలా అనుకున్నా నాకు
ఫరవాలేదు! నాలాంటి నిర్భాగ్యులు యింకెవ
రన్నా వుంటారో లేదో నాకు తెలియదు!

నిజంగా వైవాహికజీవితం నరకం అయితే యింక బ్రతుక్కి అర్థం ఏమిటి? ఏకారణం చేత కానీ కట్టుకున్న భర్తని ప్రేమించలేక పోవడం, ప్రేమించని భర్తతో కాపురం చెయ్యాల్సి రావడం కంటె నరకం ఏమిటి? సుజాతా! యీనాడు, యీ దేశంలో నేనే కాదు, చాలా మంది ఆడవాళ్లు, పెద్దలుచేసిన పెళ్ళిళ్ళకి తలవంచి పెళ్లి చేసుకోడం, తరువాత తప్పదనో, పిల్లలకోసమో, సంఘ భయంతోనో కాపురాలు చేస్తున్నట్లు కని పిస్తాయి తప్ప, ఒకరినొకరు మనసారా కావాలని కాంక్షిస్తూ తపిస్తూ కాపురం చేసేవాళ్లు నూటికొకరన్నా కనపడరు. ఈ దేశంలో వివాహం అన్నది ఆడదానికి రక్షణమాత్రం యిస్తుంది తప్ప అంతకంటె ఆమెకు ఏ అనుభూతిని ఆనందాన్నిస్తుందని నాకు నమ్మకం లేదు! ఆడదానికి వివాహం రక్ష ణని, మొగాడికి సెక్సు అవసరాలు తీర్చు కోడానికి, యిల్లు వాకిలి చూసుకోడానికి మనిషిగా—అనే భావన తప్ప ఏ భార్యా భర్తలూ అనురాగబంధంతో కట్టుబడినట్లు కనిపించదు! ఏ సంసారం చూసినా ఆ సంసారంలో ప్రేమానురాగాలు అనే పదా లకి తావు కనిపించదు! చాలాకాలం కలిసి మెలిసివుంటే వచ్చే ఎటాచ్‌మెంట్ తప్ప ఒకరికొకరు కావాలని వాంఛించడం మన సంసారాల్లో కనిపించదు! ఏ భార్యా భర్త లని చూసినా కట్టుకున్నాం తప్పదన్నట్టు, నిర్లిప్తత తప్ప ఒకరినొకరు చూస్తే కన పడాల్సిన వెలుగే కనపడదు కళ్లల్లో! అలా ఎక్కడో నూటికో దంపతులు—ఎన్నేళ్లు గడిచినా ఒకరిపట్ల ఒకరికి ప్రేమ నిలిచే దంపతులు కనిపిస్తే ఆశ్చర్యమే! మన దేశంలో కాపురాలు యిలా నడుస్తు యంటే—ముఖ్యంగా పిల్లలకోసం తర్వాత సంఘాన్ని ఎదుర్కోలేని దనం. విడిపోడానికి అధైర్యం. విడిపో భవిష్యత్తు యింతమాత్రం వుండదే నసే సంశయం తప్ప నిజంగా ఒకరికొ కావా లనిపించి గాదు కాపురాలు చెయ్యడ అని నేనంటే కాదని అనగలవా? అడదా మనసేమిటో, ఆమె భావాలేమిటో, ఆమె అసంతృప్తి ఏమిటో యిటు కన్నవారి అక్కర లేదు. అటు కట్టుకొన్న [illegible] అక్కర లేదు! ఎవరి బాధ్యతలు వాళ్లు వేరుస్తున్నాం అన్న సంతృప్తి తప్ప [illegible] బాధ్యతల సంకెళ్లల్లో ఆడది ఎలా నలుగు తూంది అని ఎవరూ ఆలోచించరు! ఆలో చించాల్సిన ఆడదానికి యిన్నాళ్లు ఆ [illegible] శక్తి సామర్థ్యాలు కొరవడ్డాయి. యి డిప్పుడు ఆలోచించ గలుగుతున్నా ప్రకృతి సిద్ధమైన మాతృత్వపు బలహీనతలకో, తరతరాలుగా జీర్ణించుకుపోయిన సంస్కృ తిని ధిక్కరించేశక్తి లేకో, మారని మను ష్యుల మధ్య మర్యాదగా జీవించే [illegible] లేదన్న నిజాన్ని గుర్తించో భవిష్య అగమ్యంగా కనపడో నోరు మూసుక కోరికలని, ఆలోచనలని, ఆశలని అన్నింటిని సమాధి చేసుకుని [illegible] దానితో సంతృప్తిపడి బ్రతుకీడుస్తు [illegible] ఈ అసంతృప్తే ఈ దేశంలో ఆడదాన్ని ముప్పైఏళ్లకే ముసలిదాన్ని చేసి అదొరకం నిర్లిప్తత, నిస్పృహలో పడేస్తూంది [illegible] నా నమ్మకం.''

(పత్రి [illegible] [illegible])



1975 సంవత్సరంలో భారతరత్నగా గౌరవించబడ్డ మాజీ రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి, మరో భారతరత్న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీతో.

మేరీకి తెలీని నిజాన్ని ఎట్లా చెప్పాలి?

తను చెప్పలేదు.

మేరీ, కట్నంలేకుండా నిన్ను చేసుకుంటే, నాన్న బ్రతకనివ్వడు. అందుకని ఈ పెళ్ళి జరగదు. అని ఎట్లా చెప్పగలడు??

చెప్పలేడు, చెప్పలేడు.

ఒకవేళ చెబితే-

మేరీ నవ్వుతుంది.

తన ఆదర్శాల వెనుకదాగివున్న పిరికి తనానికి

పగలబడి నవ్వుతుంది.

హేళనగా నవ్వుతుంది.

అలా, మేరీ నవ్వడం తనకిష్టంలేదు.

అందుకే. తను మేరీకి ఏమీ చెప్పలేదు.

చేసుకుంటాడని. చేసుకోడని.

చేసుకోడని, చేసుకుంటాడని, చెప్పలేదు.

ఏవో మాటలు చెబుతూ, కాలాన్ని వెళ్ళబుచ్చుతున్నాడు.

ఇప్పుడు.

తనకు ముప్పై అయిదేళ్లు.

మేరీకి ముప్పై.

మేరీని చేసుకోటం తనకూ ఇష్టమే.

కాని, తన ఇష్టం ఎవడిక్కావాలి?

బోడి ఇష్టం.

ఎవడికీ అక్కర్లేదు.

తనొక యంత్రం!

యంత్రం ఇష్టంతో ఎవరికి అవసరం?- ఎవరికీ అవసరంలేదు. అవసరంరాదు.

అప్పటికీ తను ఎన్నోసార్లు ప్రయత్నించాడు. తన తండ్రితో చెప్పాలని.

తను మేరీని చేసుకుంటాడని, కట్నం లేకుండా.

తన అభిప్రాయాన్ని ముందే గ్రహించినట్లు ఆయన మొహానికి పులిమాస్కు వేసు

కునేవాడు.

తను కుందేలు.

ఇలా గడిచింది కాలం.

ఇలా గడుస్తోంది కాలం.

జంక్షన్‌లో ఆగింది నెంబర్ సెవెన్.

తిరుమలరావు దిగాడు.

తిరుమలరావుతో చాలామంది దిగారు.

నాలుగు నిముషాల్లో

ఆఫీసులోకి అడుగు పెట్టాడు తిరుమల రావు. అతనికి వాతావరణం కొత్తగా తోచింది.

ఇద్దరూ, ముగ్గురూ, చేరి మాట్లాడు కుంటున్నారు.

చిన్నగా, పెద్దగా.

పెద్దగా, చిన్నగా.

అందరి చేతుల్లోనూ ఏవో కార్డులు వుండుండి తళుక్కుమని మెరుస్తున్నాయి.

సరాసరి తన సీటులోకి పోయి కూర్చున్నాడు.

అతణ్ని చూసి ఒకరిద్దరు నవ్వారు. పలకరింపుగా కాదు, పరిహాసంగా.

ఎందుకు వీళ్ళలా నవ్వుతున్నారు??

తనకి అర్థంకాలేదు వారి నవ్వుల్లోని అంతర్యం

ఇంతలో

కునేగా సెంటువాసనను తోడుచేసుకొని, చిరుగాలిలా వచ్చింది మేరీ

చేతిలో వెడ్డింగ్ కార్డుల కట్ట.

నవ్వుతూ అందించింది తనచేతి కొక కార్డు. అప్రయత్నంగా కళ్లు కార్డుమీదికి మళ్లాయి.

మేరీ. శ్రీనివాసమూర్తి. రెండుపేర్లు కనిపించాయి.

ఆశ్చర్యం! ఆశ్చర్యం!

"పెళ్ళికి మీరు తప్పకుండారావాలి. స్టాఫంతా వస్తారు. డోన్ట్‌మిస్"

వెళ్ళిపోయింది.

సరిగ్గా అదే పెళ్ళి రోజు.

తన పెళ్ళి. అంటే, తిరుమలరావు పెళ్లి, సీతామహాలక్ష్మితో, పదకొండువేల కట్నంతో, తనతండ్రి కుదిర్చిన సంబంధం.

తను మేరీలా వెడ్డింగ్ కార్డులిచ్చి అందర్నీ ఆహ్వానించలేదు.

ఎందుకంటే.

తను ఆదర్శవాది.

మేరీని చూస్తే జెలసీగావుంది.

మేరీ, శ్రీనివాసమూర్తి.

తిరుమలరావు, సీతామహాలక్ష్మి.

వారిది ఆదర్శ వివాహం, లోకం దృష్టిలో.

తనదీ ఆదర్శ వివాహమే, తన తండ్రి దృష్టిలో.

తలుచుకుంటే తిరుమలరావుకు నవ్వొచ్చింది.

అటుగా వచ్చిన ఓ కళ్ళజోడు గుమస్తా తిరుమలరావుని అడిగాడు.

"మేరీని చేసుకునే శ్రీనివాసమూర్తి ఎవరో తెలుసా?"

"ఎవరూ?"

"మన ఆఫీసులో టైపిస్టు శ్రీనివాస మూర్తే."


"అతనికి పెళ్లయిందిగా."


"అయింది. ఆమెకు విడాకులుఇచ్చాడు. మేరీని ఆదర్శ వివాహం చేసుకునేందుకు."

ఈసారి తిరుమలరావుకు మరీ నవ్వొచ్చింది. మరీ-మరీ-నవ్వొచ్చింది. ★

కార్టూనిస్ట్ దృష్టిలో

అంతర్జాతీయ మహిళా సంవత్సరం!





ఆగండి! చదవండి! ఆలోచించండి!

"బాటవేసేదే బాటసారి ప్రయాణము చేయలేడు. స్త్రీ చెలిమిలేనిదే పురుషుని ప్రయాణము సాగదు."

(కళ ఎందుకు?; ముప్పాళ రంగనాయకమ్మ)

"ప్రపంచంలో రెండే రెండు గొప్ప విషాదాలు. అనుకున్నది కాకపోవడం అనుకున్నది ఐపోవడం."

(సెక్రెటరీ, యద్దనపూడి సులోచనారాణి)

"స్త్రీ పురుషుణ్ణి భయపెట్టిందంటే అతడు నిజంగా భయపడాలని కాదు. ఆ పరిస్థితిలో కూడ అతను ఎలా తట్టుకొని నిలబడతాడు అని పరీక్షించడమే. అతను లొంగిపోకుండా స్థైర్యంతో నిలబడితే చాలు."

(కౌసల్య; పోలాప్రగడ సత్యనారాయణమూర్తి)

"స్వార్థరూపంతో పుట్టిన మనిషి త్యాగ కల్పనతో రూపు దిద్దుకో కలిగితే అవధుల్లేని అతని ఆనందానుభం వర్ణనకు అతీతంగా నిలుస్తుంది."

(అర్పణ; పి. రామలక్ష్మి)

"నిప్పు తెలిసి ముట్టుకున్నా తెలియక ముట్టుకున్నా కాలక మానదు. తప్పూ అంతే; తెలిసి చేసినా, తెలియక చేసినా శిక్ష అనుభవించవలసిందే"

(బాంధవ్య బంధితులు; చెరుకూరి రమాదేవి)

"కాలాన్ని గంటలు, రోజులు, నెలలు సంవత్సరాలతో కొలుస్తారు. జీవితాన్ని అనుభవాలు, సంఘటనలు, సుఖదుఃఖాలతో కొలుస్తారు."

(మారిన విలువలు; ద్వివేదుల విశాలాక్షి)

"జీవితం అనేది ఎవరిచేత శాసింపబడేది కాదు. దానిచేత శాసింపబడే వాళ్ళము మన మందరమూను."

(ముద్దమందార: భూపతి)

"మనిషి తప్పుచేసి హాయిగా తప్పించుకు పోవాలంటే వేదాంతం అంత చక్కగా మరేది ఉపయోగపడదు. ఈ రకం వేదాంతమే మనిషిని దిగజార్చి చివరి కెందుకూ పనికిరానివాణ్ణిగా చేస్తుంది."

(ముద్దమందార; భూపతి)

౪గా ఆలోచించే ప్రతి ఒక్కరూ చదువ ౩గింది 'బాధ్యత'.

'బాధ్యతలు నెరవేర్చేవారి హృదయాలు. సంతృప్తికి ఆలయాలు' అంటారు ాక ఉన్నతమైన భావన 'చచ్చేదెలాగు' ్న కవితలో నేటి కల్తీ పదార్థాలను స్తూ.

'చివరకు విషంలో కూడా కల్తీయే ఇక చచ్చేదెలాగు.' అన్న నీరసం నిపిస్తుంది. 'పరీక్షలు' అన్న కవితలో నేటి విద్యా విధానాన్ని పరామర్శించారు. 'సన్మానాలు' కృత్రిమ మర్యాదలుగా చిత్రీకరించారు. 'ఎవరు గొప్ప!' స్త్రీయా, పురుషుడా అన్నదానికి సమానంగా ఉంటేనే జీవితం అంటారు శ్రీ మాలకొండయ్యగారు. వెర్రి తలలు వేస్తున్న నాగరికత నీడలో పొదుపుగా బట్టవాడే వారికో చురక అంటించారు 'వలువ విలువ' కవితలో, 'ఎర్రదీపం'లో కుటుంబ నియంత్రణ ప్రస్తావించారు, 'అధికారం' అంటే పరుగులు తీసేవారు ఇది చదివి ఏమంటారో!

అధికారములో ఉన్న బాధలు నిజమైనవి.

దీనిలో ఉన్న ఆనందం ఊహా మాత్రమే. ఈ నగ్నసత్యాన్ని యెవరూ కాదనలేరు. 'బాల్యం' చదువుతుంటే మరోసారి పిల్లలం అయిపోదాం అనిపిస్తుంది. 'భక్తి' మరో పదును పట్టిన చాకులాంటి కవిత.

'మనసెక్కడ ఉన్న - మనిషి గుళ్లో ఉండటం.

అవుతుందా భక్తి-వస్తుందా ముక్తి?'

'కవి హృదయమా!' లో కవికి ఓ హెచ్చరిక ఉంది 'మనిషికి మనిషి'లోని భావం గుండెల్ని కదిలిస్తుంది.

'మనిషి, మనిషిని ద్వేషించడం మాని. మనిషిని మనిషి ప్రేమించగల్గితే సకాలంలో జరగని న్యాయం అన్యాయం క్రిందే లెక్క అంటారు. న్యాయంలో-ఇవి కాక మరికొన్ని కవితలున్నాయి. ఆ భావంతో వచ్చిన కవితలు, కథానికలు, చదివాం కాబట్టి క్లుప్తంగా ప్రస్తావించలేదు.

'కాకి కోకిల' 'భయం' 'సీసా' 'చెంబమ్మా' 'వెన్నెల' 'ప్రేమ' 'కయ్యం' అంతా ఒక్కటే' చెట్లు' 'సాధన' 'తిండి' 'నరలోక నిజరూపము' 'పెనుభూతము' 'వితంతువు' 'వీరేశలింగం' 'వైరాగ్యం' 'చేపలు' 'బెస్తవారు' 'బూటకపు నాటకము' 'ద్వేషం' 'జీవిత ప్రయాణం'' రవి కవి' 'ఏది కొలబద్ద!' 'ఆశావలయం' 'సుఖం సంతోషం' 'కవిత్వం' 'నేరం' 'శిక్ష' 'హంస కోకిల' 'ముసలి తనము' 'గగురుపాటు' 'నింగినేల. 'జాషువా' 'ఆకాశం''సంవత్సరాది' 'పెళ్ళి' 'తాగుడు' 'గర్వం' విశ్రాంతి' మొదలగునవి.

'ఇందిరమ్మ' హితము చదవటానికి బాగానే ఉంది కాని, ఆమె చెప్పేవి ఒక్కటీ అమలులో పెట్టలేనివి. మొత్తంలో ఇదొక్కటె దిష్టి చుక్కలా కనిపించింది. అందరూ చదవ తగ్గది. అర్థం అవుతుంది కూడా.

—మాదిరెడ్డి సులోచన

సరాగమాల పోటీ 27

రూ. 1260-00 బహుమతులు

నిబంధనలు తు. చ. తప్పక వ్రాయాలి

శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్
వనజా మూవీస్

పుట్టింటి గౌరవం
వనజ - గిరిజ

ఒక్కొక్క చిత్రానికి ఒక నగదు బహుమతి రూ.102-00లు, పదునొకం తదుపరి బహుమతులు.

అందరూ అతి స్వల్ప వ్యయ ప్రయాసలతో పాల్గొనదగిన అతి సులభమయి నిబంధనలు.

1. పోస్టు కార్డుపై మీకు ఆ సినిమాలో నచ్చిన పాట ఒకటి, నచ్చని పాట ఒక వ్రాసి, వాటి ప్రక్కనే దానికి కారణం (రచన, వరస, వాద్యగోష్టి, పాడటం, సన్నివేశం, చిత్రీకరణ, నటన, నృత్య దర్శకత్వం. సెట్ లేక ఔట్‌డోర్— ఇవే. వీటిలో ఒకటే వ్రాయాలి.)
2. దాని క్రిందుగా ఆ సినిమా గురించి ఒకే ఒకవాక్యం స్లోగన్ లాంటిది వ్రాయాలి.
3. అడ్రసు వ్రాసే చోట దిగువ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయటమేగాక దానిపైన ఫలానా సినిమా పోటీ అని వ్రాయాలి. దానికి యెడమ ప్రక్క ఖాళీ జాగాలో పిన్‌కోడ్ నెంబరుతో సహా మీ పూర్తి అడ్రసు, ఇంతకు ముందు గెలుపొందిన పోటీల వివరాలు వ్రాయాలి.
4. ఒక కార్డులో ఒక సినిమా గురించే వ్రాయాలి.

ముగింపు తేదీ మే పదిహేను. ఆ నెల 25 వ తేదీకంతా బహుమతులు (రూ. 48-00 విలువ చేయు రికార్డులు, పుస్తకాలు) రిజిస్టర్ పోస్టుద్వారా, నగదు మనియార్డరు ద్వారా విజేతల కందగలవు. జూన్ 1975 సంచికలో విజేతల జాబితా చూడనగును.

V. A. K. Ranga Rao
'Ram Mahal'
Pycrofts Gardens
Madras-600 006.

జ్యోతి సరాగమాల పోటీ 26 విజేతల జాబితా

స్లోగన్లు రాను రాను మరీ చప్పగా వుంటున్నవి. దాని గురించి పోటీదారులు అసలు ఆలోచించకుండా యేదో వ్రాసేస్తున్నారని తోస్తున్నది. "పరివర్తన" నగదు బహుమతి రెండు సాధారణ బహుమతులుగా మార్చబడినది. "దేవుడు చేసిన పెళ్ళి" పోటీలో వచ్చిన స్లోగన్లు ఒకవాసి మెరుగ్గా వున్నవి. బహుమతి పొందిన దొరబాబు స్లోగన్ "దొరబాబు దొరల్లోనేకాదు దొంగల్లోనూ దొరబాబే." వీటన్నిటిని గమనించి యింతకన్నా బాగా వ్రాసి నగదు బహుమతులు గెల్చుకొన హెచ్చరిక. ఈ విధంగా రాక్షస సంవత్సరాదిని లక్ష్మీ సంవత్సరాదిగా మార్చుకొనమని కోరిక.

"దేవుడు చేసిన పెళ్ళి"

రూ 102=00 నగదు 1. పి. వి. వి. వి. నరసింహారావు విజయవాడ (ఆనందాన్ని పదిమందికీ పంచు; నీ దుఃఖాన్ని నీలోనే ఉంచు) 2 కె. సరళ హైద్రాబాదు (దేవుడు చేసిన పెళ్ళి చూడాలనిపిస్తుంది మళ్ళీ మళ్ళీ)

తదుపరి బహుమతులు. 1. బి. భాస్కరలక్ష్మి. మార్టేరు 2 కె ఎస్. లక్ష్మి. పండిత విల్లూరు 3. కె. గోవిందబాబు, కాకినాడ 4 టి. ఎస్. ఎన్. మూర్తి, పాలకొల్లు 5 కె. వి. మీనాక్షి. తిరుపతి 6. కె. ఎన్. ఎన్. రెడ్డి, రామవరం. 7. పి. కుసుమ, అమలాపురం 8. ఇ. ఎస్. దీక్షితులు, ఒంగోలు 9. జి. సత్యనారాయణ, అమరావతి 10. కె. రామారావు, ధవళేశ్వరం 11. ఎం. రాజబాబు. మంతెనవారి పాలెం 12. డి. సుజాత. మద్రాసు 13 కె. ఎన్. విభాకర్. సికింద్రాబాదు 14 ఐ. ఎల్. నారాయణరావు, పాలకొల్లు 15. కె. గంగామోహన్, ఆర్మూరు 16. పి. సుధ, రాజమండ్రి 17. వి. కామేశ్వరరావు, అమలాపురం 18 పి. ఎమ్. జ్యోతి, నెల్లూరు 19 ఎస్. వజీరుద్దీన్. తాళ్ళముదునూరుపాడు 20 సుసర్ల గీత, పుల్లేటికుర్రు 21. బి. లక్ష్మి, తుని 22. ఆర్. ప్రతాప నారాయణ్, హైదరాబాదు.

"పరివర్తన"

1. అబ్దుల్ అజీజ్, విజయవాడ 2. పి. వెంకటనరసింహం, పిఠాపురం 3. బి. బాలకృష్ణ, పిట్టలవాని పాలెం 4. కె. బి. ప్రసాద్, అమలాపురం 5. కె. బాలా త్రిపుర సుందరి, రాజమండ్రి 6. మూర్తి, బొంబాయి 7. ఎం. రాజశేఖర్, హైదరాబాదు 8, ఎం. సూర్యనారాయణ. ర్యాలి 9. ఎం. వీరరాఘవమ్మ. పెద్దాపురం 10. ఏ. రామలక్ష్మి, కడింపాడు 11. పి. పుణ్యవతి, శ్రీహరి కోట 12. కె. రామ్కృష్ణ, మదనపల్లె 13. ఎం. వెంకటరావు, పెద్దాపురం.

ఈ నెల విడుదలలు

వచ్చింది. వచ్చేసింది. ట్రాక్ యెత్తుకు పోయిన పిల్లి రికార్డుగా మార్చి మార్చిలో హెచెంవి డీలర్ల కందరికీ తెచ్చి యిచ్చేసింది. వెంటనే వెళ్ళి తీసుకోకపోతే దొరక్కపోవచ్చు. అసలు సప్లై యే తక్కువ. "దేవుడు చేసిన పెళ్ళి"లో సందులో బేరం, సూదిలో దారం ఒక ప్రక్క (GE 13134) రచన దాశరధి. పాట వాణీజయరాం. తెరపై తిమ్మిరెత్తించే ఆట జ్యోతిలక్ష్మి. రచన, నాట్యమూ చవకబారుగా ఉన్నవని కొందరు పాఠకులు అభిప్రాయ పడ్డారు. నిజమే అయితే ఆ దుర్గుణం సందర్భోచితంగానే వున్నది కనుక గుణమైనదని నా అభిప్రాయం. ఆంధ్రదేశంలో రికార్డు డాన్సులు ఏనాడైన అంతకన్న మెరుగ్గా ఉన్నవా? రెండవ ప్రక్క షరావతి పాడిన 'అమ్మ పాడలేదు.' రెడ్డి రచన మరీ వచనంలా వున్నా మనసుకి హత్తుకు పోయేలా వున్నది. చలపతిరావు పనితనం మెచ్చుకోదగినది.

ఈనెల పాలిడార్ విడుదలలు అయిదు భాషల్లో అందంగా వున్నవి. మొదట తెలుగువి.

"మాయా మచ్ఛీంద్ర" యి.పి.లో (2221 136) నాలుగు పాటలు సత్యం యెటువంటి చిత్రానికైనా సంగీతం చేయ సమర్థుడని నిరూపిస్తున్నవి. 'రామ సుగుణ ధామ' శ్రీనివాస్ కంఠంలో భక్తి మాధురులూరిస్తున్నది. దాశరధి రచన దాశరథి బలపరాక్రమాదులను వర్ణిస్తున్నది శీలా బాల ప్రణయవ్విగళం నిజంగా 'ప్రణయ రాగ వాహిని'యే. అయితే వరస కొంత కొత్తదనం కొరవడినా హాయి తగ్గలేదు. బాల పాడిన 'తారకనామమే మధురమురా' మరొక భక్తి గీతం కొంత ప్రబోధాత్మకం. పురందరదాసుని 'రామనామ పాయసక్కె కృష్ణనామ శక్కెరె' భజనను గుర్తుకు తెస్తున్నది. మోహిని అమృతము పంచే పాట స్వనమోహిని జానకిది. 'సుధ మీకే మీకే యివ్వనా.' రచన తెలియకపోయినా వరస పాడుట అధరామృతం చవి చూపగలవు.

'ఒంటరిగా ఉన్నాము' అన్ని జంటపాట రమేశ్-జానకి ద్వారా వింటే అమాంతం చలపతిరావుకు ప్రేమలేఖ వ్రాసి పడేద్దామని ఉత్సాహం కలుగుతుంది. అయితే అంతా ఆయన గొప్పేకాదు. రెడ్డి రచనలో మధువులు తాగించే మైకం. జానకి రమేశ్లు పాడటంలో వలపులతో రంగరించేపరవశం వున్నవి. సుశీల-బాల వాత్సల్యరాగంలో సాటిలేని రీతిలో పాడినపాట మా పాప పుట్టిన రోజు. దాశరధి రచన బాగుంది. రెండవ ప్రక్కంతా ఒక నృత్య నాటిక కాబోలువుంది. చిత్రం చూస్తేకాని అర్థం కాదు. ఇవన్నీ "సంసారం" యి.పి.లోవి (2221 144)

"అమ్మాయిల శపథం" లో ఒక ఎస్.పి. (2067 248) వచ్చింది. ఎల్లారీశ్వరి పాడిన 'చూపిస్తా' అతి సాధారణంగా

వున్నా. ప్రజాదరణ పొందటాని కంపులో అన్ని చిట్కాలున్నవి రెండవ ప్రక్కనున్న 'నీలిమేఘమా' వాణీ-బాల పాడిన ప్రేమగీతం. రెండు మార్లు విన్న తరువాత గాని బోధపడదు అందులో వున్న తీపి రెంటికీ రచన ఆత్రేయ. సంగీతం విజయ భాస్కర్.

పాలిడార్ రిప్రజెంటెటివ్ ఆనందరెడ్డి యిప్పుడే ఫోన్ చేశారు విజయావారి హిందీ చిత్రం "జూలీ" లో రికార్డులు అతి త్వరలో ఆంధ్రదేశంలో పాలిడార్ డీలర్ల వద్ద దొరకగలవని. మీరు ముందు వింటే మీ అభిప్రాయాలు మాకు (కేరాఫ్ జ్యోతి) వ్రాయండి, కార్డులే. నచ్చిన ఒకరికి "జూలీ" ఎల్. పి బహుమతి మరొక విషయం. పాలిడార్ ప్రతినిధులు తరచు ఆంధ్రదేశం పర్యటిస్తుంటారు మీకు కావలసిన పాలిడార్, ఫిలిప్స్ రికార్డులు డీలర్ల వద్ద లేకపోయినా, మీరు కోరిన వివరాలు తెలియక పోయినా వారిని సంప్రతించండి ఏయే తేదీలలో మీ ఊళ్లో ఉంటారో పాలిడార్ డీలర్లు మీకు తెల్పగలరు. ఇది పాలిడార్ వారు మీకోసం యేర్పరచిన ప్రత్యేక సౌకర్యం.

కన్నడ చిత్రం "దారి తప్పిదమగ" కర్ణాటక దేశంలో అతి విజయవంతమైన చిత్రం వచ్చిన ఒక ఎస్ పి లో (2067 244) జానకి శ్రీని పాడిన పాటలో కొత్త వలపు పాత తీపి, వాద్యగోష్టిలో మెత్తదనం, వలపు తలపుల పులకల రచనలో (విజయ నరసింహ) గడుసుదనం, వింటుంటే నిన్నటి కథ రేపటి కల రెండు మనసులో మెరుస్తున్నవి. మధ్యలో వున్న గిటారుల సొంపు వింటే గుండె ఆనందంతో ఆగిపోతుందా అన్న భ్రమ కలుగక మానదు. 'కణ్ణరానిన' వరస పాతది. వాద్యగోష్టి పాశ్చాత్య ధోరణిలో నవ్యమైనది. శ్రీనివాస్ పాడిన తీరు తియ్యనైనది. ఈ సంగీత మెవరిది? ఇంకెవ్వరు జి. కె. వెంకటేశ్ దే!

హిందీ చిత్రాల ఎల్. పి.లు రెండు "ఖలీఫా" (2392 051) "అర్చన" (6405 024) "ఖలీఫా" లో 'తక్ ధిన్ తక్' పది నిటమిను మాత్రల సీసాల పెట్టు వినడమే ఒక కాయకల్ప చికిత్స. పాడింది కిశోర్, మన్నాడే. ఆశా కిశోర్‌లు చక్కిలిగింతలు పెట్టే వలపు పాటలు రెండు. 'దిల్ మచల్ రహాహై' 'దేఖో తుయుకో' మన్నా బృందం గీతం 'మేరీ ఆవాజ్ సునో' గీతం. ఇంకా రెండు యుగళ గీతాలు యివ్వబడినవి కనరు చాలా అందంగా వుంది. నులక మంచం కంతల్లోంచి రేఖ చక్రాల్లాంటి కళ్లు అయస్కాంతంలా ఆకర్షిస్తున్నవి. సంగీతం ఆర్.డి. రచన గుల్షన్ బావ్రా.

అర్చన పాత విషయమే అయినా సినిమా యిప్పుడు రానున్నది శంకర్ జైకిషన్ సంగీతం. 'తన్ మన్ తే' వాతావరణంలో ఒక సేడి మెరుపు జియూషి లగా' మన్నాడే విడిగా ఒక మృదు మధుర గీ. శాస్త్రీయమూ అయిన గుబాళింపు ఆశా పుట్టినరోజు పాట 'జనమ్ దిన్ ముబారక్' మామూలుగా వుం పాటగ 'జానే కిస్ లాక్‌కీ' ఘజల్ లాంటిది. సాధారణమైన వరస, రచనా తీసుకొని ఆశా పూలబాణం వేసిన నాట్యగీతం 'జో విల్ మే సుభా' 'జైసే జైసే ప్రీతిమ్సే' లతా సోలో, పితారుల జలతారులు మెరుపులు.

—రి. కం. వై. రి. బం, రి. శ్రో. స,

సినిమా

చిత్రాల విడుదలలు

ప్రభుత్వాన్ని భర్తతోనూ, పారిశ్రామిక వేత్తలను భార్యతోనూ పోల్చాడు ప్రముఖ పారిశ్రామికవేత్త బిర్లా. సినిమాల విడుదల విషయంగా ప్రస్తుతం వున్న అనిశ్చితస్థితి అందుకు చక్కని ఉదాహరణగా వుంటోంది. 'బాతు బంగారు గుడ్ల కథలాగా ప్రభుత్వానికెంతో ఆదాయం (ఎంటర్‌టైన్‌మెంట్ టాక్స్ వగైరాలు) చేకూర్చిపెట్టే ఫిలింఇండస్ట్రీపైన ప్రభుత్వం వారి దృష్టి మరింత పరిశీలనగా పడటంతో చిక్కులొచ్చేశాయి. తయారైన చిత్రానికి విడుదలకోసం ప్రింట్లు తయారుచేసుకొనేందుకు భయపడేంతవిధంగా ఉన్నాయట నూతనంగా విధించిన 'ఎక్సైజ్ డ్యూటీ'లు. ఈ అంశంపై ప్రభుత్వంతో ఇండస్ట్రీ భేటీ పడుతోంది. ఆ కారణంగా చిత్రాల విడుదలలు 'డిస్‌లొకేట్' అయిపోయి ఎప్పుడే చిత్రం విడుదలవుతుందో 'ఖచ్చితంగా' చెప్పలేని స్థితివచ్చి పడింది ప్రభుత్వమైనా 'కొట్టిన చోటే కొట్టి' సంపాదించే గుణం మానుకో గలిగితే బాగుణ్ణు!

రిషికపూర్ ?...



...కాదు. 'వయసొచ్చిన పిల్ల'లో ఎం. రంగారావు

పెళ్ళి పందిరి కాదు. భారతంలో ఒకమ్మాయి!

'పెళ్లి పందిరి' పేరుతో విజయ వేలాంగణి పిక్చర్స్‌వారు నిర్మిస్తున్న చిత్రం పేరును 'భారతంలో ఒకమ్మాయి'గా మార్చారు. సంచలనం సృష్టించిన ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించిన దాసరి నారాయణరావు దర్శకత్వంలో తయారయ్యే మరో సంచలనం ఇది. మనదేశంలోని నేటి సమస్యలకు ఎదురొడ్డి ధైర్యంగా నిలబడ గలిగిన ఒకమ్మాయి కథ యిది. రాజబాబు, అల్లు, ప్రభాకరరెడ్డి, రాజసులోచన, కాంతారావు, రోజారమణి,



'బాబు'లో లక్ష్మి, శోభన్ బాబు

చంద్రమోహన్, మురళీమోహన్, మరియు జయమాలిని నటిస్తున్నారు. యస్రాజేశ్వరరావు సంగీతం. దర్శకత్వంతోపాటు కథ, మాటలు కూడా దాసరి నారాయణరావే నిర్వహిస్తున్నారు. నిర్మాత తుమ్మ మ్రిరెడ్డి.

'బ్రతుకే ఒక పండుగ'

కిరణ్ ప్రొడక్షన్స్ నిర్మించే 'బ్రతుకే ఒక పండుగ' పూర్తయింది. పి. వి. రమణయ్య సమర్పించు యీ చిత్రంలో చంద్రమోహన్, శ్రీధర్, సత్యప్రియ, రాధిక, భవాని, రమాప్రభ, సుధ, అల్లు రామలింగయ్య, లక్ష్మీకుమార్ రెడ్డి, ఆనంద్ నటించారు. దర్శకత్వం పి. చంద్రశేఖర రెడ్డిది, కె. వి. మహాదేవన్ సంగీతం. పరిస్థితుల ఒత్తిడికి నిలబడి స్త్రీ పోరాడగల దన్ను అంశానికి రూపకల్పనగా యీ చిత్రం తయారైంది.

కొత్త శక్తి

నిర్మాత పి. గంగాధరరావు తన నవశక్తి సంస్థ ద్వారా ఎప్పటి కప్పుడు తెలుగు చిత్రాలకే కొత్త శక్తి నివ్వగల 'టానిక్' లాంటి చిత్రాలు నిర్మిస్తున్న సాహసి. అంతటి సాహసి గనుకే అందరూ కొత్తవారే నటించిన 'సిదలేని ఆడది' చిత్రాన్ని రంగుల్లో నిర్మించగలిగాడు. గంగాధరరావు ప్రస్తుత ప్రయోగం 'అమ్మాయిలూ జాగ్రత్త'. ప్రయోజనకరమైన యీ చిత్రంలో హాస్యానికి సముచిత స్థానం కల్పించబడింది. అతిత్వరలో విడుదలయ్యే యీ చిత్రం పి. సాంబశివరావు దర్శకత్వంలో తయారయింది. ప్రభ, సుజాత, ఉమ, వాణి, నరసింహరాజు, సుధీర్, పి. ఎల్. నారాయణ మొదలైనవారు నటించిన చిత్రం ఇది. ఈ చిత్రం మొత్తం

38 రోజుల్లో జొట్‌డోర్ (గుంటూరు)లో తయారయింది.

చీకటి వెలుగుల్లో యుద్ధం!


రంజిత్ మూవీస్, రంగుల్లో యాపొం దిస్తున్న 'చీకటి వెలుగులు' చిత్రంలో అవసరమయిన యుద్ధ దృశ్యాలు ఊటీ దగ్గర మిలిటరీ కాంపులో చిత్రీకరించారు. అతి సహజంగా కన్పించేలా చిత్రీకరించ బడిన యీ దృశ్యాలు ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచగలవు. యుద్ధమే కాదు. యుద్ధం జరిగే ప్రదేశంలో 'సెలవు మీద రావయ్యా సిపాయిబావా' అనే పాటను వాణిశ్రీ, కృష్ణ ప్లస్ కొందరు సిపాయిలపై చిత్రీకరించారు. త్వరలో పూర్తి కానో తున్న యీ చిత్రానికి కథ, దర్శకత్వం కె. యస్. ప్రకాశరావు. నిర్మాత: కె. రంజిత్ కుమార్. కృష్ణ, వాణిశ్రీ, పద్మప్రియ, సత్యనారాయణ, రాజ్‌బాబు, అల్లు, సూర్యకాంతం, కృష్ణకుమారి, రమాప్రభ, మిక్కిలినేని, ముక్కామల, రావుగోపాలరావు మరియు గుమ్మడి నటిస్తున్న యీ చిత్రానికి చక్రవర్తి సంగీతమూ, వి. యస్. ఆర్. స్వామి ఛాయాగ్రహణం నిర్వహించారు.

రిషికపూర్ రంగారావు

నూతన తరహా కథాంశంతో కృష్ణవేలా ఆర్ట్ పిక్చర్స్‌వారు నిర్మించే 'వయసొచ్చిన పిల్ల' చిత్రం తాలూకు స్టిల్స్ చూసినప్పుడు, ఆ చిత్రంలో బాక్సాఫీసును బద్దలు కొట్టిన బాబీ చిత్ర కథా నాయకుడు రిషికపూర్ కూడా నటిస్తున్నాడా అన్న అనుమానం కలుగుతుంది. కాని రిషికపూర్లా కన్పించే ఆ వ్యక్తి రంగారావు. (ముగ్గురమ్మాయిలు చిత్రంతో పరిచయంకాబడి, తిరపతి, ఆడంబరాలు- అనుబంధాలు చిత్రాలలో మంచి నటనను ప్రదర్శించిన నటుడు) ఆచిత్రంలో ఇంకా గిరిబాబు, మురళీ మోహన్. శరత్‌బాబు, లక్ష్మి, చంద్రకళ నటిస్తున్నారు.

జేబుదొంగ అదృష్టం!

సమతా ఆర్ట్స్‌వారు తయారు చేస్తున్న



'వైకుంఠ పాళి' లో
రంగనాథ్, శారద

జేబుదొంగ అదృష్టవంతుడు. అందుకే చిత్రీకరణకోసం ఊటీ, బృందావన్ గార్డెన్స్, కోవలం మొదలైన అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు నిండివున్న ప్రదేశాలలో విహరించగలిగాడు. ఊటీలో శోభన్‌బాబు, (జేబుదొంగ) మంజుల (బహుశా జేబు దొంగ హృదయానికి దొంగ)పై మూడు పాటల చిత్రీకరణ ఊటీలో జరిగింది. బృందావన్ గార్డెన్స్‌లో మురళీమోహన్, రోజారమణిలపై జరిగింది, ఓపాట చిత్రీకరణ రాజబాబు రమాప్రభల నవ్వులపాట కోవలంలో ఫిల్మ్ మీద కెక్కింది. కె భటర్జీ కథకు, ముళ్ళపూడి మాటలు సమకూర్చిన యీ చిత్రానికి డైరక్టర్ వి మధుసూదన రావు. యస్. వెంకటరత్నం కెమేరా, చక్రవర్తి సంగీతం నిర్వహించారు



'జీవన జ్యోతి'లో రమాప్రభ, రాజబాబు


వనజ-గిరిజ

పిలిమ్ జర్నలిజంలో అపారానుభవం కలిగిన 'గౌతమ్' కథ, మాటలు సమకూర్చి దర్శకత్వం కూడా నిర్వహించిన వనజ-గిరిజ చిత్రం పూర్తి అయింది ద్విపాత్రాభినయంలో జమున, రామకృష్ణ, సత్యనారాయణ, చంద్రమోహన్, ప్రభాకర్ రెడ్డి పద్మనాభం, రావుగోపాలరావు, రామదాసు, కృష్ణకుమారి, విజయలలిత, భవాని, లక్ష్మీకాంత్. మొదలైనవారు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత ఇ. కుప్పస్వామి.

'బాబు'కు ఫైనల్ టచెస్!

ఏ. వి. యం. సీజర్ సమర్పించుచున్నారుతీ ప్రొడక్షన్స్ వర్ణచిత్రం 'బాబు' తాలూకు పతాక సన్నివేశాల చిత్రీకరణ కూడా పూర్తి అయింది. మద్రాసు ఎయిర్ పోర్టులోనూ, తిరపతి కొండపైనా చిత్రీకరణ జరిగిన

'చల్లని తల్లి'లో రాజబాబు, అల్లు రామలింగయ్య, పి. వెంకటేశ్వరరావు





'అమ్మాయిలూ జాగ్రత్త'లో సుధాకర్, ప్రభ

ఈ సన్నివేశాలలో కథానాయకుడు శోభన్ బాబు. దుష్టులపై జరిపిన పోరాటం చిత్రీకరించబడింది. ఈ చిత్రీకరణకుగాను 50 వేల వ్యయంతో ఒక చిన్న కారు, రెండు విమానాలు, పదివేల పాల డబ్బాలు ఇంకా వందమంది రామదండు (కోతిమూక) ఉపయోగించడం జరిగింది. ఖరీదైన చిత్రంగా తయారైన ఈ చిత్రంలో బాబుకు తోడు ముగ్గురు అందాల భామలు వాణిశ్రీ, లక్ష్మి, అరుణా ఇరానీ (బొంబాయి తార) ఉన్నారు.

తాజ్ కోరమాండల్‌లో వైజయంతి

వైజయంతిమాల మద్రాసు వస్తే తాజ్ కోరమాండల్‌లోనే దిగుతుందేమో కానీ- ఈ వైజయంతి, వైజయంతిమాల కాదు వైజయంతీ మూవీస్ సంస్థ. ఈ సంస్థ నిర్మించే వర్ణచిత్రంకోసం ఒక సన్నివేశాన్ని కథానాయకుడు రామారావు, జగ్గయ్యలపై మద్రాసులో 'లగ్జరీ హోటల్' తాజ్ కోరమాండల్‌లో చిత్రీకరించారు దర్శకుడు బాపయ్య. యువనిర్మాత చలసాని అశ్వనీదత్ నిర్మించే ఈ చిత్రంలో వాణిశ్రీ, రాజబాబు, సత్యనారాయణ, కాంతారావు కూడా నటిస్తున్నారు.

కళ్ళు తెరవండి!

ఒక్కోసారి కార్మికుల యూనియన్లు తొందరపాటుతో తలపెట్టిన సమ్మెలవల్ల వారూ, వారి కుటుంబాలూ, వారి యాజమానులేగాక, ఉత్పత్తి తగ్గిన కారణంగా మొత్తం దేశం ఆర్థికస్థితే తారుమారవుతుంది. సమ్మె తీవ్రత నొందిన సమయంలో 'రీజనింగ్' తగ్గిపోయి కోతలు పెరిగి ఆస్తి నష్టం, అమానుషమైన హత్యలూ కూడా జరిగే ప్రమాదముంది. ఈ సమస్యను విడమరిచి కార్మికులకు చెప్పే సన్నివేశం అనిల్ ప్రొడక్షన్స్ వారి

ఈస్ట్‌మన్‌కలర్ చిత్రం 'సంసారం'లో ఉంది. 'సంసారం'లో పద్మశ్రీ ఎన్. టి. రామారావు, జమున, జగ్గయ్య. సత్యనారాయణ, జయసుధ, రోజారమణి మొదలైన వారు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వం, నిర్మాత తాతినేని ప్రకాశరావు నిర్వహిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్; టి. ఎల్. వి ప్రసాద్

రెడీ ఫర్ రిలీజ్

★ డి. వి. యస్. ప్రొడక్షన్స్ వారి జీవన జ్యోతి. శోభన్‌బాబు, వాణిశ్రీ ప్రధాన పాత్రలలో కన్పించే ఈ చిత్రానికి దర్శకుడు కె. విశ్వనాథ్, నిర్మాత డి వి. యస్. రాజు. కలర్ చిత్రం ఇది.

★ జెమినీవారి 'అందరూ మంచివారే'. శోభన్‌బాబు, మంజుల నటించిన ఈ కలర్ చిత్రానికి దర్శకుడు ఎస్. ఎస్. బాలన్.

★ లలితా మూవీస్ 'చల్లని తల్లి' విజయకాంత్, సుమిత్రలు పరిచయం కాబడుతున్న యీ చిత్రానికి నిర్మాత జగదీష్ చంద్రప్రసాద్. దర్శకత్వం కె యస్. రామిరెడ్డి


★ బాలయ్య సమర్పించు అమృతా ఫిలింస్ వారి 'అన్నదమ్ముల కథ'. బాలయ్య, నూతన నటుడు సత్యేంద్రకుమార్, చంద్రమోహన్, రోజారమణి, ప్రభ, సుజాత నటిస్తున్న చిత్రం కథ: బాలయ్య; దర్శకత్వం: డి. యస్. ప్రకాశరావు

సంక్షిప్త సమాచారమ్

★ కృష్ణ, విజయనిర్మల. అనిశా, పండరీబాయి, అపర్ణ, సత్యనారాయణ,

'పిచ్చోడి పెళ్ళి'లో ఒక దృశ్యం





'అన్నదమ్ముల కథ'లో సత్యేంద్రకుమార్, బాలయ్య, రావుగోపాలరావు

మిక్కిలినేని, చంద్రమోహన్ మొదలైనవారు నటిస్తున్న 'సంతానం సౌభాగ్యం' చిత్రం డి. యస్. ప్రకాశరావు దర్శకత్వంలో తయారవుతూంది. ఈ చిత్ర నిర్మాత కేశన జయరామ్.

★ రవిశంకర్ ఆర్ట్‌పిక్చర్స్ రంగుల చిత్రం బలిపీఠం పూర్తికావచ్చింది. శోభన్‌బాబు, శారద, రాజబాబు, రోజారమణి ముఖ్యపాత్రలలో కన్పిస్తారు. ముప్పలనేని శేషగిరిరావు సమర్పిస్తున్న యీ చిత్రానికి నిర్మాత సునీల్ చౌదరి.

★ హిందీలో నిర్మించబడి విజయవంతమైన కువారాబాప్ చిత్రం హాస్యనటుడు మహమూద్ దర్శకత్వంలో తయారైంది. అదే చిత్రం తెలుగులో ఇప్పుడు హాస్యనటుడు పద్మనాభం దర్శకత్వంలో తయారవుతూంది. పద్మనాభం. మురళి (పద్మనాభం కుమారుడు) ఎం. రంగారావు, గిరిబాబు, శరత్‌బాబు, కాంచన, రమాప్రభ నటిస్తున్న చిత్రం ఇది. పి. వీరేశం, పి. లక్ష్మిరెడ్డి నిర్మిస్తున్నారీ చిత్రాన్ని.

★ వినోదాత్మకమైన కథతో సాగే 'అమ్మాయిల శపథం'లో అమ్మాయిలు చంద్రకళ, లక్ష్మి. ఆ అమ్మాయిల కోసం అబ్బాయిలు రామకృష్ణ, చంద్రమోహన్. అమ్మాయిల శపథం డి. రామానాయుడు సమర్పణలో జి. వి. ఆర్. శేషగిరిరావు దర్శకత్వంలో నిర్మాణమవుతున్న చిత్రం.

★ ఆదిశక్తి చిత్ర యన్. టి. రామారావు, మంజుల, జమునలతో నిర్మించే చిత్రానికి 'బంగారు పతకం' అన్న పేరు పెట్టారు. స్క్రీన్ ప్లే, డైలాగ్, డైరక్షన్ దాసరి నారాయణరావు ★

ఉత్తరాలు

చీకటి ప్రొద్దున వెలుగురేఖ సీరియల్ చదువుతున్నాం. చదవటానికి బాగానే వుంది. కాని వాస్తవంగా ఉంది అని చెప్పలేం, ముఖ్యంగా రంగారావు పాత్ర మీద రచయిత్రిగారికి ఎందుకు అంత ద్వేషం అన్న ప్రశ్న తలయెత్తకమానదు

ఎంత సేపు కల్యాణిని వెనకేసుకు రావటం రంగారావు ఏం చేసినా, అదో పెద్ద తప్పు చేసినట్లు ఊరకనె, ఇదయిపోయి ఆ పాత్రను తనకు ఓపిక ఉన్నంతవరకు తను తిట్టి, ఇంక పాఠకులు తిడతారులే అని సంతృప్తి పడి కొంపెక్కినంతగా ఫీల్ అవడం ఇవి సీరియల్‌ను రచయిత్రి గారు తీసుకున్న ముఖ్యాంశాలు—

నేను బావను చూడందీ ఉండలేను. బావ నా ఎదరుగా ఉండాలి నేను, బావా ....బావా నేను, కానీ మేం ఇద్దరం ఎప్పుడూ తొందరపడలేదు (అంటే) ఈ విషయంలో మా అమ్మ కూడ మమ్మల్ని అనుమానించ లేదు. (ఎంతయినా అమ్మగద) నువ్వు రాకముందు వరకూ ఎలాగూ కాపురం వెలగబెట్టాను. నీవు వచ్చాక నా మనస్సు నిలవటం లేదు. ఏమిటండీ బాబూ ఈ డైలాగ్స్ వాళ్ళమ్మ అనుమానించక పోవచ్చుకాని, మీరు నమ్మించినంత తేలిగ్గా పాఠకులు నమ్ముతారా? బావ వెళ్ళిపోతానంటే ఎక్కడ లేని బాధ దానికి తగ్గట్టు ..వాళ్ళమ్మ వరస మరీ విపరీతం విడ్డూరం. అసలు కూతురు సంసారం చేయటం ఇష్టంలేదు అన్నట్లుగా ఉంటుం దీవిడ ధోరణి. కనీసం కూతురని మందలించదు ఎంతసేపు రంగారావును దుయ్యబట్టడం. వాళ్ళ బావను ప్రోత్సహించటం ఇదేనా తల్లిగా ఆవిడ కర్తవ్యం. తన మూలంగా ఇన్ని కలతలు. ఇన్ని అనర్థాలు జరుగుతూంటే అతనికి మట్టుకు ఆలోచన రావద్దా?

రంగారావు ఎవత్తినో తీసుకువస్తే ఆమె కల్యాణి కళ్ళకు చీప్ (?) గా కనిపిస్తుంది. ఇదో పెద్ద విషజ్వరం అయినట్టు ఎత్తి చూపిస్తారు రచయిత్రి—నిజమే. ఆమె కూడా కల్యాణికి లాగు డబ్బు, హోదా ఉంటే అంత చీప్‌గా ఉండక పోను మరి. కాని ఏం చేస్తుంది. అవన్నీ లేకపోవడం మూలంగా కల్యాణి కళ్ళకు 'చీప్' గా కనబడడంలో ఆశ్చర్యం లేదు

అది సరే! ఎవత్తినో తీసుకువచ్చాడని కల్యాణి ఇంతలో ఇదయి పోతున్నది. ఇంట్లో పెట్టుకుని, మొగుడు ముందు అంత గారాలు పోతున్న బావ ఆనంద్ రంగారావు కళ్ళకు ఎంత చీప్‌గా ఎంత డర్టీగా ఎంత 'బికారి'గా కనిపిస్తున్నాడో పాఠకులు ప్రత్యక్షంగా చూడగల్గుతున్నారు.

పిల్లలను ఇవ్వడానికి రంగారావు పెట్టిన షరతులు చూస్తుంటే అతనిని ఒక రోగ్

ఒక స్టుపిడ్ ఒక ఫూల్‌గా చిత్రించ టానికి శతవిధాలు ప్రయత్నిస్తున్నారని అన్పిస్తోంది.

—కె. ఉమామహేశ్వరరావు, తెనాలి.

వాణిశ్రీ, శోభన్‌బాబు ముఖ చిత్ర ముతో వెలువడిన మార్చినెల జ్యోతి చూడ ముచ్చటగా నున్నది

నేనొక మంచి వేశ్యను శీర్షికతో నేడు సమాజంలో జరుగుచున్న అన్యాయాలను, అక్రమాలను కళ్లకు కట్టినట్లు చిత్రీకరిస్తు న్నారు. ఈ శీర్షిక నిజంగా ఎంతో ప్రయో జనాత్మకమైన శీర్షికే అనుటలో ఎట్టి సందేహం లేదు

వేదగిరి రాంబాబుగారి "పాలిష్", కే. వి. ఎల్. నర్సింహశాస్త్రిగారి "వెలుగు కోరని చీకటి" రెండు కథలు కూడా యీ నెల మమ్ముల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. ఆర్. కామేశ్వరరావుగారి "కన్నీటికణాలు" కవిత ఎంతో భావయుక్తంగా వున్నది.

జ్యోతి నవలాను బంధంలో పోలా ప్రగడ సత్యనారాయణ మూర్తిగారి "ప్రే మాయణం" మూడవభాగం పాఠకులను మరింత ఆసక్తి పరిచింది.

—సిరికొండ వెంకటేశం. కరీంనగర్.

మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి 'కర్ఫ్యూ రాత్రి'—ప్రచురించిన కథ లన్ని టిలో ఉత్తమ మయినది. సినిమాలు తీయ డానికి మంచి కథలులేవు అని కన్నీరు కార్చే మన తెలుగు సినిమా నిర్మాతలకు పోలా ప్రగడవారి 'ప్రేమాయణం' నవల ఒక మంచి సినిమా కథ కాగలదు. ప్రేమాయణం జ్యోతి పాఠకులకు ఒక నవ్వుల ఫలహారం.

—సుంకర రామారావు, యలమంచిలి.

ప్రోలా ప్రగడగారి "ప్రేమాయణం" నవల పాఠక హృదయాలను గిలిగింతలు పెడుతూ అందమైన చిన్న చిన్న గంతు లేస్తూ "ఫాస్ట్‌గా" సాగిపోతుంది మధుర మైన సన్నివేశాలు, ఒక దాని తరువాత ఇంకోటి వస్తూనే వుంటున్నాయి, చదువు కుంటూ పోతుంటే.

ఈ నవలలో నాకు నచ్చిన పాత్ర "కిరీటి" ఈ అమాయకుని మాటలు, అభినయాలు. పాఠకులను కడుపుబ్బ నవ్వి స్తాయి. అల్లరి పిల్ల మాధురి ఈ కవిగార్ని ప్రేమాయణం లోనికి దించేసింది. పర్యవ సాన మెలా వుంటుందో?

ఈ నవలలో సున్నితమైన హాస్య ముంది.

"హాస్య రచయిత ముందుగా తను రచించిన దానిని, తన ఇంట్లోని అమ్మ, అక్కా చెల్లెళ్లకు చదివి వినిపించి, వారం దరూ దానిలోని హాస్యాన్ని ఆనందించ గలిగితే అపుడు ఆ రచనను ప్రింటు చేయించాలి" అని ఓ హాస్య నటుడన్నారు. అంటే హాస్యం ఇంటి యావన్మందీ. కలిసి ఆనందించ గలిగేదిగా వుండాలి. ఎ ఒక్కరు అసహ్యించు కొనేదిగా వుండ కూడదు. అందుకే హాస్య రచనలు చెయ్యు టం కత్తిమీద సాములాంటిది. పోలా ప్రగడ గారు, సృష్టించిన హాస్యంలో మాత్రం అసభ్యతలేదు అందరూ ఆనందించగలిగే హాస్యమే ఈ నవలలో వుంది ★

—యస్. కె. నాయుడు, శ్రీకాకుళం.

వస్తుగుణ విశేషములు

సుగుణ

దబ్బపండు

పసిమి ఛాయలో బొద్దుగా అందంగా ఉన్న వాళ్ళను పచ్చగా దబ్బపండులా ఉన్నారనటం సర్వ సాధారణం. దబ్బ పండ్లు బంగారు రంగులో అందంగాను సువాసనగాను ఉంటాయి ముఖ్యంగా దబ్బ పండు చర్మానికే ఈ సువాసన ఉంటుంది. పులుపు రుచిగల ఈ దబ్బపండు పైత్యము వాతము హరించును. జీర్ణశక్తి నిచ్చును. క్రిమి సంహారి.

ఆకులు చేదు వగరు రుచులతో సువాసనగ ఉంటాయి. ఆ యాకులు మజ్జిగలో వేసుకుంటే మజ్జిగ సువాసనగ ఉండి ఆరోగ్యకరంగా రుచిగా ఉండటమేగాక అత్యుష్ణాన్ని తగ్గిస్తుంది.

దబ్బాకులు వేయించి పచ్చడి కూడ చేయవచ్చు సువాసనగ రుచిగా ఉంటుంది పచ్చడి.

ఆకులు విస్తరిగా కుట్టి తలకు కడితే అసాధ్యమైన తలనొప్పి తగ్గును. ఆకు చితగ్గొట్టి వెచ్చజేసి కట్టినా కూడ తలనొప్పి, భారము పోటు తగ్గును.

మొలగజ్జిపైన దబ్బాకు వేసి కట్టిన తగ్గును దబ్బాకులు కాల్చిన బూడిదరాస్తే అన్ని రకాల చర్మవ్యాధులు తగ్గును

నిమ్మపండ్లతో లాగే దబ్బపండ్లతో కూడ ఊరుగాయ పచ్చడి పెట్టవచ్చు. ఈ పచ్చడి పథ్యకారి. జీర్ణశక్తిని పెంపొందించును. పైపెచ్చు మాత్రం జీర్ణంకాదు. దబ్బపండు రసంతో నిమ్మరసంతో లాగే పులిహోర చేయవచ్చు. కూరలు పచ్చళ్ళలో వాడవచ్చు. ★

"పెళ్ళయి పోయింది"

శేషాద్రికి, శాయిలక్ష్మికి పెళ్ళయిపోయిందిట.

నాకు బోల్డంత ఆశ్చర్యంగానూ, అనుమానంగాను వుంది. వాళ్ళిద్దరికి నాకు తెలీకుండా పెళ్ళయిపోయిందంటే విడ్డూరంగా వుంది. ఊళ్ళో ఎవ్వరికి తెలీకుండా పెళ్ళయిపోయిందని వుంది—"ఏదో తిరకాసు వుంది" అనుకొని, ఆలోచించి చివరికి "హమ్మమ్మా! శాయిలక్ష్మి" అనుకున్నాను గుండెల మీద చేయివేసుకొని.

ఓ ప్రేమకథ

ఆకెళ్ళ నాగమణి

"ఇంతకీ, శేషాద్రి శాయిలక్ష్మిని పెళ్ళిచేసుకున్నట్టా? లేక శాయిలక్ష్మి శేషాద్రిని పెళ్ళిచేసుకున్నట్టా?" అన్న అనుమానం పీడించింది.

"వెధవ అనుమానం! ఎవరిని ఎవరు పెళ్ళిచేసుకుంటేనేం? పెళ్ళయ్యింది వాళ్ళిద్దరికి" అంది మనసు కసురుకుంటూ వివేకంగా.

"అది తెలుసులేవోయ్! వాళ్ళిద్దరూ అందరిలాకాదు. అందుకే ఎవరు ఎవరిని చేసుకున్నట్టూ?" విసుక్కుంటూ మెత్తగా మందలించాను మనసును.

రెండురోజులు ఎంత ప్రయత్నించినా ఆఫీసునుండి త్వరగా ఇంటికి రాలేకపోయాను. నాలుగేళ్లు కాలేజీలో చదివితే డిగ్రీ—ఓ గుమాస్తా ఉద్యోగంతో పాటు, ప్రతిరోజు వేడివేడిగా అయ్యరు హోటల్‌లో సాంబారులో తేలి ఆడే ఇడ్లీలా అ స్తమానం నోట్లో తిట్లను తేలి ఆడించే కసాయి ఆఫీసరు దగ్గర అణిగి మణిగి పడివుంటూ, ప్రతి చిన్నమాటకు (తిట్లకు సైతం) "యస్ సార్" అంటూ తలూపే అదృష్టం ఛ... దౌర్భాగ్యాన్ని అంటగట్టింది—వెధవ డిగ్రీ.

అర్జంటు లెటర్స్... పెండింగ్ ఫైల్స్ వాటి మధ్య నేను, ఓ పెండింగ్ ఫైల్ లాంటి జీవితాన్ని గడిపే గుమస్తాని అనుకున్నప్పుడు, తీరిక టైము దొరకనివాణ్ణి.

మూడోరోజు ఎలాగైతేనేం ఆరు గంటలకల్లా యిల్లు చేరుకొని కాఫీ తాగి బయలుదేరబోతున్న నేను, అమ్మ చెప్పిన వార్త వింటూనే నిశ్చేష్టగా నిలబడి పోయాను. కుర్చీకతుక్కుపోయికూర్చున్న నా కళ్ళకు, శేషాద్రి అమాయకపు మొహం, ఆ ప్రక్కనే శాయిలక్ష్మి మొహంలో కదిలే గర్వం కనిపించాయి.

ఓ సంగనాచికి మొగుడైన నేరానికి శేషాద్రిని, వాడి అమాయకత్వాన్ని కసిదీరా తిట్టుకున్నాను. వెర్రిపీనుగ, వాజమ్మ అమాయకుడు అన్యాయం అయిపోయాడనుకున్నాను. అమ్మమాత్రం, "అకాలంరా బాబూ!" అంది.

శేషాద్రి శాయిలక్ష్మికి మేనబావ. శేషాద్రికి తల్లితప్ప తండ్రి లేడు. కాస్త మిగిలిన ఆస్తిని, కొడుకుని, తమ్ముడికి అప్పగించేసింది రాజమ్మ. "నీకెందుకూ? నీ కొడుకును వృద్ధిలోకి తెచ్చే పూచీ నాది" అంటూ హామీ యిచ్చాడు శాయిలక్ష్మి తండ్రి రాఘవయ్య.

శేషాద్రి మనిషి అనడానికి ఎవరికి అభ్యంతరం వుండదు. కాని వాడితత్వం మాత్రం, గంగిగోవులాంటిది. మూగజీవిలాంటిది. వాడి నాలుకకు పదును లేదు. అంటే మాటలు రావని కాదు. కాని మరీ బిడియస్తుడు. భయస్తుడు.

శేషాద్రికి చిన్నప్పటినుండి శాయిలక్ష్మి అంటే భయమో, గౌరవమో నాకింతవరకూ అర్థం కాలేదు. కాని వాడి మాటల్లో, శాయిలక్ష్మి వాడికంటే, ఇంకా కొంతమందికంటె చాలా తెలివైందని, చాలా విషయాలు తెలుసని, ఎంతో లోతుగా ఆలోచిస్తుందని అనిపిస్తుంది ఎదుటి వాళ్ళకు. నా మటుకు నాకు మాత్రం, శాయిలక్ష్మి అభిప్రాయాలు, ఆలోచనలు, ఎప్పుడూ సబబుగా తోచలేదు. కాని శేషాద్రికి మాత్రం శాయిలక్ష్మి మాట వేదవాక్కు.

శాయిలక్ష్మి ఏది చెప్పినా గంగిరెద్దులా తలూపే శేషాద్రి శాయిలక్ష్మికి ఓ మొద్దు బసవడిగా, మొద్దబ్బాయిగా అనిపించేవాడేమో! మొద్దబ్బాయిని కూర్చోబెట్టుకొని తలబద్దలు కొట్టుకునే మాస్టారిలా అర్థం అయినా కాకపోయినా, శేషాద్రి బుర్రలోకి ఏమిటేమిటో ఎక్కించాలని ప్రయత్నించేది. అది వినడం అవసరమా, కాదా, అర్థం అవుతుందా లేదా అని ఆలోచించకుండా, బుద్ధిగా వినేవాడు శేషాద్రి.

శేషాద్రి శాయిలక్ష్మికంటె పెద్దవాడు. శేషాద్రి తరువాత ఆడపిల్ల పుడుతుందనుకున్న రాజమ్మకు భర్త పోవడంతో ఆ కోర్కె తీరకుండా పోయింది. ఆడపిల్ల పుట్టలేదన్న బెంగ, దిగులు, ఆశ, కోర్కె శేషాద్రికి ఆరేళ్ళు వచ్చేవరకూ ఫ్రాకులు, పరికిణీలు తొడిగి, క్రాపు చేయించకుండా రెండుజడలు వేసి, నిండుగా పూలుపెట్టి, బొట్టు కాటుక పెట్టి తన ముద్దు మురిపెం తీర్చుకుంది రాజమ్మ. శేషాద్రికూడా అభ్యంతరం పెట్టలేదు. అతడికి చిన్నప్పటినుండి ఆ బట్టలు వేసుకోవడమే అలవాటైంది. పైగా శేషాద్రి ఆడపిల్లలకంటె అందంగా, నాజూకుగా, పొడుగ్గా వుండేవాడు మరి.

శేషాద్రి బళ్ళో చేరిన రెండేళ్ళకు శాయిలక్ష్మి బళ్ళో చేరింది. ఇద్దరు కలిసి బడికి వెడుతుంటే ఇటు దార్లోనూ, అటు క్లాసులోను అందరూ వెక్కిరించి ఏడిపిస్తే, పరికిణీతో కళ్ళు తుడుచుకునేవాడు శేషాద్రి.

కాని శాయిలక్ష్మి వెక్కిరించలేదు. ఓదార్చింది. అప్పుడే సరిగ్గా ఆ క్షణంలోనే శేషాద్రి పసిమనసులో శాయిలక్ష్మి మంచితనం ముద్రపడింది.

"నువ్వెంత మంచిదానివి శాయీ!" అన్నాడు కృతజ్ఞత నిండిన కళ్ళతో.

కాని ఓ నెలరోజులపాటు ఊరుకున్న శాయిలక్ష్మికి, అంతవరకు శేషాద్రికి రాని సిగ్గు, రోషం వచ్చాయి.

"నిజంగా నేనే మంచిదాన్నయితే, నాతోనే జట్టుగా వుండాలనుకుంటే, రేపటిలోగా క్రాపు చేయించుకొని అబ్బాయిలా మారిపోవాలి. లేకుంటే నీకు నాకు పచ్చి" అంది శాయిలక్ష్మి బెదిరించే ధోరణిలో.

శాయిలక్ష్మితో తప్ప మరెవ్వరితో ఆడుకోని శేషాద్రి ఒక్క పూటంతా ఏడ్చి ఏడ్చి మర్నాటికల్లా అబ్బాయిలా మారిపోయాడు.

"శేషూ! నువ్వు మగపిల్లాడివి. లాగు చొక్కా వేసుకొని, పరికిణీలు వేసుకునే అమ్మాయిలతో తొక్కుడుబిళ్ళ ఆడకూడదు. ఎంచక్కా గోళీకాయలు, బొంగరంఆట ఆడుకోవాలి ఏం?" అంటూ ఏడేళ్ళ శాయిలక్ష్మి మాటలకు తొక్కుడు బిళ్ళ ఆడ్డానికి సిద్ధపడ్డ శేషాద్రి బుద్ధిగా తలూపి వెనక్కి తిరిగి వచ్చేసాడు.

చిన్నప్పటి నుండి శాయిలక్ష్మి చదువులో, శేషాద్రికంటె కాస్త వెనుకే. మాటల్లో కనిపించే చురుకుతనం, ఆలోచనలలో కనిపించే విస్తృత భావపరిధి చదువులో అంతగా వుండేదికాదు.



శేషాద్రి క్లాసులో ఫస్టు వచ్చేవాడు. ఈ విషయంలో శేషాద్రికంటె ఎక్కువగర్వపడేది కాయిలక్ష్మి. ప్రతి నెల మార్కుల రిపోర్టులో శేషాద్రి మార్కులు చూసి, తన స్నేహితురాళ్ళతో, "బావ ఫస్ట్ వచ్చాడు తెలుసా?" అని చెప్పి శేషు భుజంమీద చేయివేసి గర్వంగా చూసేది. ఈర్ష్యపడని కాయిలక్ష్మి అంటె శేషాద్రికి చాలా ఇష్టం.

అయితె శేషాద్రి చదువులో యెంత తెలివిగలవాడో, యెదుటివాళ్ళు నమ్మలేనంత అమాయకత్వంఉండేది మొహంలో. చివరికి రాజమ్మకూడా శేషాద్రి తెలివికలవాడంటె నమ్మేదికాదు.

"అత్తా! బావ క్లాసులో ఫస్ట్" అంటూ చెప్పిన కాయిలక్ష్మి మాటలకు.

"వెర్రి నాగన్న! ఎలా చదువుతున్నాడో యేమో! ఎలా బ్రతుకుతాడో" అంటూ దిగులు, ప్రేమ కలిపితె వచ్చె భావంతో శేషాద్రి వంక చూసే ఆమె మాటలకు అర్థం బోధపడక, "అసలు అత్తయ్యా వొట్టి వెర్రిబాగుల మనిషి" అన్న రిమార్కు పారేసింది కాయిలక్ష్మి చాలా చిన్నవయసులోనే.

"వాడి మొహం! వాడు ఫస్టురావడమేమిటి? ఏదో మాస్టార్లు వాడి అమాయకత్వం చూసి దయగా మార్కులు వేసేస్తె ఫస్టురాడు మరీ" అంటూ తేలిగ్గా మాట్లాడె తండ్రిని చురచుర చూస్తూ—

"నాన్నా! మాస్టార్లకు దయ కలిగితే బెంచి యెక్కించరు, గోడకుర్చి వేయించరు, గుంజీళ్ళు తీయించరు. కాని మార్కులుమాత్రంయెనభైలు, తొంభైలు తేలిగ్గా వేయరు. బావ అంటె నీకు దయేగా. మొన్న సర్కస్‌కు అర్థ రూపాయి ఇవ్వలేదేం? నువ్వే ఇవ్వలేదు కాని యెవరో మాస్టార్లు దయగా మార్కులు వేసేస్తారట" అంటూ నిలదీసి అడిగె కూతురును చూసి తెల్లమొహం వేసేవాడు రాఘవయ్య.

ఒక్క చదువు విషయంలో తప్ప, మరే విషయంలోనైనా, శేషాద్రి అమాయకుడని యెవరైనా అంటె, తెగ బాధపడిపోతూ, తనకు తెలిసిన విషయాలన్ని శేషాద్రికి చెప్పేది. కాని ఒక్కోసారి శేషాద్రి అమాయకత్వం, దాన్ని మించిన మంచితనం చూస్తుంటె కాయిలక్ష్మికి బోల్డంత కోపం వచ్చేది.

ఓసారి—

ప్రక్కింటి సరోజ హోంవర్కు చేయక, శేషాద్రి దగ్గరికి వచ్చి, లెక్కలు చెప్పించుకొని వెళుతూ, 'నువ్వు చాలా మంచివాడివి శేషూ!' అంది. సరోజవచ్చినపుడు కాయిలక్ష్మి ఇంట్లోలేదుకాని, వెళ్లే సమయానికి వచ్చేసింది సరోజ మాటలు విని, తనతో పోట్లాడి. మాట్లాడ్డం మానేసిన సరోజకు శేషాద్రి లెక్కలుచెప్పడం తనను అవమానం చేయడమే అన్నంతగా బాధపడిపోయింది.

ఒంటరిగా మాట్లాడకుండా కూర్చున్న కాయిలక్ష్మి ధోరణి అర్థం కాక "మాస్టారు కొట్టారా?" అన్నాడు శేషాద్రి. అప్పుడప్పుడు, మాస్టారు కొడితే బళ్ళో మౌనంగా వుండి, యింట్లో అలిగి కూర్చోవడం కాయిలక్ష్మికి అలవాటన్న విషయం తెలిసి.

"లెక్కలు సరిగ్గా చేయలేదా? నేను చెప్పనా?" అన్నాడు.

"ఊఁ...మహ బాగా నీకే లెక్కలు వస్తాయనా? నాకేం కాలేదు. నువ్వనుకున్నంత మొద్దావతారాన్నేంకాను నేను," అంది కోపంగా చిరాకు పడిపోతూ.

నోరు తెరిచాడు శేషాద్రి.

"నాకు లెక్కలు రాకపోతేనేం? మాస్టారు కొడితే నన్నే కొడతారు. వెళ్ళి వూళ్ళోవాళ్ళందరికి చెప్పిరా నీకు వచ్చే లెక్కలని. నాకేం చెప్పనక్కర్లేదు. బోడిపెత్తనం!" అంది విసురుగా శాయి లక్ష్మి. అందులో 'పెత్తనం' అనేమాటకు అర్థం తెలీని శేషాద్రి నిర్ఘాంతపోయి, తల్లి దగ్గరికి వెళ్ళిపోయాడు.

"ఎందుకే శాయీ! శేషు యేడుస్తున్నాడూ? నువ్వూ బావా పోట్లాడుకున్నారా?" అంది రాజమ్మ యేం చెప్పకుండా బావురుమన్న శేషాద్రిని చూసి.

"నేనేం పోట్లాడలేదు అత్తా! అసలు బావ యేం చేసాడో నీకు తెలుసా?" అంది శాయిలక్ష్మి కోపంగా. శేషాద్రిని వెనకేసుకొచ్చే శాయిలక్ష్మి అంతకోపంగా అనడంతో, నిజంగానే శేషాద్రి యేదో చేశాడని భయంగా చూస్తూ–


"ఏం చేశాడే శాయీ? వాడొట్టి వెర్రినాగన్నా..." అంటూ యేదో అంటున్న రాజమ్మ ధోరణికి చిరాకు పడిపోతూ, మింగేసేలా చూసింది శాయి లక్ష్మి.

"మొన్న సరోజ బావను వెక్కిరించింది. బావ యేం అన్లేదు. నేను పోట్లాడాను. తిరిగి ఇవ్వాళ, బావ సిగ్గులేకుండా సరోజకు లెక్కలు చెప్పాడు" అంది.

"నిన్ను వెక్కిరించే ఆ సరోజకు యెందుకు చెప్పావురా లెక్కలు?" అంది. రాజమ్మ.

"వచ్చి చెప్పమని అడిగిందే అమ్మా!" అన్నాడు శేషాద్రి అమాయకంగా.

"అందుకని, చెప్పడమే. శాయికి కోపం వచ్చింది చూడు!" అనిఅంటున్న తల్లిమాటలకు, తనది తప్పే అన్నట్టుగా తలూపే శేషాద్రిని చూసి విసుక్కుంది శాయిలక్ష్మి.



"గంగిరెద్దు!" అని కసిగా గొణు క్కుంది.

"ఆ తెయ్య చెపితేకాని తెలీదు. మొద్దురాచిప్ప" అంది విసురుగా.

ఇంకోసారెప్పుడు, శాయిలక్ష్మి మాట లాడని వారి కెవ్వరికి లెక్కలు చెప్పడం కాని, నోట్స్ ఇవ్వడంకాని చేయనని ఒప్పుకున్నాడు శేషాద్రి.

మరోసారి యెదురింటి రామానికి ఇంగ్లీష్ రాదంటె చెప్పాడు.

"నువ్వలా నీకు వచ్చినవన్నీ చెబితే నువ్వు క్లాసులో ఫస్ట్ రావు" అంది శాయి లక్ష్మి.

"రామంమంచివాడు! నీతో మాట్లాడు తాడుగా!" అన్నాడు శేషాద్రి.

"అయితే యేమిటి?"

"మరి రామానికి రానివి చెప్పాను. పాపం! ఫెయిలవుతాడుకదూ" అంటూ జాలిపడే శేషాద్రిని చూసి, "మాస్టారు చెప్పినపుడు సరిగ్గా వింటె ఎవ్వరికైనా వస్తుంది. క్లాసులో వినకుండా యెందు కూర్చోవాలి? అది తప్పుకదూ? అలాంటి వారసలు ప్యాసవకూడదు" అంది శాయి లక్ష్మి.

నిజమే. రామం క్లాసులో పాఠాలు సరిగ్గా వినడు. కలవారిబిడ్డ. క్లాసులు ఎగ్గొట్టి చెరువుగట్టు వెంట తిరిగేంత గారా బంగా పెంచారు ఇంట్లోవాళ్లు. కాని పరీక్షలనగానే ప్యాసవ్వాలనుకుంటూ అందరి ఇళ్ళమీదికి, ముఖ్యంగా శేషాద్రి ఇంటిమీదికి పరుగెత్తుతాడు. మొదట్లో రామంతో, శేషాద్రి మాట్లాడ్డమే సహించ చేదికాదు శాయిలక్ష్మి. కాని రామం పిలి చినా యెక్కడికి వెళ్ళని, బుద్ధిమంతు డైన శేషాద్రిమీద నమ్మకంతో మాట్లా డితే అడ్డుకునేదికాదు.

క్లాసులో వినికూడా అర్ధంకాని మొద్దు బుర్రలకు, పుస్తకాలు లేక చదవలేని వాళ్ళకు, శ్రద్ధవుండిఅవకాశంలేనివాళ్ళకు సహాయం చేయాలి కాని, రామంలాంటి వాళ్ళకు చేయడం ఘోరమైన తప్పు అన్యాయం అనే శాయిలక్ష్మిది సూటి మనస్తత్వం. ధైర్యం యెక్కువే. ఏమాట కాని, మొహమ్మీదే రఫీమని అనేస్తుంది. స్కూల్లో యెదుటి పిల్లలు కొట్టినా, వెక్కిరించినా, మౌనం వహించే శేషు లోని అమాయకత్వం, బలహీనత శాయి లక్ష్మిలో లేవు. శేషు తరఫున తానే నాలుగు తగిలించి, వీలైతే, పుస్తకాలు విసిరేసి పరికిణీ దోపుకొని, ముష్టియుద్ధా ల్లాంటివి చేసి, కుర్రాళ్ళను సైతం చిత్తుగా తన్నిన సందర్భాలు వున్నాయ్. దెబ్బకు దెబ్బ తీసేవరకు, వూరుకునేదికాదు. ఇక పోట్లాడుకోవడంలో శాయిలక్ష్మి గొంతు చెప్పుకోవాలి.

చాలాసార్లు శేషాద్రి-"నువ్వు సంగీతం నేర్చుకో శాయి. నీ కంఠం చాలాబావుం టుంది. గట్టిగా పాడగలవు కూడా" అని అంటున్నప్పుడు మింగేసేలా చూడ బోయి, శేషాద్రి మొహంలో కదిలే అమాయకత్వాని చూసి తమాయించు కునేది. ఇదంతా చిన్నప్పటి జీవితం.

రెండు సంవత్సరాల తేడాలో శేషాద్రి శాయిలక్ష్మి కాలేజిలో చేరారు. శాయి లక్ష్మి చేరిన నెలకోజుల్లో, అందరికి శాయి లక్ష్మి పేరు తెలిసిపోయింది.

శాయిలక్ష్మి అందమైంది. అంతకంటె

అందమైనవి ఆమె రెండు కళ్ళు. ఎప్పుడూ హుషారుగా, చలాకీగావుండి అల్లరిగా మాట్లాడే శాయిలక్ష్మి అంటె చాలామంది అబ్బాయిలకు ఇష్టంవున్నా, పరిచయం పెంచుకోవాలన్నా, తమ స్నేహాన్ని ప్రకటించాలన్నా, శాయిలక్ష్మి అంటె ఓ విధమైన భయంతో ఆగిపోయారు.

కారణం___

శాయిలక్ష్మి కాలేజీలో చేరిన నెలరోజులకే, లైబ్రరి మెట్లదగ్గర పరధ్యానంగా నడుస్తూ, ఢీకొట్టిన అబ్బాయి చెంప ఛెళ్లు ఛెళ్లుమనిపించింది. వెనక కుర్రాళ్లు ఆ అబ్బాయి చేసిన దానికి ఉత్సాహంగా అరిచినా, ఆ వెనుకే వినిపించిన ఛెళ్ళు ఛెళ్ళుమన్న శబ్దంతోపాటు, తిరిగి వచ్చిన ఆ అబ్బాయి రెండుబుగ్గలమీద యెర్రటి వాతలనుచూసి "నాయనోయ్ ఢీకొడితే నొసలు యేమాత్రం అదృష్టానికో నోచుకున్నా, బుగ్గలుమాత్రం నూనెలో వేయకుండానే ఉబ్బిపోయే బూరులవుతాయి రోయ్" అంటూ హడలిపోయారు.

"శాయి, నువ్వలా చేయి చేసుకోవడం నాకు నచ్చలేదు" అన్నాడు విషయం తెలిసిన శేషాద్రి.

"నీ కసలు బుద్ధిలేదు శేషూ! ఎవరో పరాయి మగాడు అలా చేసినందుకు వెళ్ళి యెముకలు విరగ్గొట్టే మగాళ్ళను చూసాను కాని, నీలాంటి వాణ్ణి చూడలేదు" అంది కోపంగా.

"నూరి అలాంటివాడుకాదు శాయీ! వాడికి పరధ్యానం యెక్కువ. వాళ్ళొక్కడే నా స్నేహితుడు. ఎవరో వాణ్ణి కొడితే బాధపడేవాణ్ణికాదు. నువ్వే కొట్టావని తెలిసి.." అని అంటున్న శేషాద్రి మాటలకు సిగ్గుపడిపోయింది శాయిలక్ష్మి.

రెండేళ్లు గడిచినా, ఏ ఒక్క అమ్మాయిపేరు సరిగ్గా తెలీని శేషాద్రి స్నేహితుడ్ని తను కొట్టానని తెలిసి శేషాద్రి స్నేహితుడంటే అతనెలాంటి వాడో అర్థంచేసుకున్న శాయిలక్ష్మి శేషాద్రి ఎదురుగానే నూరికి క్షమాపణ చెప్పుకుంది.

మెచ్చుకోలుగా చూసాడు శేషాద్రి.

కాని_

మరోసారి అప్పుడే మెట్లదగ్గర నూరితో మాట్లాడి వెనుతిరుగుతున్న శాయిలక్ష్మిని ఎవరో తాకడంతో తలెత్తి చూడకుండానే చాచి లెంపకాయ కొట్టింది.

చెంపపట్టుకుని నిలబడ్డ శేషాద్రిని చూస్తూనే శాయిలక్ష్మి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మొహం చూపించలేనట్టుగా పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది.

"ఓర్నాయనోయ్! బావను కైతం లెక్కచేయకుండా కొట్టింది. ఆఅమ్మాయి చేయి మరీ లూజ్ రా... తాకితే చాలు చెంపలమీద డాన్స్ చేస్తుంది" అంటూ జాగ్రత్తపడిపోయారు, శాయిలక్ష్మి అంటే గుటకలు వేసె వాళ్ళంతా. వేద్దామన్న అడుగు వేయకుండానే మరకొన్ని అడుగులు వెనక్కి వెళ్ళిపోయారు.

కాని శేషాద్రిని కొట్టినందుకు, శాయిలక్ష్మి మాత్రం బాధపడి పోయింది, "నన్ను క్షమించకు బావా నన్ను కూడా కొట్టు" అంటూ బావురుమని ఏడుస్తున్న శాయిలక్ష్మిని చూసి, "పోన్లెద్దూ' ఈ విధంగానైనా నీ గురించి వాళ్ళ వాళ్ళ

నోళ్ళు మూతబడిపోతాయ్!" అన్నాడు క్షమించేస్తూ శేషాద్రి.

ఓసారి శాయిలక్ష్మికి ఓ ప్రేమలేఖ వచ్చింది. ఆ ఉత్తరం రాసిన దౌర్భాగ్యుడి పేరు శ్రీధర్. డిబార్ అయ్యే వరకు వెళ్ళింది వ్యవహారం. శేషాద్రికోసం, శ్రీధర్ డిబార్ కాకుండా రక్షించింది. అయినా,ఆ వ్యవహారం ప్రిన్స్‌పాల్ వరకు వెళ్ళినందుకే బాధపడ్డాడు శేషాద్రి.

"బావా! ఈ కుర్రాళ్ళ కిదో తెగులు. నీ మొహంచూసి,డిబార్ చేయించడానికి ఒప్పుకోలేదు. అందమైన అమ్మాయి కనపడగానే ప్రేమలేఖ రాయడం, ప్రేమా దోమా అంటూ మాటలతో బురిడీ కొట్టించడం, పెళ్ళనగానే పలాయనం చిత్తగించే ఈ పిరికి రోమియోలకు యిలాగే బుద్ధిచెప్పాలి. శ్రీధర్ నాకే కాదు, నాకంటే ముందు రాజ్యానికి రాసాడు. రాజ్యం నీకు తెలుసుకదూ? జ్ఞాపకం లేదనుకుంటా"అంది తెలియకున్నా తలూపుతున్న శేషాద్రి వాలకాన్ని చూసి.

"వరసగా వారానికి నాలుగు చొప్పున పదహారు రాసాడు. ఒక్కదానికి జవాబివ్వకుండా నేనే అడ్డుకున్నాను. చివరికి ఓసారి జవాబివ్వనందుకు బెదిరించాడట దార్లో అడ్డగించి."

"ఈ విషయం ముందుగానే ఊహించి రాజ్యానికి ఓ సలహా చెప్పాను. అతనలా బెదరించగానే, యింటికి వచ్చి నాన్నతో మాట్లాడండి. నాకు యిష్టమే మీరంటే" అనే మాట చిలకలా పలికిన రాజ్యం మాటలకు శ్రీధర్ రూట్ మార్చుకొని నాకు రాశాడు. పిరికి సన్నాసి" అంది కసిగా.

"నీకు రాధ తెలుసా! ఒహో తెలీదు కదూ! దానికి యిలాగే ఓసారి ఓ ప్రబుద్ధుడు ఉత్తరం రాస్తే అది ఉబ్బి తబ్బిబ్బై పోతూ, జవాబు రాసింది. మరునాటి కల్లా, ఆ పిచ్చి వెధవ అందరికి ఆ విషయం చెప్పడంతో కాలేజి గోడలమీద పేర్లు వెలిసాయి. ఈ విషయం నీకు తెలుసుగా! పాపం రాధా వాళ్ళింట్లో ఆ విషయం తెలిసి, కాలేజి మాన్పించేసారు. చదువు పూర్తికాకుండానే పోయింది. యింత వరకూ పెళ్ళికాలేదు"

"పెళ్ళి చేసుకునే ధైర్యంలేని వాళ్ళెప్పుడూ ప్రేమించకూడదు!"అంది శాయిలక్ష్మి తన సిద్ధాంతాన్ని గట్టిగా చెబుతూ.

"నిజంగానా!"అన్నట్టు చూసే శేషాద్రిని చూసి చిరాకుపడిపోతూ "నీకసలు ఏం తెలీదు బావా" అంది విసుక్కుంటూ.

"అంతేకాదు – నువ్వింత అమాయకంగా, ఎదుటి వాళ్ళు చెప్పేవరకు కూడా గ్రహించలేక, ఆలోచించలేక బుద్ధావతారంలా వుంటే, నిన్ను ఏ అమ్మాయి పెళ్ళిచేసుకోదు. చేసుకున్నా, సుఖపడదు. నాలాంటిదైతే అసలు నీలాంటి వాణ్ణి, నీ అమాయకత్వాన్ని భరించలేదు" అంటూ రిమార్కు పారేసింది.

శేషాద్రి నవ్వాడు.

శాయిలక్ష్మి బి.ఏ. పూర్తిచేసింది.

శేషాద్రి ఎమ్.ఏ. పూర్తిచేసి, హైద్రాబాద్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

శేషాద్రికి బి.ఏ.లో క్లాస్ మేట్‌ని నేను. శాయిలక్ష్మి విషయం అంతా కాలేజీలో చూసి, కొద్దిగా శేషాద్రి చెప్పడం

ద్వారా, మరోసారి వాడితోపాటు వాళ్ల ఊరికి వెళ్ళడంద్వారా తెలుసుకున్నాను. కాస్త పరిచయం కూడా వుంది.

ఎమ్.ఏ. ఒక్క సంవత్సరమే చదివి మానేసి, ఉద్యోగం వెతుక్కున్న నన్ను, శేషు మర్చిపోలేదు. ప్రతి చిన్న విషయం ఆత్మీయుడిలా చెప్పేవాడు శేషాద్రి.

ఆ మధ్య రాఘవయ్య, శాయిలక్ష్మికి సంబంధాలు చూస్తున్నాడని తెలిసి, రాజమ్మ వెళ్ళి అడిగింది. మేనరికం పోగొట్టుకోవద్దని, బ్రతిమాలింది.

"శేషు మరీ అమాయకుడు అత్తా! ఈ మాట బావ స్వయంగా వచ్చి అడిగే ధైర్యం లేక నిన్ను పంపించాడేం?" అంది శాయిలక్ష్మి.

"వాడెందుకు అడగాలే? వాడు నీ బావ. నువ్వు పుట్టగానే వాడి పెళ్ళాని వైపోయావ్. నీమీద వాడికి హక్కు వుంది. దేవిరించినట్టు ఎందుకు అడగాలేం?" అంది రాజమ్మ.

"అబ్బా..బోడి హక్కు..ఎక్కడుందేం? అయినా. ఆ హక్కు వినియోగించుకునే ధైర్యంలేని నీ కొడుకులాంటి పిరికివాణ్ణి నేను కట్టుకోను. వెళ్ళి చెప్పు" అంది శాయిలక్ష్మి ఖచ్చితంగా.

రాజమ్మ ఈ విషయం అంతా వివరిస్తూ శేషాద్రితో చెప్పడం విన్న నేను, "హమ్మ ఆడదికాదురా" అనుకున్నాను. కాని శేషాద్రి మాత్రం ఎందుకో ఉలిక్కిపడిపోయాడు.

శాయిలక్ష్మికి సంబంధం కుదిరిందని, తెలిసిన రోజు రాజమ్మ బాగా ఏడ్చింది. శేషాద్రి విగ్రహంలా కూర్చున్నాడు. వాడి వాలకం చూస్తుంటే బాధపడుతున్నాడో లేదో అర్థం కాలేదు. కాని, ఓ రెండు రోజులు మాత్రం మనిషి కనిపించకుండా గాబర్గా పెట్టేసాడు శేషాద్రి.

ఆ తరువాత వారం రోజులు గడిచాయి. నేను ఆ వారంరోజులుగా ఆఫీసులో పని మరీ వొత్తిడిగా వుండడంతో వెళ్ళలేక పోయాను. ఇంతట్లోనే ఈ వార్త.

పెళ్ళయిపోయింది.

శాయిలక్ష్మికి శేషాద్రికి పెళ్ళయిపోయింది.

ఎలా?

శాయిలక్ష్మి ప్రేమించిందిట ఓ డాక్టర్ని. అతగాడితోనే పెళ్ళి నిశ్చయం చేసాడట రాఘవయ్య. అందుచే నీ కొడుకును చేసుకోను పో అందిట శాయిలక్ష్మి.

మరి ఈ పెళ్ళెలా జరిగింది?

నేను యింకెంతోసేపు కుర్చీ కతుక్కొని కూర్చోలేక లేచి బయలుదేరాను. నేను వెళ్ళేసరికి, శాయిలక్ష్మి ఎదురైంది. నన్ను కూర్చోమని చెప్పి "శేషూ! రాజు వచ్చాడు" అంటూ కేకపెట్టిన శాయిలక్ష్మి కేకకు ఐదు నిమిషాల్లో వచ్చేసాడు శేషాద్రి.

ఇద్దరం పార్కువైపు బయలుదేరాం.

"శాయిని నేను ప్రేమించారా రాజూ! కాని మామయ్య కాదంటాడని దానికి శాయివంత పాడుతుందని అనుకోలేదు. కాని అమ్మ వచ్చి శాయి అన్నమాటలు చెప్పాకా, ప్రేమించిన శాయికోసం నేనేం చేయాలో నిర్ణయించుకున్నాను."

"అందుకే ఆ రెండు రోజులు శాయి

దగ్గరికి వెళ్ళి అడిగాను.''

''ఏమని?'' అన్నా న్నేను నోరు తెరుస్తూ. పత్తాలేకుండా రెండు రోజులు వెళ్ళి ఫ్రెండింట్లో వున్నానని నన్ను సైతం నమ్మించినవాడి తెలివికి ఆశ్చర్య పోతూ.

''నన్ను తను ప్రేమిస్తోందా లేదా అని_నన్ను ప్రేమిస్తోందట కాని పెళ్ళి మాత్రం చేసుకోనంది. నిజం చెప్పొద్దూ బోల్డు కోపం వచ్చింది. నేనెప్పుడూ శాయిని కొట్టలేదు కాని ఆరోజు రెండు బుగ్గలూ కందిపోయేలా కొట్టాను.''

''మామయ్య కళ్ళప్పగించి చూస్తున్నా ఏమిటో వెర్రి ఆవేశం, నాలో ధైర్యంగా విజృంభించింది. శాయి నాతో చెప్పిన ఒకమాట తిరిగి అప్పగించేసి, లాక్కొ రావాలనుకున్నాను. కాని, శాయి కిష్టం లేకుండా, నేను శాయిని పెళ్ళిచేసుకో లేను. అందుకే వచ్చేసాను.''

''కాని...చిత్రం ఏమిటో తెలుసా! శాయి చాలా మంచిది.'' అన్నాడు శేషు.

వెర్రిగా చూసాను. అదేనాచిత్రం? అన్నట్టుగా.

''అమ్మ వెళ్ళి, నీ కూతురుకు పెళ్లెలా చేస్తావో నేను చూస్తాను. నాకొడుక్కేం తక్కువా అని అంటే, మావయ్య వెక్కి రిస్తూ, ''పిరికి సన్నాసి! వాడు నా కూతురునేం చేయలేడు. తాకి బతగ్గలడా? అని అన్నాడట. అమ్మకంటే ఎక్కువ రోషపడిపోయింది శాయిలక్ష్మి. అందుకే అమ్మతో నా హక్కు, ధైర్యం గురించి సవాలుచేస్తున్నట్టు మాట్లాడిందిట. నేను వెళ్ళి వచ్చేసాకా, ''రౌడీ వెధవ వాడి ధైర్యం మండిపోను. చెట్టంత మనిషిని ఎదురుగా వున్నానన్న భయంలేక ఎంతపని చేసాడు'' అని అంటున్న తండ్రి మాట లకు సమాధానంగా, ఆమర్నాడే శాయి నాకు ఉత్తరం రాసింది. తాను వచ్చే స్తున్నట్టు. మామయ్య మాటలకు ముందుగా ఏడ్చినా,అమ్మ బిగుసుకుపోయి, శాయి మీద మనసు మార్చుకొని ఆపేరే ఎత్తకూడదంది. అందుకే అమ్మకు కూడా తెలీకుండా, శాయి ఇక్కడికి రాగానే వెంటనే పెళ్ళిచేసుకొని యింటికి తీసు కొచ్చారా. అమ్మ ఏం అన్లేదు. కాని మామయ్య మాత్రం, నిన్న వచ్చి అల్లరి పెట్టి, నేను శాయిని లేవదీసుకొచ్చానని అన్నాడు. పాపం! మావయ్యకేం తెలీదు.'' అని చెప్పి జాలిపడుతున్న శేషాద్రివంక కళ్ళు పెద్దవిచేసి చూసాను.

''ఎవరు ఎవరిని పెళ్ళి చేసుకున్నారూ?'' నా మెదడులో తొలు స్తున్న ప్రశ్న అప్రయత్నంగా నాకు తెలీ కుండానే వెలువడింది.

''ఒకరు యింకొకరిని చేసుకోవడం ఏమిట్రా? మేమిద్దరం పెళ్ళిచేసుకున్నాం అంతే_'' అన్నాడు శేషాద్రి నవ్వుతూ. 'మేమిద్దరం' అనేచోట నొక్కి పలుకుతూ.

నిజమే___

వాళ్ళిద్దరూ___శేషాద్రి శాయిలక్ష్మి ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. సుఖాంతంగా పెళ్ళితో ముగించారు వాళ్ళ ప్రేమకథని. ఇది_ఓ ప్రేమకథేనా? అన్పించింది నాకు.

శాయిలక్ష్మి ఒకప్పుడు శేషాద్రితో అన్నమాటలు గుర్తుకువచ్చి నా ప్రశ్నకు జవాబు దొరికింది. ★

(చివరి భాగం)

త్రను ఒక రోజున హృదయ పూర్వకంగా ప్రేమించిన ఈ మాధురినే ఇవాళ ప్రేమిస్తు న్నట్లు నటించాలా? తన నిజమైన ప్రేమని ఆమె తృణీకరిస్తే ఆమె, అబద్ధపు ప్రేమని తను అంగీకరించాలా? ఆనాడు తన ప్రార్థనని ఆమె కాదంది ఈనాడు తనూ ఆ పనే చేస్తే?

శేఖర్ ఆమెకేసి చూశాడు.

ఆ ముఖం నిండా దైన్యం. ఆ కళ్ళనిండా ఆవేదన.

ఆమె మళ్ళీ అంది.

"ఈ సహాయం, అయితే మీవల్లే కావాలి. తర్వాత కిరీటిని ఒప్పించి మా ఇద్దర్నీ ఒకటి చెయ్యగల సామర్థ్యం కూడా మీకే వుంది. మీరు కాదంటే, ఇంక నేను మా నాన్నగారి మానసిక క్షోభ తగ్గించడం కోసం యెవర్నో ఒకర్ని విధిగా పెళ్ళాడి తీరాలి. అంటే కిరీటికి శాశ్వతంగా దూరం అయిపోవాలి. నా కోసం కాకపోయినా పోనీ మీ మిత్రుడు కిరీటి కోసమేనా మీరీ త్యాగం చేస్తే .'

మాధురి చెంపల మీదుగా కన్నీళ్లు కారుతున్నాయి.

తన కేవిటీ పరీక్ష!

నిజంగా తను ఎప్పుడూ మాధురిని ప్రేమించి ఉండకపోతే, జగత్పతిరావుగారు కోలుకోవడం కోసం కొన్నాళ్లు నటించమంటే నటించవచ్చు. కాని గుండెలనిండా నిజమైన కోరికని దాచుకొని, పైకి అబద్ధంగా నటిస్తూ బ్రతకడం ఎంత కష్టం —ఎంత క్షోభ! అనుక్షణం ఈ నిజం అబద్ధాలమధ్య జరిగే పోరాటానికి తను తట్టుకోగలడా? అసలింతకీ తను ఎందుకు చెయ్యాలీ అర్థంలేని త్యాగం?"

"ఈ ఉపకారం చెయ్యలేరా మీరు?" కళ్లు తుడుచుకుంటూ ఆఖరుసారిగా అడిగింది మాధురి

ఆ మాటలో మండుతూన్న గుండెలు అరిచిన ఆవేదన.

కాలిపోతూన్న జీవితం చేసిన ఆక్రోశం.

దైన్యం అంతా కరడుకట్టి జాలిగా క్షోభించిన ఆరాటం.

శేఖర్ "సరే" అన్నాడు నెమ్మదిగా.

"నిజంగానా? మీరు అంగీకరించారా?" అంది మాధురి ఉత్సాహంగా.

ఆ ఉత్సాహం వెనక ఆపుకోలేనంత దుఃఖం.

అంతు లేనంత దిగులు.

మనస్సు ముక్కచెక్క లవుతూంటే, బరువు తీరేలాగ ఏడ్చే ధైర్యం లేక, ఉత్సాహంగా వేసిన వెఱ్ఱికేక అది.

కాస్సేపు మౌనంగా కూర్చున్నాక, ఇంక శేఖర్ లేవబోతూంటే పక్క గది లోంచి దగ్గు వినిపించింది.

"మీ నాన్నగారు లేచినట్లున్నారు" అన్నాడు శేఖర్.

"ఆ దగ్గు డాడీదికాదు. బావాజీది."

"బావాజీ? ఆయ నెవరు?"

మాధురి నాలిక కరుచుకుంది. బావాజీ సంగతి బైట ఎవరికీ తెలియకూడదని కట్టడి చేశాడు డాడీ—రెండు పూటలా ఆ గదిలోకి అన్నం పట్టికెళ్లే బట్లర్‌కి తప్ప ఇంట్లో నౌకర్లెవ్వరికీ తెలియదు ఆ గదిలో ఎవరుంటున్నదీ—అసలా ఛాయలకే ఎవరూ వెళ్ళడానికి వీలులేదు—ఇలా ఇంత రహస్యంగా ఉన్న బావాజీ సంగతి తను అనుకో కుండా ఇప్పుడు శేఖర్‌కి చెప్పేసింది. అందుకే జరిగిన పొరబాటుకి నాలుక కరుచు కొంది మాధురి.

మాధురి అలా ఎందుకు తొట్రుపడిందో అర్థం కాలేదు శేఖర్‌కి. "సరే - వెళ్ళి వస్తాను" అంటూ అడుగు కదిపాడే కాని, శేఖర్ మనస్సులో బావాజీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయాడు.

13

"నీమాట నే నెప్పుడు కాదన్నాను అత్తయ్యా" అన్నాడు కిరీటి తలవంచుకొని పాదాలకేసి చూసుకుంటూ.

దాంతో సువర్చల ముఖం ఆనందంతో విప్పారింది. "నాకుతెలుసు నువ్వు నామాటెప్పుడూ కాదనవు. నా భయం అల్లా జయ గురించే-పైగా ఈ మధ్యన అది బొత్తిగా చెప్పినమాట వినడంమానేసి నువ్వెంతంటే నువ్వెంత అనేలా తయారయింది." అంది

కిరీటి ఆమాట విని ఆశ్చర్యంగా తలెత్తిచూసి వెంటనే తేలిగ్గా నవ్వేసి "నీచాదస్తం కాని జయ మాత్రం ఎందుకు వినదూ?" అన్నాడు.

"అలా అనకు. అదిప్పుడు పూర్వపు జయకాదు. నామాట అబద్ధం అయితే దాన్నిప్పుడు పిలిచి నీ ఎదురుగానే అడుగుతాను. ఏం సమాధానం ఇస్తుందో విందువు గాని" అంటూ "జయా! ..విన్నే . ఓమాటిలారా" అంటూ పిలిచింది సువర్చల

"చదువుతూన్న కథల పత్రికని ఆ మట్టునే చేత్తో మడిచి పట్టుకుని విసుక్కుంటూ వచ్చి "ఏం?" అంది జయ.

"ఏం చేస్తున్నావు?"

సువర్చల ప్రశ్నకి జయ జవాబు చెప్పలేదు.

"మాట్లాడితే ఇదొహటి! మంచం నడుం ఎక్కి కూర్చోవడం మాసపత్రికలూ వారపత్రికలూ తిరగెయ్యడం, అర్థంలేని కథ ఒకటి దొరికితే చాలు అన్నం కూడా

అక్కర్లేదు. ఇప్పటి పిల్లలకి!'' అంది సువర్చల జయ చేతిలోవున్న పత్రికకేసి చిరాగ్గా చూస్తూ.

''ఇప్పుడింతకీ ఎందుకు పిల్చావు?''

''ఎందుకా? కూచో చెప్తాను 'నీ మాటకాదనను అత్తయ్యా' అన్నాడు కిరీటి. నువ్వు కూడా నాకా భరోసా ఇస్తేనా ..''

''ఏ విషయంలో? ఏ సందర్భంలో?''

''తర్వాత చెప్తాను. ముందు మాటియ్యి నువ్వు చెప్పింది కాదననని.''

''ఆ చెప్పేదేవిటో తెలియకుండా ముందెలాగ మాటియ్యడం?''

''చూశావా కిరీటీ! నీకూ దానికీ వున్న తేడా అది'' అంది సువర్చల నిట్టూరుస్తూ.

కిరీటి కంగారుగా ''నువ్వు బాధపడకు అత్తయ్యా జయ కూడా నీమాట కాదనదు. ఆ మాటచెప్పు జయా! అత్తయ్య ఏం చెబుతుందో అని నీకు అనుమానం ఎందుకు? ఏం చెప్పినా మన శ్రేయస్సుకోరే కదా?'' అన్నాడు.

జయ మాట్లాడలేదు.

''మనని ఇంతగా పెంచి పెద్దచేసిన అత్తయ్యంటే నీకు అభిమానం ప్రేమాలేవా?''

''ఉంటే? షరతులులేని దస్తావేజుమీద దస్కతు చెయ్యాలా? ప్రేమ వేరు, ప్రమాణాలు చెయ్యడం వేరూను'' అంది జయ దృఢమైన కంఠంతో.

ఆమె మాటలకి సువర్చలా కిరీటీ ఇద్దరూ గతుక్కుమన్నారు. కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

''ఇంతకీ నువ్వు పిలిచింది ఎందుకో చెప్తావా వెళ్ళిపోమంటావా'' అంది జయ చిరాగ్గా.

సువర్చల జయని నఖశిఖ పర్యంతం నిశితంగా చూసి ''కుర్రపిల్లవి. నీతోనాకేవిటి గానీ. చెప్తావినూ, కిరీటి చదువా అయిపోయింది. ఇవాళో రేపో ఉద్యోగం వస్తుంది ఎక్కడో అక్కడ. ఈలోగా పెళ్ళిచేసేస్తే ..'' అంటూ మధ్యలో ఆగింది.

'ఇదా అత్తయ్య చెప్పదలుచుకున్న విషయం! ఇందుకన్నమాట ముందు నేను చెప్పినట్టు వింటావా అని అడిగింది.' అనుకున్నాడు కిరీటి.

జయ వెటకారంగా నవ్వి ''చేసెయ్యి. ఆ సంగతి నాకుచెప్పడం ఎందుకు?'' అంది.

''ఎందుకా? ఇందులో నీకు కూడా సంబంధంవుంది కనకే చెప్తున్నాను. కిరీటి పెళ్ళి ఎవరితోటో అయే మాటయితే నీకు చెప్పడం ఎందుకు?''

''అంటే?''

''ఇంకా విడమరిచి చెప్పాలా?''

''నేను చచ్చినా నీ మేనల్లుడిని చేసుకోనని ఇంతక్రితం ఎన్నిమార్లో చెప్పాను.''

''ఏవిటే ...వాడు నా మేనల్లుడేనా? నీ బావకాదూ?''

"అయితే? పెళ్ళిచేసుకోవాలని ఉందా?"

"అలాంటి మొగుడు నీకు దొరకొద్దూ?"

"అవునవును. స్వంతంగా ఏం ఆలోచించలేక ఎవరేది చెబితే అలాగే తలాడించే బుద్ధావతారం దొరకడం కష్టమేమరి" వెటకారంగా కిరీటికేసి చూస్తూ అంది జయ.

తన మొహంమీద ఆమాట అన్నందుకు కిరీటి మనస్సు కించపడింది. ఇంతక్రితం ఎన్నిమార్లో జయ తనని ఈసడించింది. పరోక్షంగా అవమానపరిచింది. తను ఎంతో ఆసక్తితో ఏదైనా చెప్పబోతే వినకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోవడమో, వింటే తేలిగ్గా నవ్వేసి "ఓస్-ఇదా" అనడమో చేసేది. ఆప్యాయంగా పలకరించబోతే కోపంతో విసిరికొట్టేది. ఇలా ఎన్నిమార్లు ఎలా ప్రవర్తించినా అంతగా మనస్సుకి పట్టించుకోకుండా "ఏదో విసుగులో వుందికాబోలు. పోనిద్దూ" అంటూ సరిపెట్టుకుంటూ వచ్చాడు. మళ్ళీ మామూలుగా మేనత్త కూతురనే అభిమానాన్ని పెంచుకుని ఆత్మీయంగా చూస్తూనే వున్నాడు. ఈ చీదరింపూ ఛీత్కారం మరీ రెండు మూడేళ్ళనుంచి ఎక్కువైంది. ఇలా అనుకుంటూ మొహం చిన్నబుచ్చుకొని ఎటో చూస్తూ వుండి పోయాడు కిరీటి.

అతని మొహంచూస్తే సువర్చలకి జాలేసింది. ఆజాలి జయపట్ల పట్టలేని కోపంగామారింది. కళ్ళు పెద్దవిచేసి కోపంతో దవళ్లు కదిలిపోతూంటే, జయమీదకి చెయ్యి ఎత్తుతూ "ఏమిటే ఏమిటన్నావు? వాడు బుద్ధావతారమా?" అంటూలేచింది.

ఆ కోపంలో సువర్చల ఆడపులిలా కనిపించింది.

ఆమె ముఖం మండుతూన్న కొలిమిలా వుంది.

కళ్లు ప్రాణంతీసె కత్తుల్లా వున్నాయి.

ఎత్తిన చెయ్యి నెత్తిని పడబోతూన్న పిడుగులా భయంకరంగావుంది.

ఎప్పుడూ సువర్చలని ఆరూపంలో చూడలేదేమో, గుండె చెదిరిపోయే ఆరూపం చూసి, భయంతో కెవ్వున అరిచి, ఆ తర్వాత నోటమాటలేక, నిలువుగుడ్లు పడిపోయి, ఆ మట్టునే వుండి పోయింది జయ.

జయ పరిస్థితి చూసేటప్పటికి కిరీటి కంగారుపడ్డాడు. కోపంతగ్గి ఏంజరిగిందో అర్థంచేసుకొనేసరికి, సువర్చలా కంగారుపడింది.

నేలమీదికి ఒరిగిపోతూన్న జయని పొదివి పట్టుకున్నాడు కిరీటి. కిరీటికి సువర్చల సాయంచేసింది ఇద్దరూ కలిపి జయని మంచంమీద పడుకోబెట్టారు. కిరీటి గ్లాసుడు నీళ్ళయితే పట్టుకొచ్చి జయ ముఖంమీద జల్లాడు. సువర్చల పక్కన కూర్చుని విసురుతూ కళ్ళనీళ్ళు పెట్టుకోసాగింది అదిచూసి "అదేమిటి అత్తయ్యా. నువ్వు మరీను. కళ్లు తిరిగినట్లున్నాయి. కాస్సేపట్లో అదే సర్దుకుంటుంది" అన్నాడు కిరీటి ధైర్యంచెబుతూ.

పైటతో కళ్లుతుడుచుకుంటూ "నాది దురదృష్ట జాతకం కిరీటీ! నా కెప్పుడో కాని కోపంరాదు. వచ్చినప్పుడు ఇలాగే ప్రళయంలావస్తుంది ఓమారు వచ్చి నా

అదృష్టాన్నీ ఆనందాన్నీ పోగొట్టుకున్నాను. ఆ తర్వాత ఒకమారు నువ్వు పైకి ఎగరేసిన ఇనపముక్క వచ్చి పక్కింటి వారి అబ్బాయి తలమీదపడి "మీ కిరీటి మా అబ్బాయిని చంపేశాడో" అంటూ ఆవిడవచ్చి పెద్దరగడచేస్తే ఆకోపంతో వళ్లుతెలియక నీ వీపుమీద పేక బెత్తంతో పిచ్చిగా కొట్టేసి, శాశ్వతంగా నీలో చురుకుతనాన్ని చంపేశాను. లేక పోతే ఎంత చలాకీగావుండే కుర్రాడివని నువ్వు! ఆ తర్వాత కోపం తెచ్చుకోకూడదని ఒట్టుపెట్టుకున్నాను. అందుకే జయ ఎలా పెరిగితే అలా పెరగనిచ్చాను. కాని ఇవాళ అది నిన్ను అలా అవమానపరిచేసరికి కోపం ఆపుకోలేక " నోటికి గుప్పిళ్ళు అడ్డం పెట్టుకుని మౌనంగా ఏడ్చింది సువర్చల.

"బాధపడకు అత్తయ్యా. జయకేం కాదు. కాస్సేపట్లో కళ్లుతెరుస్తుంది."

"కాదు నాయనా-నాకేదో భయంగావుంది, కదలకుండా జయ అలాపడుకొనివుంటే నేను చూడలేను ఏమైందో, డాక్టర్ని ఓమారు తీసుకురా."

"ఏం అవసరంలేదు."

"అలా అనకు-నేను ఎందుకు చెప్పానో వెళ్లు ఊ."

"సరే అయితే"—

డాక్టరువచ్చి జరిగిందంతా విని, జయని పరీక్షించి, ఇంజక్షను ఇచ్చి, రియాక్షను ఎలా వుంటుందో అని కాస్సేపు అక్కడే కూచున్నాడు.

ఒంటినిండా పైట కప్పుకొని గడప అవతల నిలబడ్డ సువర్చల "ఏమండీ-ఎలా వుంది. అమ్మాయికి?" అంటూ అడిగింది గద్గద స్వరంతో.

"ఏం ఫర్వాలేదండి-కొంచెంసేపట్లో కళ్ళు తెరుస్తుంది. కొంచెం బలాన్నిచ్చే పాలూ హార్లిక్సులాంటివి ఇవ్వండి. కొన్నాళ్ళదాకా అయిష్టం అయిన మాటలు మాత్రం అమ్మాయి దగ్గర అనకండి."

"ఏం అనంలెండి" అంటూ సువర్చల తరపున కిరీటి హామీ ఇచ్చాడు.

"అమ్మాయికి ఇంతక్రితం ఎప్పుడేనా ఇలా వచ్చిందా?"

"లేదండి" అంది సువర్చల.

"పోనీ నెర్వస్‌గా వుండేదా?" అన్నాడు డాక్టరు.

అంటే ఏవిటో అర్థంకాలేదు సువర్చలకి.

"ఏమాత్రం మాట అన్నా పడకపోవడం, ప్రతి చిన్న విషయానికీ వుద్రేకం కోపంతెచ్చుకోవడం, ఆవేశాన్ని ఆపుకోలేకపోవడం "

"ఆ...అందుకేం లోటు లేదు" అన్నాడు కిరీటి పాతవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటూ.

"అయితే కొన్నాళ్లు ఆవేశంకానీ కోపంకానీ రాకుండా చూడండి అమ్మాయికి"

ఇంతలో జయ నీరసంగా కళ్లుతెరిచింది.

సువర్చల కళ్ళల్లో నీళ్లు నిలిచాయి.

''సాయంత్రం మళ్లీ వస్తాను'' అంటూ డాక్టరు వెళ్ళిపోయాడు, జయని ఇంకో మారు పరీక్షించి తృప్తిగా తలపంకిస్తూ —

జయకి వైద్యం జాగ్రత్తగానే చేయిస్తున్నారు. డాక్టరు చెప్పిన ప్రకారం మందులు వాడుతూనే వున్నారు మనస్సుకి నొప్పికలిగించే ప్రస్తావన తేవడంలేదు. అన్ని విధాలా జయకి ఆరోగ్యం చేకూరడానికే ప్రయత్నం చేస్తున్నారు కిరీటి సువర్చలాను.

కాని అదే చేకూరడంలేదు.

రోజు రోజుకీ నీరసపడుతోంది కాని బలం ఏర్పడడంలేదు.

రెండేసి రోజులకోమారు పిచ్చిగా అరిచి స్పృహతప్పి పడిపోవడం, డాక్టరువచ్చి ఇంజక్షన్ ఇచ్చాక కళ్లు తెరిచి చూడడం. చూసినా ఎవరితోనూ మాట్లాడకపోవడం. కిరీటినీ, సువర్చలనీ కొత్తవాళ్ళనీ, పరాయివాళ్లనీ చూసినట్లు చూడడం.

వారాలు నెలలు గడుస్తున్నాయి.

కాని రోగం మళ్లు ముఖంపట్టలేదు.

సువర్చల తప్పుచేసిన దానిలా లోపల్లోపల కుమిలి ఏడుస్తోంది.

కిరీటికి ఏం చెయ్యడానికీ పాలుపోవడంలేదు.

అత్తయ్య వేదనని చూడలేకపోతున్నాడు.

జయ మామూలు ఆరోగ్యవంతురాలు కావడం ఎలా?

ఈ డాక్టరువల్ల నయంకాదా?

ఆలోచిస్తూ జయ మంచం దగ్గర కూర్చున్న కిరీటిని పూట పూటా 'అన్నానికి లేవమ'ని సువర్చల హెచ్చరించవలసి వస్తోంది. కిరీటి నాలుగు మెతుకులేనా నోట్లో వేసుకుంటున్నాడు. సువర్చల నోటికి అసలు అన్నమే పోవడంలేదు.

ఓరోజున జయ మంచందగ్గర కిరీటి ఒక్కడే కూర్చుని వున్నాడు. పనులన్నీ పూర్తిచేసుకొని సువర్చల పెరట్లో పారిజాతం దగ్గర కూర్చుంది. వీలు చిక్కినప్పుడూ మనస్సు బాగుండనప్పుడూ అలా కూచోడం ఆమెకి అలవాటు దెబ్బతిన్న తన జీవితానికీ, పోగొట్టుకొన్న ఆనందానికీ, ప్రాణం విలవిల్లాడిపోతూంటే, పదిహేను పద్దెనిమిదేళ్ళక్రితం, తన మనస్సులో ఏ మూలోవున్న ఆశకి ప్రతీకగా నాటిన పారిజాతం అది. అది ఏపుగా పెరుగుతూంటే, పరిమళాలతో నిండిన పువ్వుల్ని అది తెల్లారేటప్పటికి వాకిటనిండా పరుస్తూవుంటే, ఎప్పటికేనా తన జీవితం కూడా అలా పారిజాత పరిమళాలతో నిండుతుంది అనే ఆశ మనస్సులో మారాకు వేస్తూవుంటుంది. గతస్మృతుల్ని తలుచుకుంటూ గాలికి ఊగుతూన్న పారిజాతాన్ని వింతగా చూస్తూ పరధ్యాన్నంగా కూర్చుంది సువర్చల.

జయకి సమీపంలో కూర్చున్న కిరీటి మనస్సులో ఏవో ఆలోచనలు. ఏవేవో జ్ఞాపకాలు.

జయ తనని ఈసడిస్తుంది కాని మాధురి ఇలాకాదు. తనంటే ఎంతో అభిమానం అప్యాయతాను. మధ్య మధ్య ఏదో చిలిపిగా వేళాకోళంచేసినా ఎప్పుడూ ఇలా అవమాన పరచలేదు. శేఖర్ వీర్రాజూ కలిసి తనని ఏడిపించబోయి నప్పుడల్లా అడ్డుకొని తన తరపున నిలబడేది. తనంటే ప్రాణంగా వుండేది కనకే తనకి కూడా మాధురి అంటే అదోరకమైన ఇష్టం. అలాంటిది ఆరోజున, ఆఖరి పరీక్షరాసిన రోజున అలా ఎందుకు ప్రవర్తించింది? నౌకర్ల చేత తనని బయటకి గెంటించి తలుపువేయించింది? తనని ఎందుకలా అవమాన పరచాలి? తనేం చేశాడని? ఆ జగత్పతిరావుగారు మాత్రం? పనిమాలా యూనివర్సిటీకివచ్చి తనని ఇంటికి రావలసిందని ప్రొఫెసర్‌గారి ద్వారా కబురుచేసిన పెద్ద మనిషి, తీరా ఇంటికివస్తే, కాలుస్తాను అంటూ గన్ తీస్తాడా? ఏమిటీ అన్యాయం, అర్థం లేనికోపమూను? తండ్రీ కూతురు కలిసి తనలా అకారణంగా అవమానపర్చడందేనికి? అవున్లే మంచివాళ్ళంటే ప్రతిమనిషికీ లోకువే-గడుసుదనంలేని వాళ్లంటే మరీను. శేఖర్‌ని ఇలా అవమానపరచమను చూద్దాం. గట్టిగా జవాబుచెప్తాడు. అయినా వాళ్ళననవలసిన పనేం వుందిలే. తక్కువగా కనిపించిన వాడినల్లా తొక్కిపడేసే లోకం ఇది. అలా కనిపించడం తనదే తప్పు. జయ అంది కాని నిజంగా తను బుద్ధావతారమే! అందుకే జగత్పతిరావుగారూ మాధురీ తనని అవమానించారు. ఆయనసరే-పిచ్చివాడు. ఎప్పుడెలా వుంటాడో తెలియదు. ఆగ్రహం వచ్చినా అనుగ్రహం వచ్చినా పట్టలేం మాధురి ఎందుకలా అయింది చెప్మా?...వాళ్లిద్దరి మీదా కోపంతో మనస్సంతా వికలం అయిపోయి ఆరోజున రెండురోజులు వుండరా అని శేఖర్ ఎంత బతిమాలుతున్నా వినకుండా తను బయల్దేరి వచ్చేశాడు. శేఖర్ ఏమనుకున్నాడో ఏమో-పాపం వాడీమధ్యన ఎందుకో మరీడల్‌గా తయారయ్యాడు. పరీక్షలు ఎలారాశాడో-శలవలకి ఇంటికి వెళ్ళాడో అక్కడే ఉన్నాడో! ఒక్కమాటు వెళ్లి వాడినిచూస్తే బాగుణ్ణు. తన బాగుకోరినవాడూ, మనస్ఫూ తనని అభిమానించేవాడూ అతనొక్కడే-ఒకమాటు ఎలాగేనా శేఖర్‌ని చూస్తే బాగుండును.

ఇలా ఆలోచిస్తూ యధాలాపంగా తల తిప్పి జయకేసి చూశాడు కిరీటి.

ఎప్పుడు తెరిచిందో జయ కళ్లుతెరిచింది.

ఎప్పటినుంచి చూస్తోందో ఏమో తనవేపే గుడ్లప్పగించి చూస్తోంది.

కిరీటి కంగారుగా ఆలోచనలోంచి తేరుకొని "ఏంకావాలి జయా? పళ్లరసం తీసుకురానా? తాగుతావా?" అన్నాడు. ఆ కంఠంలో జాలితప్ప మరేభావంలేదు. జయ అతనికేసి అలాగే పరిశీలనగా చూస్తోంది. ఈ నెల్లాళ్ళనుంచీ తనకి ఎంతో సేవచేస్తు న్నాడు. ఒక్కక్షణం వదలడంలేదు. తనంటే ఎందుకింత ఆప్యాయత? నిజానికి తనంటే అసహ్యం, కోపంవుండాలి. అలాంటిది ఏమిటిది?

"ఎందుకు నీకీశ్రమ?" అంది జయ నీరసంగా.

"శ్రమేమిటి?"

''నేనంటే నీకు కోపంగాలేదూ?''

''ఎందుకు?''

పెసరపప్పు, గంగిరెద్దు, బుద్ధావతారం అంటూ ఈసడించుకొన్నందుకు-అని అందాం అనుకొంది జయ, కాని నిష్కల్మషం అయిన కిరీటి మొహం చూస్తే మళ్ళీ ఆమాటలు అని, అతని మనస్సు నొప్పించలేకపోయింది. ఒక్కమాటు తనలోతను నిట్టూర్చి నీరసంగా మూలిగింది.

''ఏం బాధగా వుందా?''

ఆ కంఠంలో ఎంత ఆప్యాయత!

''డాక్టరు గారిని తీసుకురానా?

వెఱ్ఱివాడా డాక్టరేం తీసెయ్యగలడు నాబాధ?

''ఎలావుంది జయా?''

ఎందుకింత అభిమానం నేనంటే.

''ఏవిటలా చూస్తావు? ఏం కావాలి?''

ఏంకావలిస్తే మాత్రం నీవల్లేం అవుతుంది?

''మందు తాగుతావా? రసం ఇవ్వనా?'.

నీ మనస్సులో ఇంత ప్రేమ వుందా బావా నేనంటే.

''చెప్పు జయా.''

ఏం చెప్పమంటావు? నీ అభిమానం చూస్తూంటే నాకు ఏడుపువస్తోంది.

''నాతో మాట్లాడవా?''

నీలాంటి మంచివాడిని ప్రేమించగలిగితే ఎంత బాగుండును! నన్నింత ఆత్మీయతతో చూసే మనిషిని నేను అనురాగంతో చూడలేకపోవడం నా దురదృష్టం.

''కోపమా నేనంటే?''

అయ్యో పిచ్చిబావా!

జయ కంటి చివరలనుంచి కారిన కన్నీటిని చూసి కిరీటి కంగారుగా, పైమీదవున్న తువ్వాలుతో ఒత్తి ''ఛ ఏవిటిది? .డాక్టరుగారు ఏమన్నారో తెలుసా? ఇలా బాధ పడుతూవుంటే ఆరోగ్యం చప్పుని కుదుటపడదన్నారు?' అన్నాడు.

జయ నీరసంగా నవ్వింది. ఆ నవ్వులో ప్రాణంలేదు.

''నాలుగు రోజులు అలా నవ్వుతూ వున్నావంటే ఎక్కడి జబ్బు అక్కడికి పోతుంది.''

నీరసంగావున్న జయ కళ్ళు ఒక్కమారు మెరిశాయి. ముఖంలోకి ఒక కొత్త వుత్సాహాన్ని తెచ్చుకొని నవ్వుతూ, ''ఊ....జబ్బు నయం అయితే. .'' అంది.

''నయం అయితే ''

"నన్ను పెళ్ళిచేసుకోవచ్చు నువ్వు. అవునా?" కొంటెగా చూస్తూ అంది జయ.

కిరీటి తొట్రుపడి "అబ్బెబ్బె ఉహుఁ అదేంకాదు ..." అన్నాడు.

"నాకీ పెళ్ళి ఇష్టంలేదు అన్నాననేకదా నీకూ కోపంవచ్చింది?"

"అబ్బే నాకేం కోపంరాలేదు."

"నిజంగా?"

"ఒట్టు జయా నామాట నమ్ము. అత్తయ్య బాధపడింది కాని నేనేం అది మనస్సులో పెట్టుకోలేదు."

"అయితే నిన్ను నేను పెళ్లిచేసుకోపోతే నువ్వేం బాధపడవు. అవునా!"

"కాని అత్తయ్య "

"మనిద్దరికీ ఇష్టంలేనప్పుడు అత్తయ్యేంచేస్తుంది?"

కిరీటి ఏం మాట్లాడలేదు.

"ఊఁ సరే .మనపెళ్ళి నాకిష్టంలేదు. నన్నే పెళ్ళిచేసుకోవాలని నీకూ పట్టుదల లేదు. ఇంక సమస్యేం వుంది? మనిద్దరం కలిసి పిన్నికి చెప్పేస్తేసరి."

"హమ్మా."

జయకి ఈమారు నిజంగా నవ్వువచ్చింది.

"ఎంత పిరికివాడివి బావా నువ్వు? పిన్నికి కోపంవస్తుందని, ఇష్టంలేకపోయినా నన్ను పెళ్ళిచేసుకోడానికి సిద్ధపడతావా?"

"అదికాదు జయా!"

"నీకేం తెలియదు. నువ్వలా ఊరుకో. నీ మనస్సులోవున్న అభిప్రాయం ఇప్పుడు చెప్పావు కదా! ఇన్నాళ్ళూ నువ్వుకూడా పిన్నితోపాటే అనుకుని ఇద్దరి మీదా ఒలే కోపంగా వుంటూవచ్చిందినాకు. ఇంక నువ్వు నా పార్టీ అయిపోయావు. నాకేం భయంలేదు. పిన్నిని ఎలా ఒప్పించాలో నేను చూసుకుంటాను "

"అత్తయ్య ఒప్పుకుంటే సరే " అన్నాడు కిరీటి గోళ్లు చూసుకుంటూ.

"పిచ్చిబావా!" అంటూ జాలిగా కిరీటి తలమీద చెయ్యివేసి చిలిపిగా అతవిక్రాపు చెరిపేసింది. జయ తనజుట్టు అలా చిందరవందరచేస్తూంటే, తల దువ్వించుకోవడం కోసం తల్లిచేతికి జుట్టు ఇచ్చి కదలకుండా కూచున్న మంచిపిల్లవాడిలాగ ఆ మట్టునే కూర్చున్నాడు కిరీటి. అతని తలనిమురుతూన్న జయకి వళ్ళంతా ఒక్కమారు పులకించింది. "కిరీటి బావ ఎంతమంచివాడు! ఇలాంటివాడి నా పెళ్లిచెసుకోనని తను తృణీకరిస్తున్నది!"—జయ మనస్సులో కల్లోలం రేగింది. నిజానికి బావలాంటి దేవుడు తనకి దొరకడు. పిన్నిచెప్పింది నిజమే-కాని తనకి ఏమిటో అతనంటే మనస్సు పోవడం లేదు. చలాకీగా చురుగ్గావుండే గడుసువాడు భర్త అయితే ఆనందంకాని ఇలా మెత్తగా అడదానికంటే సున్నితం అయిన హృదయం వున్నవాడు మొగుడేవిటి?

జయ కళ్ళుమూసుకొని ఆలోచిస్తోంది

ఆమె చేతివేళ్ళు ఇంకా కిరీటి జుట్టుతోనే ఆడుకుంటున్నాయి.

అయిదారేళ్ల పెద్దవాడైన కిరీటి, అయిదేళ్ల పసివాడిలాగ, జయచేతికి జుట్టు ఇచ్చి ఆమె మంచం పక్కనున్న స్టూలుమీద ఒదిగి కూర్చున్నాడు.

ఇలా జయా కిరీటి ఎవరిలోకంలో వాళ్ళున్న సమయంలో, సువర్చల అక్కడికి వచ్చి ఆ దృశ్యం చూసి, సంభ్రమాశ్చర్యాలతో తొట్రుపడి "హమ్మయ్య ఈ సమస్య ఇలా తీరింది. ఇంక జయకి ఆరోగ్యం కుదుటపడితే ముహూర్తం పెట్టించెయ్యొచ్చు" అనుకుంది. సంతోషంవల్ల చెమర్చిన కళ్ళని ఒత్తుకుంటూ, పక్కగదిలోవున్న వెంకటేశ్వరస్వామి ఫొటో దగ్గిరికి వెళ్ళింది,మనస్సా ఆ దేవదేవుడికి నమస్కారం చెయ్యడం కోసం.

ఆరోజు జయకి కొద్దిగా అన్నం సహించింది.

రాత్రి నిద్దరాపట్టింది.

రోజూలాగ నరాలు వణికి స్పృహ కోల్పోలేదు.

డాక్టరు కూడా "ఫరవాలేదు. త్వరలో పూర్తి ఆరోగ్యం చేకూరుతుంది" అన్నాడు.

మబ్బువిడి ఆకాశం నిర్మలంగా మారుతూన్న సంతోషంలో మర్నాడు "కిరీటీ— ఇంక నాకు బెంగతీరిపోయింది. నీచేత జయకి ఆ మూడుముళ్ళూ వేయించేస్తినా ఇంక నేను కృష్ణా రామా అనుకుంటూ ఎక్కడున్నా ఎలా వున్నా ఫరవాలేదు."అంది సువర్చల.

ఆ మాటవిని గతుక్కుమన్నాడు కిరీటి.

పక్కమీదవున్న జయ వులిక్కిపడింది. భయంతో ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. "పిన్ని పట్టుదల ఇంకా అలాగే వుంది, ఎలాగ ఒప్పించడం? కిరీటి తనతో సహకరిస్తాడా? ధైర్యంగా పక్కని నిలబడతాడా?"

ఆలోచనలతో ఆరోజల్లా జయ వేగిపోయింది. మర్నాడు మళ్లీ ఆమె హృదయం, మెదడూ కదిలిపోయాయి.

ఆరోజు జయకి రెండుమాట్లు స్పృహతప్పింది.

"ఇదేమిటి మళ్ళీ ఇలా చేశావు భగవంతుడా!" అంటూ సువర్చల దేవుని పటం ఎదురుగుండా కన్నీళ్లు పెట్టుకుంది.

కిరీటి జయ పక్కవదలకుండా కూర్చున్నాడు.

"నిన్న బాగానేవుంది—అలాంటిది మళ్ళీ మార్పువచ్చి ఇవాళ ఎందుకయింది అర్థంకావడంలేదు. పోనీ ఏ న్యూరాలజీ స్పెషలిస్టుకేనా ఓమారు చూపించండి" అన్నాడు డాక్టరు, సాలోచనగా వేళ్ళతో గెడ్డాన్ని నిమురుకుంటూ.

తెలివివచ్చి నప్పుడు, పక్కనున్న కిరీటినిచూపి నీరసంగా "ఇంతక్రితం లేదుకాని ఇప్పుడు బతకాలని కోరికగావుంది బావా!" అంది జయ.

కిరీటి ఆ మాటలకి చలించిపోయాడు.

డాక్టరు అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి.

న్యూరాలజీ!

శేఖర్ స్పెషలైజ్ చేసింది అదేకదా!

హైదరాబాదు తీసుకెళ్ళి జయని అతనికి చూపిస్తే! అమాటే అన్నాడు సువర్చలతో-

"నీ ఇష్టం. మళ్ళీ అది మామూలుమనిషి అయితేచాలు" అంటూ సువర్చల కళ్ళు ఒత్తుకుంది.

శేఖర్‌కి టెలిగ్రాం ఇచ్చి హైదరాబాద్‌కి మూడు టిక్కెట్లు కొన్నాడు కిరీటి.

14

"మనం ఇంతప్రయత్నం చేస్తున్నాం కదా ఆయన తప్పకుండా వస్తారంటారా?" అంది మాధురి, బట్లర్‌కీ నౌకర్లకీ గార్డెన్‌లో ఏర్పాటు చెయ్యవలసిన పనులన్నీ పురమాయించివచ్చి గదిలో కుర్చీలో కూర్చుంటూ.

చేతికప్స్ పెట్టుకుని కోటు తొడుక్కోవడంకోసం స్టేండ్ దగ్గరికి వెళుతూన్న వాడల్లా అగి. "షూర్. తప్పకుండా వస్తాడు. ఆ వుత్తరం అందాక రాకుండా వుండడానికి వాడికెన్నిగుండె లుండాలి?" అన్నాడు శేఖర్.

అయినా మాధురి గుండెల్లో అదటుగానేవుంది. 'కిరీటివచ్చి అన్నీ సవ్యంగా జరిగితేనేసరి కాని లేకపోతే హమ్మో ఇంకేమైనావుందా? అతితెలివిగా వేశాం, అనుకొన్న పధకం కాస్తా అయోమయంగా మారి, చివరకి తనమెడకే వురిత్రాడులా చుట్టుకుంటుంది. ఆ తర్వాత శేఖర్ తనూ, ఎంత గింజుకున్నా ఆ ప్రమాదంనుంచి తప్పించుకోలేక, జీవితాంతం పశ్చాత్తాపంతోనూ వేదనతోనూ క్రుంగిపోవలసివస్తుంది. ఏమో ఏం జరగనుందో!'—పైన సీలింగ్‌ఫేన్ తిరుగుతున్నా మాధురి నుదురంతా చెమట పట్టేసింది.

ఆ సమయంలో చేతికర్రసాయంతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ జగత్పతిరావు ఆ గదిలోకి వచ్చాడు. వచ్చి, చేతులు వెనక్కివంచి కోటుని అతిప్రయాసమీద తొడుక్కుంటూన్న శేఖర్‌నిచూసి వెంటనే మాధురికేసి ప్రశ్నార్థకంగా చూశాడు అతని చూపులో అర్థాన్ని అర్థంచేసుకొని మొహం అటువైపు తిప్పింది మాధురి.

తను వీధిలోకివెళ్లబోయేముందు, చేతిలో ఎంతపనివున్నా వదిలేసివచ్చి చొక్కా బొత్తాలు సర్ది కండువా చేతికిచ్చి కళ్ళనిండా నవ్వుతూ మరీ పంపించేది తన డార్లింగ్. పాతజ్ఞాపకాలు గుండెల్లో మెదిలేసరికి జగత్పతిరావుకి మనస్సంతా వికలం అయిపోయింది.

దీర్ఘంగా నిట్టూర్చి "ఆరోజులే వేరు ఈరోజులే వేరు" అన్నాడు.

ఆ మాటలు జగత్పతిరావు ఏ సందర్భంలో అన్నవో అర్థంకాక "దేనిగురించి మీరంటున్నది?" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

వెంటనే జగత్పతిరావు సర్దుకొని "అబ్బే-ఆహః మరేం లేదు. నువ్వు కోటు తొడుక్కోడానికి ప్రయాసపడుతూంటే అమ్మాయి చూస్తూ కూచుందికాని కాస్తంతయినా సాయం చెయ్యడంలేదు. స్నానానికి వెళ్ళేటప్పుడు టవల్ అందించడం. కాఫీ తనచేత్తో ఇవ్వడం, నువ్వు హాస్పిటల్‌నుంచి వచ్చేసరికి నీ చేతిలో స్టైత్ అందుకోవడం వగైరా లేవీ చేస్తూన్నట్లు నాకేవీ అనిపించడంలేదు" అన్నాడు నవ్వుతూ.

శేఖర్ ఇబ్బందిగా మాధురికేసి చూశాడు.

జగత్పతిరావు కూడా అటే చూశాడు.

ఆమె ముఖం చిట్లించి ఇంకోవైపు చూసింది. మాధురి మాట్లాడకపోవడంతో తనే మాట్లాడవలసి వచ్చింది శేఖర్‌కి. నీరసంగానవ్వి "ఇప్పుడవన్నీ ఎందుకండీ?" అన్నాడు.

"అదేవిటయ్యాః కాబోయే భార్యా భర్తల మధ్య ఆప్యాయతలు ఎలా పెరుగుతాయి? ఇలాంటి చిన్న చిన్న పనులవల్లే-నువ్వుకూడా అలా దూరందూరంగా వుంటున్నావు కాని అమ్మాయితో సరదాగా చనువుగా వుంటున్నట్టులేదు."

"ఈ సాయాలూ సేవలూ బీదవాళ్ళకీ, మధ్య తరగతి వాళ్ళకీ కాని మనకేవిటండీః కాఫీ మాధురే ఇవ్వాలని ఏంవుంది-బట్లర్ ఇస్తాడు. అలాగే స్నానానికి కావలసిన ఏర్పాటులన్నీ నౌఖర్ చేస్తాడు" అన్నాడు శేఖర్ అద్దంలో చూసుకొని తలదువ్వుకుంటూ.

"నౌఖర్లుంటే మాత్రం? నీకు కావలసిన సౌకర్యాలన్నీ తను చూసుకోవడంలో వున్న ఆనందం ఎంతమంది నౌఖర్ల చేత చేయిస్తే వస్తుంది? మీ అత్తగారు ఒక్కక్షణం ఏమరిపడేదా? నాకు కావలసిన సమస్త సౌకర్యాలూ స్వయంగా తనే చూసుకొనేది " ఇలా అంటూ వెంటనే ఆగి, కంగారుగా "అయినా ఆరోజులు వేరూ ఈ రోజులు వేరూలే" అన్నాడు జగత్పతిరావు లేస్తూ, మనస్సులోంచి వువ్వెత్తుగాలేచిన ఆవేదనని కనపడనీయకుండా—

"ఇవన్నీ చూసుకోడానికి మాధురికి ఎక్కడ వీలవుతుందండీ-తనుకూడా హౌస్ సర్జను చేస్తోందాయె" అన్నాడు శేఖర్ మాధురిని సమర్థిస్తూ.

"నువ్వేంచెప్పు . మీరిద్దరూ ఏ కోశానా కాబోయే భార్యా భర్తలుగా వుండడం లేదు. మరిద్దరికీ సిగ్గో, మొహమాటమో అర్థంకావడంలేదు. ఓ షైల్లా షికార్లా సినీమాలా కబుర్లా కేరింతలా ఎలా వుండాలని? పరాయివాళ్ళయిన యువతీ యువకులే ఇంతకంటే చనువుగా వుంటున్నారు ఈ రోజుల్లో."

"అబ్బెబ్బె, మేమూ చనువుగానే వుంటున్నాం అండీ ...కానయితే పెద్దవారు— మీ ఎదురుగుండా అలా వుండాలంటే . ." అంటూ నీళ్ళు నమిలాడు శేఖర్.

"సరే . సరే. . అందువల్లా? .అయితే సరే నేనేమో వీళ్ళేవిటా ఇలా వుంటున్నారని అనుమానపడ్డాను." అంటూ అనుమానంగా మాధురికేసి చూశాడు జగ

త్పతిరావు. జగత్పతిరావుకి అనుమానం తగలకుండా వుండడంకోసం "మాధురీ!" అంటూ ఆప్యాయంగా పిల్చాడు శేఖర్. అతని కంఠం కొత్తగా వినిపించడంతో చిరాకువేసి కోపంగా చూసింది మాధురి.

"నా కూలింగ్ గ్లాసెస్ ఇలా ఇయ్యి" అన్నాడు శేఖర్ అధికార స్వరంతో.

పట్టలేని ఆగ్రహంతో కొరకొరా చూసింది మాధురి.

కళ్ళతో సంజ్ఞ చేశాడు శేఖర్. మనం నటించాలన్న సంగతి మరిచిపోయావా అనే అర్థం వచ్చేలాగ.

విసుగ్గా లేచి వెళ్ళి, గాగుల్స్ తీసుకువచ్చి ఇచ్చింది.

అదిచూచి సంతృప్తిగా నవ్వుకుంటూ "నువ్వు అలా వీధిలోకి వెళ్తున్నట్లున్నావు. చప్పున వచ్చెయ్యి. మళ్ళీ గెస్టులు వచ్చే వేళయింది. ఏర్పాట్లన్నీ అయినట్లేనా!" అంటూ ఇంటికి వెనకవున్న గార్డెన్ వైపు నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళాడు జగత్పతిరావు.

తండ్రిని పూర్తిగా వెళ్ళనిచ్చి, శేఖర్‌వైపు కోపంగా తిరిగి "మీరు అతి సహజంగా నటిస్తారే! పొరబాటున మీరు, నిజంగా ఈ ఇంటికి అల్లుడనుకుంటున్నారేవిటి?" అంది మాధురి, హేళనగా—"నటిస్తే సహజంగానే నటించాలి మరి. లేకపోతే అదిగో ఆయనకి అలాగే అనుమానం వస్తుంది" అన్నాడు శేఖర్ నవ్వుతూ. "ఆయన అనుమానం మాట ఎలా ఉన్నా మీకు ఆనందంగా వున్నట్టుంది అలా వుండడం-" ఆ మాటలోని తీవ్రతకి గతుక్కుమని, "నాకు ఆనందమా?...హుం!! ..నటనలో ఎవరికేనా ఆనందం వుంటుందా?" అన్నాడు శేఖర్ విషాదంగా.

"మీరలా అనుకోవడం లేదుగా? నిజం అని భ్రమిస్తున్నారు."

"పొరబాటు. నేనలా ఎక్కడ భ్రమిస్తానో అని నువ్వు అడుగడుగునా నాకు తీవ్రంగా జ్ఞాపకం చేస్తూనే వున్నావు. నేను కూడా జాగ్రత్తగా నా హద్దుల్లోనే వుంటున్నాను. కాని ఆయన ఎదురుగుండా ఇలా దొరికిపోయినప్పుడు మాత్రం కాస్త అతిగా ప్రవర్తించవలసివస్తోంది. అలా ప్రవర్తించకపోతే ఆయనకి అనుమానం వస్తుంది. ప్రవర్తిస్తే నీకు కోపం వస్తుంది. ఎలా? మధ్యన నా ఇబ్బందిని కూడా నువ్వు సానుభూతితో అర్థం చేసుకోవాలి." అన్నాడు శేఖర్ బాధగా ముఖంపెట్టి. మాధురి గతుక్కుమంది. శేఖర్‌కి నొప్పి కలిగిందా?

"నిజమే—ఆ రోజున తను అంతగా ప్రాధేయపడడం వల్లే శేఖర్ తనతో సహకరించడానికి అంగీకరించాడు. పైపెచ్చు రూమ్‌లోంచి కూడా మకాం మార్చేసి డాడీని నమ్మించడంకోసం ఇక్కడికి వచ్చేశాడు. డాడీ చూస్తున్నప్పుడు చనువుగా వుంటున్నాడు కానీ, తక్కిన సమయాల్లో దూరదూరంగానే వుంటూ తనకేం బాధ కలిగించడం లేదు. కాని ఎప్పుడో ఒకప్పుడు అతనిలా అతిసహజంగా, ఆప్యాయంగా ప్రవర్తిం

చడం. తనకి చిరాకు కలగడం, జరుగుతోంది. నటించి నటించి చివరకి ఇతనికి తన మీద అధికారం, అభిమానం సహజం అయిపోవు కదా అనే భయంకూడా కలుగుతోంది. ఏమైనా ఇది ప్రమాదకరమైన నాటకమే! ఇందులోంచి ఎలాగో అలాగ బైటపడాలి. ఇదిగో-ఇవాళ్టి గార్డెన్ పార్టీ కనుక అనుకున్న ప్రకారం విజయవంతం అయితే కొంచెం ఈ చిక్కుల్లోంచి తప్పుకోవచ్చు'' ఇలా ఆలోచిస్తూ వుండిపోయింది మాధురి.

''నేనలా భర్తలా అధికారంతో ఆజ్ఞాపించి నందుకు కోపం వచ్చిందా?'' శేఖర్ కంఠం పశ్చాత్తాపంతో వణికింది.

ఆ కంఠం విని మాధురి అదిరిపడింది. ఏవిటీ? శేఖర్ బాధపడుతున్నాడా? తను తొందరడి అతని మనస్సు గాయపరచిందా? ఆ రోజున తన కన్నీళ్ళు చూడలేక, డాడీకి తిరిగి ఆరోగ్యం కుదుటపడడంకోసం, అతను తనకి సహాయం చెయ్యబోతే, అతనికి తను చూపిస్తున్న కృతజ్ఞత ఇదా? మాధురి హృదయం కొట్టుమిట్టాడింది.

మాధురి సమాధానం చెప్పకుండా నిలబడి వుండడంతో "సారీ-నేను అతిగా ప్రవర్తిస్తే క్షమించు'' అంటూ బరువుగా అడుగులువేసుకుంటూ అక్కడినుంచి కదిలాడు శేఖర్.

''శేఖర్!''

మాధురి కళ్లల్లో కన్నీళ్ళు-ఇబ్బందిగా గుటకవేసి కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ బైటికి వెళ్ళిపోయాడు శేఖర్-ఇద్దరికీ ఇష్టంలేని ఇబ్బంది అయిన ఈ నాటకం ఇంకా ఎన్నాళ్ళు భగవాన్!

బిల్డింగ్‌కి వెనక విశాలంగావున్న గార్డెన్‌లో మాంచి సందడిగావుంది. గార్డెన్ నిండా అక్కడక్కడ గుండ్రని టేబిల్సు. వాటిచుట్టూ నాలుగేసి అయిదేసి కుర్చీలూ అమర్చబడ్డాయి. ప్రతి టేబిల్‌మీదా తెల్లనిక్లాత్, టీపాట్, పింగాణీ ప్లేట్లు కప్పు సాసర్లు చెంచాలూ వున్నాయి. ఓమూల వుంచిన కేసెట్‌లోంచి 'పాప్' సంగీతం సన్నగా వినిపిస్తూ ఆ ప్రదేశాన్నంతా మత్తుగా వుత్తేజంగా మారుస్తోంది. అందమైన రంగురంగుల దుస్తులు ధరించి రకరకాల వయస్సులోవున్న పై అంతస్థు మనుష్యులు నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరేసీ ముగ్గురేసీ చొప్పున రాసాగారు. తన ఈడువాళ్ళ నందర్నీ జగత్పతిరావు చిరునవ్వుతో ఆహ్వానించి కుర్చీల్లో కూర్చోపెడుతుంటే, పాతికా ఇరవై వయస్సులోవున్న అతిధుల్ని షేక్‌హేండ్ ఇస్తూ పలకరించి స్వాగతం చెబుతోంది. మాధురి వస్తూన్న గెస్ట్‌ల్ని యాంత్రికంగా మర్యాదచేస్తోంది కాని ఆమె మనస్సు ఎక్కడో వుంది కళ్ళు ఎవరికోసమో ఎదురుచూస్తున్నాయి.

జగత్పతిరావు వయస్సులోవున్న అతిధులంతా ''ఇది జగత్పతిరావు కూతురికి పెళ్ళి నిశ్చయం కాబోతూన్న సందర్భంలో ఇచ్చే ఎంగేజ్‌మెంట్ పార్టీ'' అని చెప్పుకుంటున్నారు.

మాధురి ఫ్రెండ్స్ అందరూ "ఎమ్. బి. బి. యస్. పేసయిన సందర్భంలో ఈ పార్టీ మాధురి ఇస్తోంది" అనుకుంటున్నారు.

శేఖర్ ఆహ్వానాన్ని అందుకుని వచ్చిన స్నేహితులు మాత్రం "న్యూ రాల జీ ఎమ్ డి. తో బాటు ఉద్యోగం కూడా వచ్చినందుకు శేఖర్ ఇస్తూన్న అల్పాహార విందు ఇది." అంటూ అంచనా వేయసాగారు.

ఇలా ఎవరికి తోచినట్లు వాళ్లు అనుకుంటూ కబుర్ల తో కేరింతాలతో నవ్వులతో పువ్వులతోటలో తుమ్మెదల్లాగా సీతాకోక చిలుకల్లాగా గుంపులు గుంపులుగా టేబిల్స్ చుట్టూ జేరుతూ సందడిగావుంటే, మాధురి మాత్రం ఈ పార్టీ ఎందుకు ఏర్పాటుచేసిందీ ఎవరికీ చెప్పకుండా మాటి మాటికీ టైమ్ చూసుకుంటోంది.

కిరీటి ఇంకా రాలేదు.

వీధిలోకి వెళ్ళిన శేఖరూ రాలేదు.

తెల్లటి దుస్తులు ధరించిన సర్వర్లు కాఫీ ఫలహారాల్ని టేబిల్స్ దగ్గరికి చేరుస్తున్నారు. వచ్చిన అతిధుల కబుర్లతోటీ నవ్వులతోటీ, గార్డెన్ అంతా కోలాహలంగా వుంది. రకరకాల ఆ శబ్దాల నన్నింటినీ మింగేస్తూ పాప్ సంగీతం, తారస్థాయిని చేరుకుంటోంది.

కిరీటి వస్తూన్న జాడలేదు.

అతణ్ణి తీసుకురావడానికని వెళ్ళిన శేఖరూ రాలేదు. మాధురి ఏక కంగారు పడుతోంది.

"ఏమిటమ్మా. ఇంకా ఏవిటి ఆలశ్యం?" అన్నాడు జగత్పతిరావు మాధురి దగ్గరికి నెమ్మదిగా నడిచివచ్చి "ఇంకా కిరీటి రాలేదు" అంది మాధురి పరధ్యానంగా ఆలోచిస్తూ.

"ఏ కిరీటి' ఆ స్కౌండ్రలా? ఎవరు పిలిచారతణ్ణి?" జగత్పతిరావు రుద్రుడై పోయాడు.

వెంటనే మాధురి తన పొరబాటుని గ్రహించింది. అనుకోకుండా అతనిమాట అనేసింది. అందువల్ల తడబడుతూ .."కిరీటికాదు డాడీ! శేఖర్-శేఖర్ అనబోయి కిరీటి అన్నాను. అంతే!" అంది. కూతురుకేసి చూశాడు. ఆమె తలదించేసుకుంది. జగత్పతిరావుకి జాలేసింది. ఆ కిరీటిని ఎంత మరిచిపోలేకపోతుంది! పాపం మనస్పూ ప్రేమించింది కాబోలు, ఆ దుర్మార్గుడు అలా చేశాడు. లేకపోతే నిజమే-ఈ శేఖర్ స్థానంలో అతడుండేవాడు.

దగ్గరగావచ్చి తలనిమిరి "ఆ కిరీటిని ఇంకమరిచి పో తల్లీ!" అన్నాడు లాలనగా.

"నేను మరిచిపోవాలనే ప్రయత్నిస్తున్నాను."

"కాని మరిచిపోలేకపోతున్నావు. అవునా? పిచ్చితల్లీ—"

"అయినా మనం అనుకున్నాం కాని కిరీటి అలాంటివాడు కాదు డాడీ!"

"కాకపోవడం ఏవిటమ్మా ఆ పెద్దమనిషి అంత స్పష్టంగా చెప్తేనూ! పైగా అతని చేతుల్తో అతనిచ్చిన పుస్తకం కూడా వుందికదా!"

"అవుననుకో .. కాని. .."

ఇంతలో "నమస్కారం అండీ ప్రొఫెసర్‌గారూ! అరోజు అయిదు నిముషాల పరిచయాన్ని పురస్కరించుకొని మీరు నాకు ఆహ్వానం పంపారంటే, మీ మనస్సు ఎంత వున్నతం అయిందో నాకు అర్థం అయింది. ఏదో, మీ అమ్మాయికి పెళ్ళి నిశ్చయం అయిన సందర్భంలో ఇస్తున్న పార్టీటగా ఇది?" అంటూ గట్టిగా అంటూ ప్రవేశించాడు రవణయ్య.

"ఎవరా ఇతను నన్ను ప్రొఫెసర్ అంటూ పిలుస్తున్నాడు" అంటూ ఆశ్చర్యంగా ఎగా దిగా చూశాడు జగత్పతిరావు. వెంటనే జ్ఞాపకం వచ్చింది. అవును! ఇతని మేన కోడల్నే కాదూ కిరీటి ప్రేమిస్తూన్నది! ఇతనివల్లే కదా తన మాధురి కన్న బంగారు కల లన్నీ బండలైపోయాయి! కోపం, అసహ్యం ఒక్కమాటు కళ్లల్లో కనిపించాయి. ముఖం చిట్లించి "ఇతణ్ణి ఎవరు ఆహ్వానించారు!" అన్నట్లు ప్రశ్నార్థకంగా మాధురివైపు చూశాడు.

మాధురి తలవంచి పక్కకి చూసింది.

వచ్చిన అతిథి, సరే, మర్యాద చెయ్యక తప్పుతుందా అనుకొని, అసహజమైన చిరునవ్వు ఒకటి పెదిమలకి అంటించుకొని "దయచెయ్యండి" అంటూ రవణయ్యని ఆహ్వానించాడు జగత్పతిరావు. గొప్ప గొప్పవాళ్లందరూ వున్న ఆ పార్టీలో పాల్గొనేందుకు తనకి అవకాశం లభించింది కదా అదే సంతోషంతో గాలిలో తేలిపోతూ వెళ్ళాడు, రవణయ్య. ఏ టేబిల్ దగ్గరా ఒక్కకుర్చీ కూడా ఖాళీలేదు. పైగా పరిచయం అయిన ముఖం ఒక్కటీ కనిపించలేదు. దాంతో ఒ మూల ఖాళీగావున్న టేబిల్ దగ్గరికి వెళ్ళి ఒక్కడూ కూర్చున్నాడు.

"గెస్టులువచ్చి చాలాసేపయింది. ఇంకా శేఖర్ రాలేదని మనం ఆలశ్యంచేస్తే బాగుండదు. అతనేవస్తాడు ఈలోగా పార్టీ మొదలుపెడదాం" అంటూ మాధురి సమాధానంకోసం ఆగకుండా, జగత్పతిరావు అతిథుల మధ్యకి వెళ్లిపోయాడు.

మాధురి అక్కడే నిలబడిపోయింది, కిరీటీ శేఖర్‌లకోసం ఎదురుతెన్నులుచూస్తూ.

అందరూ పార్టీ తీసుకోవడం మొదలుపెట్టారు. కబుర్లూ కల్లోలం తగ్గి, పింగాణీ ప్లేట్లకి స్టెయిన్‌లెస్ స్టీలు చెంచాలు తగులుతూన్న 'క్లిక్' 'క్లిక్' ధ్వనులు గజిబిజిగా వినిపించసాగాయి. సర్వర్లు హడావిడిగా తిరుగుతున్నారు. అందరిదగ్గరికీ వెళ్ళి అన్నీ అందుతున్నాయో లేదో కనుక్కుంటున్నాడు జగత్పతిరావు.

వీధిగేటు దగ్గరికి ఒకటి రెండుమార్లు వెళ్లివచ్చింది మాధురి. గంటక్రితమే రైలు వచ్చి వుండాలి. ఇంకా వీళ్ళురాలేదేవిటి? బహుశా రైల్లో కిరీటిరాలేదేమో! ఆ ఆలోచ

నతో మాధురి మనస్సు ఒక్కమాటు దిగాలు పడిపోయింది. భయంవల్ల గుండెలువేగంగా కొట్టుకోసాగాయి. రాకపోతే ఇంకేమైనావుందా? తన ప్లాను అంతా తలకిందులై పోతుంది. అనుకున్న ఫలితం నెరవేరదు. పైగా తనకీ శేఖర్‌కి వివాహం నిశ్చయం చేసినట్లు ఇంతమంది ఎదటా డాడీ ఎంగేజ్‌మెంట్ ఫిక్స్ చేస్తాడు. అది జరిగితే ఇంకేం వుంది? తను శాశ్వతంగా కిరీటికి దూరం అవుతుంది. శేఖర్‌తో కలిసి జీవితాన్ని పంచుకో వలసివస్తుంది. అలా జరక్కూడ దనేకదా, తనూ శేఖరూ ఆలోచించి, పార్టీకి రవణయ్యని రప్పించి, అతని ఎదురుగుండా కిరీటిని ప్రదర్శించి కిరీటి ఇతడు కాదని చెప్పించి. తద్వారా కిరీటి నిర్దోషిత్వాన్ని డాడీకి నిరూపించాలని పెద్దపథకం వేసుకున్నది! ఇప్పుడు కిరీటి రాకపోతే, అతనిపట్ల డాడీకి అనుమానం కోపం వుండిపోవడం అలా వుంచి, తనకి శేఖర్‌తో వివాహం స్థిరపడిపోయే ప్రమాదం ఒకటి ఏర్పడుతుంది

భయంతో మాధురికి ఒళ్ళంతా ఒక్కమారు కంపించింది.

కిరీటి ఎందుకు రాలేదు? తన ఉత్తరంచూసి తప్పకుండా వస్తాడని కదా ఈ టీ పార్టీ ఏర్పాటు చేయించాడు శేఖర్! శేఖర్ అంచనా తప్పు అయిందా? అతని ఉత్తరం కిరీటికి అందలేదా? శేఖర్ అంటున్నాడు కాని నిజంగా ఉత్తరం రాశాడా? రాయకుండా రాశానని తనని మోసంచేశాడా? ఇలా కిరీటిని రప్పిస్తున్నానని అబద్ధంచెప్పి తనచేత పార్టీ ఏర్పాటు చేయిస్తే, డాడీ ఈపార్టీలో తమపెళ్ళి నిశ్చయం చేస్తాడని, అలా అయితే నిరాఘాటంగా తనని వివాహం చేసుకొనే అవకాశం లభిస్తుందనీ శేఖర్ ఎత్తువేశాడా? అందుకేనా, డాడీ మొదట ఈపార్టీ ఎందుకంటే, "ఎందుకేమిటి మీరు తిరిగి వ్యాధినుండి కోలుకొన్నందుకు-లేదా మీ అమ్మాయి ఎమ్ బి బి యస్. పేస్ అయినందుకు, కాదంటారు త్వరలో మీ ఇంట్లో ఒక శుభకార్యం చెయ్యబోతున్నట్లు పదిమందికీ తెలియబరిచేటందుకు-ఎందుకో ఒకందుకు" అంటూ సమాధానం చెప్పాడు! ఆ సమాధానం విన్నాకే డాడీ "అవును తప్పకుండా ఎంగేజిమెంటు ఫిక్సింగ్ పార్టీ చెయ్యవలిసిందే" అంటూ ఉత్సాహం చూపించింది. ఇదంతా ఆలోచిస్తే శేఖర్ ఏదో దుర్బుద్ధితో, వల పన్నినట్లు కనిపిస్తోంది. తెలియకుండా తను అందులో చిక్కుకొంది. నిజమా? నిజంగా తను మోసపోయిందా? కిరీటి రాడా? ఉత్తరం రాశానన్న శేఖర్ మాటలు అబద్ధమే. మాధురికి తలతిరిగినట్లయింది, కళ్ళు చీకట్లు కమ్మాయి తూలి పడబోయి పక్కనున్న టేబిల్‌ని ఆనుకొని నిలబడింది.

వెనక, కబుర్లతో నవ్వులతో కేరింతాలతో కోలాహలంగా ఉన్న వాతావరణం.

ఎదురుగుండా, అనుకొన్న ప్రకారం కిరీటి రాకపోవడంవల్ల నిరాశగా నిస్పృహగా కనిపిస్తూన్న శూన్యత.

అలా హడావిడికీ ఆందోళనకీ మధ్య నిలబడి, ఆశగా కళ్లుతెరిచి చూస్తూ నిముషం ఒక యుగంలా గడుపుతూన్న మాధురికి, ఎదురుగుండా ఎవరో వస్తూన్న జాడఅయింది.

చూస్తే శేఖర్! నిరాశగా వస్తున్నాడు.

పక్కని కిరీటిలేదు. ఖరీదైన దుస్తుల్లో వీర్రాజు కాబోలు వస్తున్నాడు అతని పక్కని మాధురికి కాలిక్రింద నేల కదిలినట్లయింది.

మనస్సు క్రుంగిపోయింది.

అనుకున్నంతా అయింది-కిరీటి రాలేదు.

శేఖర్ ఏదో చెప్పాడు. మాధురికేం వినిపించలేదు. జరగబోయే ప్రమాదాన్ని తలుచుకొన్న కొద్దీ ఆమె మెదడులో భయంకరమైన తుఫానులా భరించలేని రకరకాల ధ్వనులూ బయలుదేరాయి శేఖర్‌వైపు ఒకమారు అనుమానంగా చూసి, సర్వస్వం చాన్నీ పోగొట్టుకొన్న దురదృష్టవంతురాలిలాగ వెనక్కి తిరిగింది, ఆమె నడుస్తోంది. కాని ఆ అడుగులు గాలిలో తేలిపోతున్నాయి, చూస్తోంది కాని ఆ చూపులు దేన్నీ చూడ లేక ఏ భావాన్నీ చెప్పలేక నిర్జీవంగా వున్నాయి తిన్నగా నడిచి నడిచి, పార్టీకి దూరంగా కేసెట్ లౌడ్ స్పీకర్లూ ఏర్పాటు చేసిన టేబిల్ దగ్గరికివెళ్లి ఒక్కర్తే ఒక కుర్చీలో కూర్చుండి పోయింది

''తను చెప్పింది విందో లేదో, గుడ్లప్పగించి, ఓమారు చూసి అలా వెళ్ళి పోయిందేమిటి మాధురి! కిరీటి రాలేదని చెప్పేటప్పటికి ఆమె మనస్సు వికలం అయి పోయిందా? లేక కిరీటిని రప్పించలేకపోయినందుకు తనమీద కోపంవచ్చిందా? అదీ ఇదీ కాక తన నిజాయితీని శంకించి అనుమానిస్తోందా?''—ఏమీ అర్థంకాలేదు శేఖర్‌కి. కిరీటి రాడని తనుమాత్రం అనుకున్నాడా? సరే-ఇలా జరిగింది, ఇప్పుడేమిటి చెయ్యడం? ఏదో ఒక కొత్త ప్లానువేసి కావలసినపనిని పూర్తిచేసుకోవాలి. ఆ వుద్దేశంతోనే. కిరీటి ఇంక రాడని తెలుసుకున్నాక ఈ వీర్రాజుని వెతికిపట్టుకొచ్చింది తను. ఈ మార్గం ప్రయత్నించాలి. ఫలితం ఎలా వస్తుందో చూడాలి. ఇలా నిర్ణయించుకొని వీర్రాజు చెవిలో ఏదో చెప్పాడు శేఖర్.

ఆ ప్రకారం వీర్రాజువెళ్ళి- రవణయ్య కూర్చున్న టేబిల్‌కి కనిపించేలాగ దూరంగా మరో టేబిల్ దగ్గర కూర్చున్నాడు శేఖర్ తన కోటుతీసి చేతిమీద వేసుకొని, కనిపించిన మిత్రులందరితోనూ కరచాలనం చేస్తూ, అందరికీ అన్ని పదార్థాలూ అందాయో లేవో కనుక్కుంటూ, జగత్పతిరావు దగ్గరికివచ్చాడు అప్పటికి జగత్పతిరావు, వచ్చిన అతిథుల్ని అందర్నీ పలకరించి బట్లర్‌చేత ఒకట్రేలో టిఫెన్ కాఫీ వగైరాలన్నీ పెట్టించి ఇంట్లోకి పంపిస్తున్నాడు.

''అవి ఎవరికండీ? ఇంకా ఇంట్లో ఎవరుండి పోయారు?'' అన్నాడు శేఖర్, ఉండిపోయింది బావాజీ అని తెలియక—జగత్పతిరావు ఆ ప్రశ్నకి తొట్రుపడి ''అబ్బే ఎవరూలేరు, ఏంలేదు. అవునుకానీ-నువ్వు ఏమిటి ఇప్పుడు వచ్చావు? ఇంత సేపటిదాకా ఎక్కడికెళ్లావు? మాధురి ఏదీ? ఎక్కడ కూచుంది?'' అంటూ తెగ ప్రశ్నలు కురిపించ సాగాడు.

శేఖర్ ఆ ప్రశ్నలకేం సమాధానం చెప్పకుండా "నా బాల్యమిత్రుడు ఒకడు వచ్చాడు. అతణ్ణి పరిచయం చేస్తానురండి" అంటూ జగత్పతిరావుని వీర్రాజు దగ్గరికి తీసుకువెళ్లాడు.

"వీరు జగత్పతిరావుగారు " అంటూ శేఖర్ జగత్పతిరావుని వీర్రాజుకి పరిచయంచేశాడు.

"నాపేరు వీర్రాజండి. శేఖర్ నేనూ చిన్నప్పటినుంచీ స్నేహితులం" అన్నాడు వీర్రాజు వినయంగా.

జగత్పతిరావు మర్యాదకోసం కొద్దిగా నవ్వి "అహా! మీరేం చేస్తూ వుంటారు" అన్నాడు.

"అది అడక్కండి. ఉదరపోషణార్థం బహుకృతవేషం"—ఇద్దరూ నవ్వుకున్నారు.

"సరే సరే పెళ్లాంపిల్లల్ని పోషించుకోడానికి ఏ మార్గం అయితే ఏంలెండి."

"పెళ్ళా? కాబోతోంది త్వరలో అదిగో చూడండి ఆ షుగుకూచున్నాడు! . . ఆయన మేనకోడలుతో."

"ఏవిటి? ఆ పెద్దమనిషా? ఆ అమ్మాయిని కిరీటికి ఇస్తానన్నట్టుగా చెప్పాడు ఆ మధ్య ఆయన నాతో."

వీర్రాజు పగలబడినవ్వి "మీతోనూ చెప్పాడూ? ఆయన కిదో వేలంవెర్రి అయిపోయింది. పేర్ల మీద ఆయనకి ఉన్నంత మోజు మరెవ్వరికీ ఉండదు ఆయన కేనిటో కిరీటి పేరంటే బలే ఇష్టం. వీర్రాజు అనేపేరు నాకు బాగోలేదనీ, కిరీటి అని పెట్టుకోమనీ నన్ను చాలా రోజులనుంచి వేయించుకొని తింటున్నాడు. ఇది న్యాయమా మీరు చెప్పండి? పెద్దవాళ్ళు పెట్టిన పేరుని, ఈయన మేనకోడల్ని ఇస్తాడు కదా అని మార్చుకొని మరో పేరు పెట్టుకోవాలా?" అన్నాడు.

జగత్పతిరావు ఏం అర్థంకాక అయోమయంగా చూశాడు.

"నేను తెలుగు ఎమ్మే చదివితే బాగుంటుంది అని అన్నాడు ఒకమాటు."

"అని అంతటితో ఊరుకుంటే బాగుణ్ణు. ఏవీ నీ ఎమ్మే పుస్తకాలు అంటూ చంపాడు. దాంతో మన కిరీటి పుస్తకం ఇచ్చాను ఇది పట్టిగెళ్ళి ఆయనకి చూపించరా అని" అన్నాడు శేఖర్.

"అంతే అప్పటినుంచీ యూనివర్సిటీ చుట్టూ తిరగడం ప్రారంభించాడట. ఇక్కడ మా కిరీటి వుండాలి ఏడీ? అంటూ."

"ఆయనకేమైనా కొంచెం మతి స్థిమితం తక్కువా?" అనుమానంగా అడిగాడు జగత్పతిరావు.

"ఆ . అదీ వుండి వుంటుంది"

"అందుకే కాబోలు నన్ను ఇందాకా ప్రొఫెసర్‌గారూ అంటూ పిల్చాడు."

"పిల్చాడూ? ఇంకనేం? ఈ పాటికి మీకూ అర్థం అయే వుంటుంది.''

జగత్పతిరావు ఆలోచనలోపడ్డాడు. ఈ పిచ్చివాడి మాటని పట్టుకొనా తను ఆ రోజున కిరీటిని అలా అవమానపరిచింది! ఇదే నిజం అయితే పాపం మాధురి చెప్పినట్టు ఆ కిరీటి నిర్దోషి.

జగత్పతిరావు ముఖకవళికల్ని గమనిస్తూ ''ఆయన పాపం ఒక్కడూ కూర్చు న్నాడు. వెళ్లి పలకరించ కూడదురా వీర్రాజూ" అన్నాడు శేఖర్.

''ఈ అరగంటయినా నేను సుఖంగా బతకడం నీ కిష్టంలేదేవిటి?''

''ఆయన అంత ప్రమాదకరమైన మనిషా?'' దూరంగా సాసర్లో కాఫీ పోసుకుని ఊదుకుంటూ తాగుతూన్న రవణయ్యని అనుమానంగా చూస్తూ అన్నాడు జగత్పతిరావు.

''అవునో కాదో మీరొక్కమాటు ఆయన్ని పలకరించి రండి."

''పోరా నీది మరీ విడ్డూరం గండి ఆయనతో ఓమారు మాట్లాడి వద్దాం. పైగా పాపం ఆయన ఒక్కరూ కూచున్నారు'' అన్నాడు శేఖర్.

ఈ వ్యవహారం ఏదో విచిత్రంగానేవుంది. అదీకాక ఈ అబ్బాయి చెప్పింది ఎంతవరకూ నిజమో ఆయనతో కూడా మాట్లాడితే కాని తెలియదు. ఈ సంగతేదో తెలుసుకోవడం ఒకరకంగా తనకీ అవసరమే. ఈ దెబ్బతో కిరీటి మంచివాడో మోస గాడో తేలిపోతుంది. అలాతేలడంవల్ల ప్రస్తుతం తనకేమి లాభం లేకపోయినా నిజం ఏమిటో బైటపడుతుంది. ఇలా అనుకొని ''సరే నడు'' అన్నాడు జగత్పతిరావు!

దగ్గరగావచ్చి కూచుంటూన్న శేఖర్‌నీ జగత్పతిరావునీ చూసి, మర్యాదతోకూడిన కంగారుతో లేవబోయాడు రవణయ్య. ఆ తొట్రుపాటులో, సాసర్‌లోవున్న కాఫీ వయ్యారంగా ఊగి రవణయ్య పంచెనీ చొక్కానీ పక్షపాతంలేకుండా సమానంగా పరామర్శచేసింది.

''కూచోండి కూచోండి అన్నీ అందాయా?'' అన్నాడు జగత్పతిరావు మర్యా దగా పలకరిస్తూ.

''అందుకేం లోటులేదు. అన్నీ భేషుగ్గా అందుతున్నాయి.''

''అదిసరే-మీరేవిటి ఒక్కరే కూర్చున్నారు?'' అన్నాడు శేఖర్.

''అవునండి. నా కిక్కడ ఎవరూ తెలియదు. వచ్చేటప్పుడు కూడా ఇదే అను మానించాను రానా మాననా అని. కాని పెద్దవారి దగ్గర్నుంచి వచ్చిన ఆహ్వానం కదా? పైగా తప్పకుండా రమ్మని మరీ మరీ చెప్పారని ఆ ఆహ్వానం పట్టుకొనివచ్చిన వ్యక్తి చెప్పాడు. సరే బైలుదేరాను అతను చెప్పిన ఆనమాలు ప్రకారంవస్తే, ఇది ప్రొఫెసర్ గారి ఇల్లయి ఊరుకొంది హి హ్హి '' అంటూ జగత్పతిరావుకేసి తిరిగి మర్యాద పూర్వకంగా నవ్వాడు రవణయ్య.

"అరే.. మళ్ళీ నన్ను ప్రొఫెసర్ అంటున్నాడు! ఆ వీర్రాజు చెప్పినట్లు ఇతనికి నిజంగానే కొంచెం మతిస్థిమితం లేదేమో" అనుకొన్నాడు జగత్పతిరావు.

"ఇక్కడ మీకు ఎవరూ తెలియకపోవడం ఏమిటి? ఆమూలదూరంగా కూర్చున్న వ్యక్తిని చూడండి" అంటూ శేఖర్ వీర్రాజుని చూపించాడు.

రవణయ్య కళ్లకి చెయ్యి అడ్డంపెట్టుకొని పరిశీలనగా చూసి "అరే! మాకిరీటి వచ్చాడే!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అతనేనా మీరన్న కిరీటి! అతనేనా మీ మేనగోడల్ని ప్రేమించాడన్నారు మీరు నాతో" అన్నాడు జగత్పతిరావు.

రవణయ్య జగత్పతిరావు మాట వినిపించుకోకుండా "కిరీటీ ..కిరీటీ" అంటూ పిలిచాడు. వీర్రాజు పలకలేదు. చాలా సేపటివరకూ ఇటు తిరిగిచూడనేలేదు. చివరకి వాళ్ళదగ్గరికి వస్తూ 'చూశారా ఆయన నన్ను ఎలా పిలుస్తున్నాడో' అన్నట్లు జగత్పతి రావుకీ శేఖర్‌కీ కళ్ళతో సంజ్ఞచేశాడు.

"ఏం కిరీటీ ఈ మధ్య ఏమిటి కనిపించడం మానేశావు? మీ ఊరుగాని వెళ్లావా? వెళితే నాతో చెప్పమన్నాను కదా?" అన్నాడు రవణయ్య.

వీర్రాజు ఏం సమాధానం చెప్పిందీ జగత్పతిరావు విననేలేదు అతని మనస్సులో ఏక ఆలోచనలు సుడితిరిగి పోతున్నాయి. ఈ పిచ్చివాడి మాటలు పట్టుకొనాతను కిరీటిని ఆరోజున నానామాటలూ అన్నది! ఆ రోజున మాధురి చెప్పనే చెప్పింది. తను వింటేనా ఆ కోపంలో-పాపం ఆ నిర్దోషిని మరోమాటు అవమానపరిచి ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. అతనేం బాధపడ్డాడో ఏమో-తనుతొందరపడి అటు కిరీటినీ బాధపెట్టాడు, ఇటు మాధురి హృదయాన్నీ గాయపరిచాడు. మాధురి కేదో అన్యాయం జరిగిందని, తన మనస్సూ క్లేశపెట్టుకున్నాడు. ఆ కిరీటిని మరిచిపొమ్మనీ, తొందరలో ఎవర్నో ఒకర్ని పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకోమనీ కన్నకూతుర్ని కట్టడి చేశాడు. తన మాట కాదనలేక కాబోలు పాపం అది ఈ శేఖర్‌నిపెళ్ళి చేసుకుంటానంది ఏం జరిగిందో ఏమో మొత్తం మీద జరగకూడని పొరపాటే జరిగిపోయింది.

జగత్పతిరావు ముఖాన్ని పరిశీలిస్తూన్న శేఖర్‌కి అతను పడుతూన్న ఆవేదన స్పష్టంగా అర్థంఅయింది. హమ్మయ్య! తనుచేసిన ప్రయత్నం ఫలించింది. పెద్ద బరువు తీరినట్టు దీర్ఘంగా శ్వాసవదిలాడు. ఇంక జగత్పతిరావుగారి మనస్సు కిరీటి మీదకి నెమ్మదిగా తిప్పాలి పోతే ఈ రవణయ్యనే ఇంకొంచెం మరమ్మతు చెయ్యాలి. ఎప్పటికేనా వీడు వీర్రాజు అనీ కిరీటి కాదనీ, వీడి ప్రస్తుత వ్యాపకం తెలుగు ఎమ్మే చదవడంకాదనీ ఆటోరిక్షాని నడపడం అనీచెప్పవలసిందే కదా ఈయనకి. ఆ చెప్పడం ఇప్పుడే చెప్పేస్తే సరి. నెమ్మదిగా మనస్సు సరిపెట్టుకొని ఆ తర్వాత క్రమంగా ఒప్పుకుంటాడు, వీడికి తన మేనకోడల్ని ఇవ్వడానికి. ఈ సమస్యలు రెండూ ఇలా పరిష్కారం అయితే తనకి

బాధ్యత తీరుతుంది; తీరి కూచుని నవ్వులాటగా మొదట్లో ఈ సమస్యలు సృష్టించింది తనే కనుక ఈ చిక్కులు విడదీయవలసిన బాధ్యత కూడా తనదే.

ఆలోచనల బరువుతో భారంగా అడుగులు వేసుకుంటూ జగత్పతిరావు వెళ్ళిపోయాక "అవునూ! ఇంతకీ ఈ పార్టీ జగత్పతిరావుగారు ఎందుకు ఎరేంజ్ చేశారో తెలుసా?" అన్నాడు శేఖర్.

"జగత్పతిరావుగారు ఎవరు?"

"అదే-ఆయనే-మీరు ప్రొఫెసర్ అనుకుంటున్నారూ."

"అనుకోవడం ఏవిటి, ఆయన ప్రొఫెసర్ కాదూ?"

"కాదులెండి మీరు పొరబడ్డారు."

"ఆ మరైతే ఈయనెవరు?"

"ఈయన ఎవరైతే ఏంలెండి. ఈ పార్టీ ఎందుకు ఇస్తున్నారో తెలుసా?"

"నాకేంతెలుసు! ఆహ్వానం వచ్చింది-వచ్చాను. అంతే" అన్నాడు రవణయ్య తనకి తెలిసింది ఎంతవరకూ నిజమో అనే ఆ అనుమానంతో.

"అయితే వినండి. ఆయనకూతుర్ని కిరీటికి ఇచ్చి పెళ్ళిచెయ్యడానికి నిశ్చయించారు. అందువల్ల దీన్ని ఎంగేజ్‌మెంటు పార్టీగా ఎరేంజిచేశారు."

"ఏవిటి మీరంటూన్నది?" గట్టిగా గద్దించాడు రవణయ్య.

"అవును, నామాట అబద్ధం అయితే మా వీర్రాజుని అడగండి ఏరా వీర్రాజూ?"

వీర్రాజు అవునన్నట్లు తల ఊపాడు.

"వీర్రాజేవిటి? నిన్ను వీర్రాజంటా దేవిటి కిరీటీ?"

"నాపేరు వీర్రాజేనండి! ఇన్నాళ్ళూ మీరు నన్ను కిరీటి అనుకొని పొరబడ్డారు" తలవంచుకొని సమాధానం చెప్పాడు వీర్రాజు.

"అబ్బాయ్! నువ్వు నాదగ్గర ఈ కబుర్లు కట్టిపెట్టు, నువ్వు కిరీటివి కామా? మీ అమ్మ సావిత్రికాదూ? మీది నరసాపురం కాదూ?"

"కిరీటి అమ్మగారిపేరు సావిత్రే. వాళ్ళది నరసాపురమే-కాని ఆ కిరీటి వీడుకాదు."

"అదేవిటయ్యా . . మొదటినుంచీ ఇతను కిరీటే-తెలుగు ఎమ్మే చదువుతూన్న కిరీటి. మధ్యలో మరొకడిగా ఎలా మారతాడు?"

"ఏం మారలేదు. కంగారుపడకండి. వీడు మొదటినుంచీ వీర్రాజే-ఆటోరిక్షా నడిపి పొట్టపోసుకుంటూన్న వీర్రాజు! తెలుగు ఎమ్మే చదువుతున్నానంటే కాని మీరు దగ్గరకు రానియ్యరనీ, మీ మేనకోడల్నిచ్చి పెళ్ళిచెయ్యరనీ తెలిసి. నేనే వీడిచేత కిరీటి వేషం వేయించాను."

"ఆ! .. ఇతను తెలుగు ఎమ్మేకాదూ? ఆటోరిక్షా డ్రైవరా?" అన్నాడు రవణయ్య నమ్మలేను అన్నట్లు. అతనికి హఠాత్తుగా, వీర్రాజు ఆటోరిక్షాని అతి చాకచక్యంగా

నడపడం, ఫేన్సీ డ్రెస్సువేశానని చెప్పడం, అన్నీ జ్ఞాపకంవచ్చాయి. నిజమే-ఇతను ఆటోరిక్షా డ్రైవరేనేమో—

"నాకు మతిపోతోంది" అన్నాడు రవణయ్య తలపట్టుకొని.

"ఎందుకండీ అలా అనవసరంగా పోగొట్టుకోవడం. వీడు కిరీటి ఐతే నే వీర్రాజు అయితేనేం? పేరులో ఏంవుంది పెన్నిధానం? శుభ్రమైన కుర్రాడు, ఆటోరిక్షా లాగితే ఏం సైకిలు రిక్షాలాగితేం ఏం? పెళ్ళాన్ని పోషించుకోగలడు. ప్రేమగా చూసుకుంటాడు. నిక్షేపంలా ఇచ్చి పెళ్ళిచేసెయ్యండి మీ మేనకోడల్ని-ఆ కిరీటిని మీరు ఎరగరు కాని వాడు తైటడుద్దాయి. ఏ జగత్పతిరావు వంటి ధనవంతులకో అల్లుడుగా దఖలుపడి, వాళ్ళింట్లో ఓ పెంపుడు జంతువుగా ఇల్లరికపు అల్లుడై బతకవలసినవాడే కాని మనలాంటి సామాన్యుల ఇంటికి అల్లుడు కావలసినవాడు కాదు. తెలివితేటలూ, చాకచక్యం, మాట నేర్పరితనం ఏ కోశానాలేవు. వాడికంటేవీడు లక్షరెట్లు నయం!"

"ఆపు చెయ్యి నీ ఉపన్యాసం. నేను నమ్మను. ఇతనే కిరీటి." అంటూ లేచాడు రవణయ్య.

ఇంతలో పార్టీలో జనం అంతా తొడ తొక్కిడిగా లేచారు. "ఏం జరిగిందంటే ఏంజరిగింది"" అంటూ. ఎక్కడ చూసినా కల్లోలం-కంగారు-పరుగులు-అంతా కలియ దొక్కుకుంటూ ఒకే దిక్కుగా పోతున్నారు. ఏవిటో ఈ హడావిడి, ఏం జరిగిందో అర్థంకాలేదు కబుర్లలో మునిగివున్న ముగ్గురికీను. వెళుతూన్న ఓ మనిషిని పట్టుకుని ఆపి "ఏం జరిగింది?" అన్నాడు శేఖర్. "రికార్డులున్న ఆ మూల టేబిల్ దగ్గర జగత్పతి రావుగారి అమ్మాయి స్పృహతప్పి పడిపోయిందిట!"-అని జవాబు.

"ఆ!" అంటూ శేఖర్, వీర్రాజూ అటు పరిగెత్తబోయారు.

ఇంతలో ఒకరిక్షావాడు వీధి గేటు తీసుకొని బిల్డింగ్ చుట్టు తిరిగి, గార్డెన్‌లోకి వచ్చి "జగపతిరావుగారిల్లిదేనా అండీ-ఇక్కడెవరో సేకరం బాబుగారంట ఆరికోసం కిరీటంగారంట ఒచ్చారు. ఈది మూల రికసాలో కూసున్నారు" అన్నాడు.

"ఆ! . కిరీటి వచ్చాడా?" అంటూ సంభ్రమాశ్చర్యాలతో శేఖర్, వీర్రాజూ ఒక్క అదుటున వీధిలోకి వచ్చిపడ్డారు. అసలు సంగతేవిటో ఈ దెబ్బతో అర్థం అవు తుందని ఆశతో రవణయ్య కూడా వీధిలోకి వచ్చాడు

కిరీటిని సమీపించి కౌగలించుకొన్నంత పనిచేసి "ఏరా? నువ్వు ఇందాకటి రైల్లోనే వచ్చావా? నాంపల్లి రాకుండా సికింద్రాబాదులోనే తిగిపోయావేమిటి? అదీ అలా చెప్పు. నా వుత్తరం అందిందా? ఇదేవిటి ఇవతలే వుండిపోయావు? లోపలకి రా" అంటూ గబగబా మాట్లాడేశాడు శేఖర్.

కిరీటి ఏం సమాధానం చెప్పకుండా తాపీగా "నా టెలిగ్రాం అందలేదా నీకు? అవున్లే నువ్వు రూమ్ ఖాళీచేసి ఇక్కడికి మకాం మార్చావటగా, ఇప్పుడు నేను రూమ్‌కి

వెళితే తెలిసింది. అత్తయ్యనీ జయనీ రూమ్‌లో కూర్చోమని నీ కోసం ఇలా వచ్చాను. ఓమాటు రూమ్‌కి రా నీతో పనివుంది'' అన్నాడు.

''సరేగాని ముందోమాటు లోపలికి వెళదాం రా-మాధురి స్పృహతప్పి పడి పోయింది ఇప్పుడే.''

''ఆఁ'' అన్నాడు కిరీటి ఆదుర్దాగా-అంతవరకూ; జగత్పతిరావుగారి ఇంట్లోకి ఇంక అడుగు పెట్టనని భీషణ ప్రతిజ్ఞ చేసుకుని కూర్చున్న కిరీటి, ఆమాట వినడంతో ప్రతిజ్ఞ సంగతే మరిచిపోయాడు. జగత్పతిరావుగారంటే వున్న భయం, మాధురీ జగత్పతిరావుగార్లమీద పెంచుకున్న కోపం, ఆ క్షణంలో ఏమయ్యాయో ఏమో-శేఖర్, వీర్రాజులతో కలిసి లోపలికి బయల్దేరాడు.

రవణయ్య వుండలేక ''ఇతనేనా కిరీటి?'' అంటూ అడిగాడు శేఖర్‌ని. ''ఆఁ ఇతనే'' అంటూ కంగారులో విసుగ్గా సమాధానంచెప్పి, వీర్రాజునీ కిరీటినీ తీసుకొని తొందరగా లోపలికి వెళ్ళిపోయాడు శేఖర్. ''ఊ .. సరే '' అంటూ తలపంకించి అక్కడినుంచి అలాగే వెళ్లిపోయాడు రమణయ్య.

15

"కేసు హిస్టరీ అంతా చెప్పావు కదా ఇంక జయసంగతి నేను చూసుకుంటాను. మరి నేను చెప్పిన విషయం ఏం ఆలోచించావు?'' అన్నాడు శేఖర్.

కిరీటి ఏం మాట్లాడలేదు.

''నువ్వు చూశావు కదా జగత్పతిరావుగారు ఎంతో పశ్చాత్తాప పడుతున్నారు. ఇంక మాధురి సంగతి సరేసరి: తను పెళ్ళి అంటూ చేసుకుంటే నిన్నుతప్ప ఇంకెవర్నీ చేసుకోనని కూర్చుంది. ఏదో ఆరోజున జరిగిన పొరపాటుని మనస్సులో పెట్టుకోక నువ్వు మామూలుగావుండు.''

కిరీటి ఈ మారూ సమాధానం చెప్పలేదు.

"ఆలశ్యంగానైనా మొత్తంమీద ఆ టీపార్టీరోజున నువ్వు వచ్చావన్నసంగతి విని ఎంత సంతోషించిందో, తనకి స్పృహవచ్చేటప్పటికి నువ్వు అక్కడవుండకుండా వెళ్ళిపోయావని తెలిసి అంతబాధ పడింది మాధురి.''

కిరీటి ఆమాటలేం వినిపించుకుంటూన్నట్లు లేదు. టేబిల్‌మీదవున్న శేఖర్ స్టెతస్కోపుని ఇటూ అటూ తిప్పుతున్నాడు. అది చూసి చిరాకేసి కిరీటి చేతులోంచి దానిని లాక్కుని ''ఏం నేను చెప్పిందేమన్నా వింటున్నావా, నాకు తెలియ కడుగుతాను ఏవిటా మొండిపట్టుదల?'' అన్నాడు శేఖర్.

కిరీటి గంభీరంగా ముఖంపెట్టి ''అంటే నీ ఉద్దేశం ఏవిటి? వాళ్లు ఛీ పో అన్నప్పుడు పోయి, రా ఫరవాలేదన్నప్పుడు రావాలన్నమాట పెంపుడు జంతువు లాగ?'' అన్నాడు.

ఆ మాటలు వినేసరికి శేఖర్ బిత్తరపోయాడు. ఏవిటి? ఈమాదిరిగా అంటూన్నది కిరీటే! సిగ్గుతో మొహమాటంతో ముడుచుకుపోయి, ఏవన్నా సమాధానం చెప్పలేని అమాయకుడైన కిరీటికి, ఇంతమాటకారితనం పౌరుషం ఎప్పుడొచ్చాయి, ఎలావచ్చాయి?

''ఒరేయ్ మనమంచితనాన్ని వాళ్ళు చేతకానితనంగా జమకట్టి ఆటవస్తువుగా ఆడిస్తూంటే ఆడడమేనా నువ్వుచెప్పు. అయినా నా తత్త్వం తెలుసునుకదా నీకు-ఒకళ్లని అనవసరంగా నేను అనను-ఒకళ్ళంటే పడను.''

శేఖర్ ఆలోచనలో పడ్డాడు.

''అసలు మొదటినుంచీ తప్పంతా నాదేలే-మనిషి అన్నవాడు ఇంత మెతక తనంగా వుండకూడదు. ముందు మెత్తగావుండి తర్వాత మొత్తారని బాధపడితే ఏం లాభం?''

కిరీటి పడుతూన్న వేదన శేఖర్‌కి అర్థం అయింది. నిజమే! ఇలాంటి మంచి వాళ్లకికోపం రానేరాదు. వస్తే ఓ పట్టానపోదు. ఇప్పుడు కిరీటితో వాదించి లాభంలేదు. వాదించిన కొద్దీ వ్యవహారం చెడుతుంది. కొన్నాళ్లుపోతేనే కాని పరిస్థితులు సర్దుబాటు కావు. అంతదాకా తను జగత్పతిరావుగారి ఇంట్లో మాధురికి కాబోయే భర్తలా వ్యవహరించక తప్పదు. శేఖర్ తల ఎత్తి కిరీటకేసి చూశాడు. కిరీటి ముఖం కోపంతో ఎర్రగా అందంగావుంది. అదిచూసి నవ్వుతూ ''ఒరేయ్ నువ్వుకోపంలో కూడా అందంగా వుంటావురా'' అన్నాడు.

ఆమాటకి కిరీటి నవ్వలేదు. చిరాగ్గా చూశాడు.

''అయినా ఒరేయ్ అబ్బీ-నేనొక్కటి అడుగుతాను. దాపరికంలేకుండా చెప్తావా?'' అన్నాడు శేఖర్. కిరీటి శేఖర్ ముఖంలోకి చూశాడుకాని ఆ చూపులో ఏ భావంలేదు.

''అవునూ-ఇంతకీ నీకు ప్రేమంటే ఏమిటో, ప్రేమించడం ఎలాగో, ఇదేమన్నా తెలుసా? దబాయించకు తెలిస్తే తెలుసనిచెప్పు. లేకపోతేలేదు.''

కిరీటి ఆ ప్రశ్నవిని వులిక్కిపడ్డాడు. నిజమే, తనకి ఈ వ్యవహారాలు ఎంత వరకూ తెలుసు? ఇంతవరకూ ఎప్పుడూ తనని తానీ ప్రశ్న వేసుకోలేదు. తను ఎప్పుడేనా ఎవరినేనా ప్రేమించాడా? ఒక్క క్షణంలో, గతజీవితాన్నంతా మహావేగంగా నెమరు వేసుకున్నాడు. ఉహుఁ! ఎప్పుడూ లేదు. ఎవర్నీ ప్రేమించలేదు. మరి మాధుర్ని? మాధుర్నిమాత్రం తనేం ప్రేమించాడు? కానయితే ఆమె తనతప్పున వాదించేదనీ తనంటే ఇష్టంగా వుండేదనీ, సరదాగా మాట్లాడేదనీ, ఆమెతో వీలైనప్పుడల్లా కబుర్లు చెబుతూ కాలం గడపాలని ఉవ్విళ్ళూరేవాడు, నవ్వుతూ మాధురి మాట్లాడుతూంటే తనకి గంటలు క్షణాలుగా గడిచిపోయేయి. మాధురి తనకేసి చల్లగా చూస్తే ప్రాణానికి హాయిగావుండేది. ఆమెకి ఎలావుంటే ఇష్టమో తెలుసుకుని అలాగే వుండ బుద్ధివేసేది. ఆమె కళ్లల్లో బాధ కనిపిస్తే తన మనస్సు విలవిల్లాడిపోయేది. ఆమెగురించి ఆలోచించకుండా ఏక్షణం

గడిచేదికాదు తనకి-మొన్నటికి మొన్న స్పృహ తప్పి పడిపోయిందని వినగానే, కోపం పట్టుదలా సంగతి మరిచిపోయి గబగబా ఆమెని చూడ్డానికి లోపలికి వెళ్లాడు. ఇప్పటికీ ఆమెని మనస్ఫూ ద్వేషించలేకపోతున్నాడు. ప్రతి నిముషం మాధురి తాలూకు ఆలోచన తన మనస్సులోకి వస్తోంది. ఇలా వుండడాన్నే ప్రేమ అంటారా? ఏమో!

"ఏరా మాట్లాడవు-నేను అడిగినదానికి జవాబు చెప్పు."

"ఏం చెప్పమంటావు? నాకేం తెలియడంలేదు." అంటూ తన మనస్సులో అనుకున్నదంతా, ఒక్క అక్షరం పొల్లుపోకుండా అంతా శేఖర్‌కిచెప్పి, "మరి ఈ మానసిక స్థితిని ఏమని పిలుస్తావో నాకుతెలియదు. ఇదీ పరిస్థితి" అన్నాడు కిరీటి ఇబ్బందిగా.

శేఖర్ పొట్టచెక్కలయ్యేలాగ నవ్వి "ఓరి పిచ్చిసన్యాసీ! ప్రేమంటే మరి ఏమిటనుకున్నావు? ఇదే!" అన్నాడు.

కిరీటి విద్యుద్ఘాతం తగిలినవాడిలా విస్తుపోయి, "ఆ .ఏవిటీ? . ఇదేనా ప్రేమంటే? . మరయితే . " అని మాట మధ్యలో ఆగిపోయాడు.

"ఒరేయ్ నీ చదువంతా ఎందుకురా. మళ్ళీ తెలుగు ఎమ్మే చదివాడట తెలుగు ఏమ్మే! ఇన్ని శృంగార కావ్యాలు చదివావు కదా ప్రేమంటే అర్థంకాలేదురా?"

"ఏడిశావ్. చదివింది ప్రతీదీ అర్థం అవాలని ఏముంది? ప్రేమంటే ఇదేనా? నేనింకా ఇన్నాళ్ళూ శృంగారం ప్రేమా అనేవి ఊర్వశీ, శకుంతలా, పురూరవుడూ దుష్యంతుడూవంటి మహోత్తమ నాయికా నాయకుల మధ్యవుండే ఉదాత్తభావనావిశేషం, మహోన్నత మానసిక విధానం అనుకున్నాను."

"అఘోరించలేకపోయావు. గట్టిగా అనకు. ఎవరేనావింటే నవ్విపోతారు. ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా నీలాంటి మనుష్యులున్నారంటే ఎవరూ నమ్మరు మానవ సంఘంలో వుండవలసిన వాడివికాదు. జంతు ప్రదర్శనశాలలో రాణించవలసిన 'రేర్ స్పెసిమన్'వి నువ్వు. నీలాంటి జంతువుని ఆమాధురి ఎలా ప్రేమించిందో నాకు అర్థం కావడంలేదు" అంటూ శేఖర్ చివాట్లుపెడుతూంటే కిరీటి తప్పుచేసిన వాడిలా తలవంచుకొని నిలబడ్డాడు. ఆ సమయంలో గాలివానలా వచ్చిపడ్డాడు వీర్రాజు. వచ్చి శేఖర్ కాళ్ళ దగ్గర వటవృక్షంలా కూలిపోయాడు. అదిచూసి శేఖర్ తత్తరపాటుతోలేచి, "ఒరేయ్ నిన్ను తగలెయ్యా! సుడిగాలిలా ఈ రావడం ఏవిటి. ఎలక్షన్‌లో చిత్తుగా ఓడిపోయిన వాడిలా ఆ ముఖం ఏమిటి?" అన్నాడు.

వీర్రాజు శేఖర్ కాళ్లు చుట్టేసి బేర్‌మన్నాడు. కాస్సేపాగి నమలకుండా మింగేలాగ చూసి చెడామడా తిట్టేసాడు. మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు. తర్వాత తిట్టడం-ఏడవడం-తిరిగి తిట్లూ ఏడుపూ-ఇలా ఒకటి మార్చి ఒకటి మొదలెట్టాడు.

కొంచెంసేపు చూసి "ఒరేయ్-డోలూ సన్నాయీ ఒకడే వాయించినట్లు ఏవిటిరా ఆ తిట్లూ ఏడుపూను. ఏవిటి? ఏం జరిగింది?" అన్నాడు శేఖర్. వీర్రాజు కచేరీమాన

లేదు. "ఆ బాకా, బాజా, ఆపి అసలు సంగతి చెప్తావా, కోడి మెడ తిప్పేసినట్లు నీ గొంతు నులిమేసి చంపెయ్య మంటావా?" అన్నాడు శేఖర్ కోపంగా మీదకి వంగుతూ.

అతికష్టంమీద ఏడుపు దిగమింగి దీర్ఘాలుతీస్తూ "ఇంకేంవుందిరో!.. కొంప మునిగిపోయింది నీబోడి సలహావిన్నాను .. నా ప్రేమవృక్షం కూల్చేసుకున్నాను . నా కలల స్వర్గం కరిగించేసుకున్నాను. గుమ్మంలోకివస్తే కాలు విరగ్గొడతానంటున్నాడు ఆ రవణయ్య. మావయ్యని కాదని నేను నీతోరాలేనంటోంది నా రాణి ఇంక నాకేం దారిరోయ్ నీచచ్చు సలహాలూ నువ్వూన్రోయ్ నాకెక్కడదొరికావురోయ్ నువ్వోయ్! అసలోయ్" అని దండకం మొదలెట్టాడు వీర్రాజు.

శేఖర్ దీర్ఘంగా ఆలోచించసాగాడు.

కిరీటి సానుభూతితో వినసాగాడు.

"తెలుగు ఎమ్మే చదువుతున్నాను. కిరీటిని అంటూ నాటకం ఆడతావా? ఈ మాటు నీమొహం చూపించావో పోలీసులికి రిపోర్టు చేస్తాను జాగ్రత్త అంటూ తన్నబోయాడు ఆతోడేలు ముఖం వాడు."

శేఖర్ దూలాలకేసి చూస్తున్నాడు. కిరీటిమాత్రం తన ముఖంలోకే జాలిగా చూస్తున్నాడు. అందువల్ల వీర్రాజు కిరీటితోటే తనగోడు చెప్పుకోసాగాడు.

"ఈ వారంరోజులనుంచీ అన్నం నోటికి సయిస్తే ఒట్టు అనుకో."

"పాపం" అన్నాడు కిరీటి.

"కంటికి నిద్దర కూడా లేదు."

"అ(!"

"ఎంతసేపటికీ కన్నీళ్ళు విరహగీతాలూను."

"ప్చ్"—కిరీటి నిట్టూర్పాడు.

"వారం అయింది సినీమాచూసి."

"అరెరే!"

"చూసినా లైలా మజ్నూలూ, అనార్కలీ, దేవదాసులూను."

"అలాగేం?"

"పార్కుకి వెళితే పండుటాకులూ ఎండిన చెట్లే కనిపిస్తున్నాయి."

"ఆహా!"

"పచ్చని ప్రదేశాలన్నీ వెక్కిరిస్తున్నాయి."

"హు(!"

"వెన్నెల దహించి వేస్తోంది."

"సహజమే!"

"ఇస్త్రీ చేసినబట్టలు కట్టుకో బుద్ధివెయ్యడంలేదు."

"ఎలా వేస్తుంది"

"జుట్టు దువ్వుకో బుద్ధీ వెయ్యడంలేదు."

వీర్రాజు జుట్టుకేసి చూశాడు కిరీటి.

"నేను నవ్వి ఎన్నాళ్ళయిందో తెలుసా? ఆ మాటకివస్తే అసలు నవ్వే మరిచి పోయాను."

కిరీటి తనలో తను కొంచెం నవ్వుకొని చూసుకున్నాడు. పరవాలేదు తనింకా ఆ స్థితికిరాలేదు. తనకి నవ్వు ఇంకా జ్ఞాపకంవుంది.

"ఏ ఎంజినోతాగి చచ్చిపోదాం అనుకుంటున్నా."

"కిరీటి వులిక్కిపడ్డాడు.

..."నన్నూ రాణీని విడదీశాడు ఆ దుర్మార్గుడు. మనుషుల్ని వేరుచేశాడు కాని మమతల్ని ఎక్కడవేరు చేయగలడు? మాది అమరప్రేమ. ఈ జన్మలో కాకపోయినా వచ్చేజన్మలో నేనా ఫలిస్తుంది."

"ఆ మాట నిజం."

"నా అంతస్తు తక్కువనే కదా, నేను ఆటోరిక్షా డ్రైవరుని అనే కదా, మా పెళ్ళికి ఆ బూర్జువా ఒప్పుకోవడం లేదు. ఈ సంఘం యొక్క ఇనుపపాదాల కింద ఇంకా ఎంతమంది ప్రేమైకజీవులు నలిగిపోవాలో! సమసమాజ నిర్మాణం జరగాలంటే మాలాంటి ఎన్ని ప్రేమపక్షులు బలి అయిపోవాలో"

"సంఘం, ఔన్నత్యం పొందాలంటే సంఘర్షణ అవసరమే మరి!"

"నా జీవిత మధుభాండం ముక్కలైంది హృదయవీణ మూగవోయింది."

"పాపం!"

"అఫ్ కోర్స్! ఈ ఆవేదనలో కూడా ఒక ఆనందం ఉంది."

"నిజమే!"

"ఈ మంటలో కూడా ఒక మమత ఉంది."

"ఆలోచిస్తే అంతే మరి!"

"పగిలిన హృదయంతో పిచ్చివాడిలా ఈ లోకంనుంచి నిష్క్రమిస్తా."

"నువ్వు చచ్చిపోతావా వీర్రాజూ!"

"అవున్రా - చస్తా - ఎప్పుడేనా తప్పులుచేసి ఉంటే మరిచిపోండిరా."

"నోరు ముయ్యండిరా ఇడియెట్స్ - వాడు తాన అంటే నువ్వు తందాన! జోడు సన్నాయిల్లాగ ఏమిటా వెధవ నాటకం డైలాగ్స్! మీరూను?" అన్నాడు శేఖర్ ఉరుము ఉరిమినట్లు అరుస్తూ.

"మరేం చెయ్యమంటావు?" ఇద్దరూ జమిలికంఠాలతో జాలిగా అన్నారు.

"నోరు మూస్తారా చంపెయ్యనా?" శేఖర్ ఇలా బిగ్గరగా అరవడంతో

వీర్రాజు పెదిమలు గట్టిగా బిగించాడు. కిరీటైతే నిజంగా రెండు చేతుల్తోటీ నోరే మూసుకున్నాడు.

"నిన్నో నాటకం ఆడమంటే అది కిరీటికి విషాదం అయింది. ఆ సమస్య పరిష్కరించబోతే అది నా మెడకు చుట్టుకుంది. దాన్ని తప్పించడానికి నీ నాటకం బట్టబయలు చేస్తే, అది మళ్ళీ నీ కంఠానికి ఇలా అడ్డుపడింది. దీన్ని మళ్ళీ ఎలా పరిష్కరించాలో! ఏం కథో!"

"మళ్ళీ ఇంకో కొత్త ప్లానా? వద్దు బాబూ వద్దు."

"మోహం తిరిగి పోయింది."

"నడ్డి విరిగి పోయింది."

"అదిగో మళ్ళీ మొదలెట్టారు వెధవజంట కవిత్వం మీరూను. మరి ఏదో ప్లాన్ వెయ్యకపోతే, పెళ్ళి పెటాకులూ లేకుండా విరహగీతాలు రాసుకుంటూ ఒహడూ విషాదరాగాలు పాడుకుంటూ ఒహడూ దేవదాసులులాగ అఘోరిస్తారా?" ఇలా శేఖర్ వాళ్ళ నిద్దర్ని చివాట్లు పెడుతూ ఉండగా డ్యూటీ నర్సు వచ్చి "అయిదో నెంబర్ బెడ్ మీద ఉన్న కొత్త పేషెంట్ కి మళ్ళీ ఫిట్ వచ్చింది" అని ఆదుర్దాగా చెప్పింది.

శేఖర్ వెనకాలే కిరీటీ వీర్రాజూ కూడా గబగబా వార్డులోకి వెళ్ళారు. శేఖర్ అరగంట ప్రయత్నం చేస్తేనే కాని జయకి తెలివి రాలేదు. తెలివి వచ్చాక, తనకోసం అని రూమ్‌లో అట్టే పెట్టుకున్న ఫ్లాస్కులో హార్లిక్స్ తెప్పించి శేఖర్ ఇయ్యబోతే తాగడానికి మొహమాట పడింది జయ.

"తాగనంటే కాదు - మీ బావదగ్గర సాగినట్లు నాదగ్గర పేచీ సాగదు. ఊ .. డాక్టర్ ఏం ఇస్తే అది తాగవలసిందే" అన్నాడు శేఖర్ నవ్వుతూ. జయ సిగ్గుపడింది. కాస్సేపు ఆగి "టీ పార్టీలో కాఫీ సిప్ చేసినట్లు అలా సుకుమారంగా తీసుకుంటే లాభం లేదు. గడగడా తాగెయ్యి. ఊ లేకపోతే గ్లూకోజ్ ఇంజక్షన్ ఇచ్చినట్లే హార్లిక్స్ ఇంజక్షన్ ఇవ్వవలసివస్తుంది" అంటూ హెచ్చరించాడు. జయ బుగ్గలు ఎర్రబడ్డాయి.

"ఒరేయ్ శేఖర్! నువ్వు చెబితే వింటోంది కాని మేం ఎవరం చెప్పినా వినదురా. మా అత్తయ్యే ఆదే బాధపడుతుంది" అన్నాడు కిరీటి.

"అసలు అత్తయ్యని హాస్పటల్‌కి రావద్దను. జయ ఆరోగ్యం సగం కుదుట పడుతోంది. రాత్రిళ్ళు మాత్రం ఆవిడ ఎందుకు శ్రమపడి వచ్చి ఇక్కడ పడుకోవడం. జయకి ఏం కావలసి వచ్చినా చూడడానికి ఇక్కడ నర్సులు లేరూ? అవసరం అయితే నేను లేనూ?" అన్నాడు శేఖర్.

ఆ రాత్రి బెడ్‌మీద పడుకోకుండా వార్డులో పచారు చేస్తోందని జయమీద నర్సు కంప్లెంటు చెయ్యడంతో శేఖర్ వచ్చి "నీకు నిద్దర రాకపోతే పచార్లు చేసి తిక్కిన

పేషంట్స్ నిద్దర పాడుచెయ్యకు. నడు నా డ్యూటీ రూంలో కూచుందువు గాని'' అంటూ శేఖర్ జయని తన రూమ్‌కి తీసుకు వెళ్లాడు.

శేఖర్ చూపించిన ఈజీచైర్‌లో కూర్చోకుండా ''నేనీ బెంచీమీద కూచుంటాను లెండి. మీరే ఆ ఈజీచైర్‌లో విశ్రాంతి తీసుకోండి. పాపం పొద్దుటినుంచీ నాలాంటి పెంకిపేషెంట్లతో వేగివేగి ఉంటారు'' అంది జయ, వచ్చే నవ్వు ఆపుకుంటూ. ఆమె తీసుకుంటూన్న చనువుకి ఆశ్చర్యపోయాడు శేఖర్. అతను ఆలోచిస్తూ సిగరెట్ కాలుస్తూ గాలిలోకి పొగ రింగురింగులుగా వదులుతూంటే, "మా బావకి కూడా ఆ సిగరెట్ కాల్చడం కాస్త నేర్పక పోయారా?'' అంది జయ. శేఖర్ పరధ్యానంగా ''ఏవిటీ సిగరెట్ నేర్పాలా?'' అన్నాడు జయ పకపకా నవ్వి ''మీ వరసచూస్తే నాకు నేర్పేలా ఉన్నారు" అంది. వెంటనే శేఖర్ పరధ్యానం నుంచి తేరుకొని, ఆ తర్వాత కావాలనే అన్నాడు. ''ఓహో కిరీటికా? ఇంకా నీకేమో అనుకున్నాను'' అని. ఆ మాట విని జయ కోపం నటిస్తూ ''పోండి. మీరు భలే వారే!'' అంది. ''నే నెక్కడికి పోతాను ఈ హాస్పటల్‌కి పుస్తి కట్టినవాణ్ణి? ఇక్కడే ఉంటాను. అంతగావస్తే నువ్వే వెళ్ళిపోతావు ఆరోగ్యం చేకూరితే వారం పదిరోజులలో'' అన్నాడు శేఖర్.

ఆ మాటతో జయ ముఖం విషాదంగా మారిపోయింది.

అది చూసి శేఖర్ కంగారుపడ్డాడు. న్యూరాలజీ పేషెంట్‌కి ఏవో కల్లబొల్లి కబుర్లు చెప్పి మంచి మూడ్‌లో ఉంచాలని తను ప్రయత్నిస్తే ఈమె విషాదంగా మారిం దేవిటి? ''నన్ను పంపించివేస్తారా? అవునులెండి, చెప్పినట్లు వినకుండా మిమ్మల్ని తెగ విసిగించి వేస్తున్నాను కదూ?'' అంది నిష్ఠూరంగా. శేఖర్ ఏదో చెప్పబోయాడు, జయ నీరసంగా నవ్వి, లేస్తూ ''నాకు ఇష్టంలేని వాళ్ళకి నేను కావాలి. ఇష్టం అయిన వాళ్ళకి నేను అక్కర్లేదు ప్చ్'' అంది. జయగురించి కిరీటి చెప్పిందంతా జ్ఞాపకం వచ్చి శేఖర్ జాలిగా నిట్టూర్చాడు.

16

సిటీ బస్సుకోసం క్యూలో నుంచున్నాడు కిరీటి. హాస్పిటల్‌నుంచి వస్తూన్న మాదురి అతణ్ణి చూసి గబగబా వచ్చి అతని వెనకాలే నిలబడింది. ఆడవాళ్ళకి వేరే క్యూ ఉన్నా సరే అందులో నుంచోకుండా అతను వెనక్కి తిరిగి చూస్తాడేమో అను కొంది. ఉహూఁ! . ''అవును వెనక్కీ పక్కలకీ ఎందుకు చూస్తాడు బుద్ధిమంతు డుగా?'' ముసిముసి నవ్వులు నవ్వుకొంది. కాస్సేపాగి కావాలని చేతిలో స్టెతోస్కోపుని అతని మోచేతికి తగిలేలా కదిపింది. అంతకీ చలనం లేకపోతే, అతని కాలర్‌మిద పాకుతూన్న చీమని వేలితో సుతారంగా అంటీఅంటనట్లు దులిపింది. ''అబ్బే! ఈ పరమ సాత్త్వికుడికి చిన్న చిన్న మోతాదు లేవీ పనిచెయ్యవు.''

కళ్ళనిండా కొంటెతనం తొణికిసలాడుతూంటే, బయటపడని నవ్వు పల్చని మేఘం వెనక చంద్రుడిలా ముఖంలో వింతగా వెలుగుతూ ఉంటే, పక్కకి చూస్తున్నట్లు నటిస్తూ చెప్పులతో అతని మడమల్ని నెప్పిపెట్టేలా తొక్కింది. కిరీటికి చర్రుమంది.

"ఏం? సరిగా నుంచోలేవూ? ముందువాళ్ళ మడమల్ని తొక్కుతావు ఏమంత రష్‌గా ఉందనీ?" అంటూ విసురుగా వెనక్కి చూశాడు. మాధురి! అతని కళ్ళల్లో ఆశ్చర్యం - మమతలన్నీ చూపుల్లో నింపుకుంటూ మాధురి అతనికేసి చూస్తూ నవ్వి "అబ్బాయిగారి కోపం ఇంకా తగ్గలేదే!" అంది. ఆ మాటతో కిరీటికి తన కోపం సంగతి జ్ఞాపకం వచ్చింది. మొహం చికాకుగా పెట్టాడు. "మీరు ఊళ్లోకి వచ్చి చాలా రోజులైందటగా? మీకు ఫస్ట్ క్లాసు వచ్చిన సందర్భంలో నేను ఇచ్చిన పార్టీకి మీరు వస్తారని ఎంతో ఆశించాను ...అవునూ. ఎవరో పెద్దావిడనీ ఓ అంద మైన అమ్మాయినీ తీసుకువచ్చి మీరు పూర్వం ఉండే రూమ్‌లోనే మకాం పెట్టా రటగా? ఇలా మాధురి ఒకదాని తర్వాత మరొకటిగా ఎన్ని ప్రశ్నలు వేస్తున్నా కిరీటి సమాధానం చెప్పలేదు.

ఇంతలో బస్ వచ్చింది. ముందు డోర్‌లోంచి ఎక్కుతూన్న మాధురి, ఆ బస్‌లోనే కిరీటికూడా వెనకడోర్‌నుంచి ఎక్కి ఉంటా డనుకుంది. కాని ఆమెతో కలిసి వెళ్ళడం ఇష్టం లేక కిరీటి ఆ మట్టునే పేవ్‌మెంటుమీద ఉండిపోయాడు. బస్ వెళ్ళి పోయింది. అంతకి అరగంటక్రితం నుంచీ దూరంగా చీడీలమీద కూచుని అంతా చూస్తూన్న రవణయ్య కిరీటిని సమీపించాడు. ఆ రోజున, జగత్పతిరావు టీ పార్టీ ఇచ్చిన రోజున, రిక్షాలో వచ్చిన కిరీటిని చూశాడు. అసలు కిరీటి ఇత నన్నమాట! ఆ వీర్రాజు గా డెవడో తనని మోసం చేశాడు. లేదా అలా మోసం చెయ్యమని జగత్పతిరావే పంపించాడో, మాధురికి రాణీ అడ్డు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో - సరే ఏమైతే ఏం? ఆ సావిత్రిని సాధించి కాళ్ళబేరానికి రప్పించి పీత గురించి ఏర్పడ్డ కళంకం రూపు మాపాలంటే తన రాణిని కిరీటికి ఇచ్చే పెళ్ళి చెయ్యాలి. ఆ రోజున పార్టీదగ్గర కన్పించిన అసలు కిరీటిని పట్టుకోవడంకోసం కాళ్ళకి బలపాలు కట్టుకొని పట్నం అంతా తిరుగుతూ ఉంటే, ఇదిగో ఇప్పటికి కన్పించాడు.

రవణయ్య కిరీటిన సమీపించి పలకరించి నెమ్మదిగా కబుర్లలోకి దింపాడు. తనతో ఇప్పుడు పట్నానికి వచ్చింది తన అత్తయ్యే కాని అమ్మ కాదని కిరీటి మాటల సందర్భంలో చెప్పడంతో 'హమ్మయ్య' అని ఒక బరువు తీరినట్లు రవణయ్య నిట్టూ ర్చాడు. తను వాళ్ళకి చాలా దగ్గర బంధువునని చెప్పి కిరీటితో కలిసి ఇంటికి వెళ్లాడు. "ఈవిడే మా అత్తయ్య. ఈయన మన దగ్గర బంధువట!" అని సువర్చలనీ రవణయ్యనీ ఒకర్నొకరికి పరిచయం చేసి, గోడకి జేర్లా వేసిన పీట అంచుమీద ఆనీ ఆన నట్లు గోడకుర్చీ వేసిన విధంగా కూర్చున్నాడు కిరీటి.

''మీరు నన్ను ఎరుగరు కానీ, సావిత్రమ్మ, అదే, కిరీటి తల్లి బాగా ఎరుగును '' అంటూ రవణయ్య ఎంతో చనువుగా గడపమీద కూర్చుని మాట్లాడుతున్నాడు. ''ఆహా అలాగా?'' అంటూ మర్యాదగా బుజాలనిండుగా పైట కప్పుకొని తలుపు అవతల నిలబడి సువర్చల ఊ కొడుతోంది. ఇంతలో ''ఏమండీ! కిరీటిగారు ఉన్నారా?'' అంటూ వీధిలోంచి ఒక స్త్రీ కంఠం వినిపించింది.

ఎవరా అని ముగ్గురూ ఒక్కమారే వీధిలోకి తొంగి చూశారు.

''ఇరవై యేళ్ళ యువతి రూపంలో ఉన్న ఈ వెలుగు కిరణం ఎవరు చెప్మా? కిరీటిని పిలుస్తోం దేవిటి?'' అని సువర్చల తెల్లబోయింది.

''ఇందాకటి అమ్మాయి! జగత్పతిరావు కూతురు! ఇంటికే వచ్చేసింది! కిరీటి కోసం ఇంతగా వలేస్తోంది అన్నమాట! ఈమెని తప్పిస్తేనే కాని ఈ కిరీటికి రాణిని ఇవ్వడం పడదు'' అనుకున్నాడు రవణయ్య.

''అరే! మాధురి! ఇలా వచ్చేసిందేవిటి? అత్తయ్యకి ఏం అర్థం వస్తుందో ఏమో'' తత్తరపడసాగాడు కిరీటి.

లోపలనుంచి ఏ సమాధానం రాకపోయేసరికి అలవాటున్న రూమే కనుక చకచకా లోపలికి రాసాగింది మాధురి.

''కొంప మునిగిందిరో దేవుడో'' అనుకొని కంగారుగా రవణయ్య మీంచి ఒక్క హైజంప్ చేసి అవతలకి ఒక్క గంతువేసి ''ఏవిటిలా వచ్చావు మాధురీ'' అన్నాడు కిరీటి విసుగ్గా.

''మరి ఏం చెయ్యను మీరు ఆ బస్సు ఎక్కకుండా మోసం చేస్తే అవును కానీ .'' గబగబా ఇంకా ఏం మాట్లాడేస్తుందోరా భగవంతుడా - అత్తయ్య ఏమైనా వింటే అదో కొంప మునుగుడు, సవాలక్ష సంజాయిషీలు ఇచ్చుకోవాలి. అంతకంటే మాధురిని ఇక్కడనుంచి తీసుకు వెళ్ళిపోవడం మంచిది. ఇలా అనుకొని ''నడు - మీ యింటికి వెళ్ళి మాట్లాడుకొందాం'' అంటూ ఆమెని అటునుంచి అటే తీసుకు వెళ్ళిపోయాడు కిరీటి.

జరిగిందంతా చూస్తూ ఏం అర్థం కాక మ్రాన్పడి ఉండిపోయింది సువర్చల. ఇదే అద ననుకొని ఆ పిల్ల చాలా ఘటికురాలనీ కిరీటిని వల్లో వేసుకుందనీ కిరీటి అమాయకుడూ మంచివాడూ కనక ఇష్టం వచ్చినట్లు ఆడిస్తోందనీ చెప్పి సువర్చలకి బాగా కోపం ఎక్కించాడు

అంతా వినేసరికి అనుకున్నట్లుగానే మాధురి అంటే విపరీతమైన కోపం - అసహ్యం వేశాయి. వెంటనే ఆ అమ్మాయిని కలుసుకొని నాలుగు చివాట్లూ వేసి 'కిరీటి నీకు దక్కడనీ, జయని తప్ప వా డెవర్నీ చేసుకోవడం జరిగేపని కాదనీ' ఖచ్చితంగా చెప్పి రావాలనీ అనుకొంది. ఆ సంగతే రవణయ్యకి చెప్పి ''ఈ పిల్లకి బుద్ధి

చెప్పాలంటే ఎక్కడ దొరుకుతుందీ?'' అని అడిగింది. రవణయ్య మొదట ఆమె అభిప్రాయం విని ఓ_త్తరపోయాడు. మాధురి నుంచి కిరీటిని తప్పిస్తే తన రాణీని అతనికి ఇవ్వవచ్చని తను ప్లానువేస్తే ఈమె ఎవరో జయ అంటుందేవిటి? సరే - ఆ సంగతి తర్వాత చూసుకుందాం, ముందు ఈమెచేత ఆ మాధురిని తప్పిద్దాం అని నిర్ణయించుకొని ''ఆ అమ్మాయిని మీరు ఎక్కడ ఎలా కలుసుకొనేదీ నేను ఏర్పాటు చేస్తాగా ఒకటి రెండు రోజుల్లో'' అంటూ వెళ్ళిపోయాడు.

అన్న ప్రకారం ఒకరోజున సువర్చలని బస్‌స్టాప్ దగ్గరికి తీసుకువెళ్ళి "ఆ వన్నెల విసినకర్రలా విసవిసా నడిచి వస్తోందే, ఆ అమ్మాయే. అడగవలసిన నాలుగూ అడిగేసి కిరీటిని మరిచిపొమ్మని హెచ్చరించండి. వస్తా'' అంటూ వెళ్ళిపోయాడు రవణయ్య. 'ఇలాంటి విషయాలు రోడ్డుమీద కాకుండా ఇంటిదగ్గర మాట్లాడితే బాగుండి పోనే' అనుకొంది సువర్చల, కాని రవణయ్య ఆమెకి మాధురి ఇల్లు ఎందుకు చూపిస్తాడు. ఆ మేడా ఆ వైభవం చూసి సువర్చల ప్రలోభపడి కిరీటిని ఆ ఇంటి అల్లుణ్ణి చెయ్యడానికి అంగీకరిస్తే? "ఎంత పట్నవాసం పిల్ల అయినా ఇంత చేటా? ఇళ్ళమీదకి వచ్చి అందమైన అబ్బాయిల్ని ఎగరేసుకు పోవడమా ? రామ రామ! ఈ రోజుల్లో ఆడపిల్లలు మరీ సిగ్గు వదిలేస్తున్నారు'' అనుకుంటూ సువర్చల, వస్తూన్న మాధురిని చూస్తూ అనుకుంటోంది.

మాధురి ఆలోచిస్తూ అడుగులు వేసుకుంటూ వస్తోంది. హాస్పిటల్‌లో జయతో చిన్న ఘర్షణ అయింది. "నువ్వు న్యూరాలజీ పేషెంటువి. అస్తమానూ ఆలోచనలు పెట్టుకోకూడదు. మనస్సుని అదుపులో పెట్టుకోవాలి'' అని తను అంటే ''అదెలా కుదురుతుంది డాక్టర్? ఇప్పుడు మీరొకర్ని ప్రేమించి పెళ్ళి చేసుకో బోతున్నా రనుకోండి అలా వీల్లేదు. నే నతణ్ణి ప్రేమిస్తున్నాను. మీరు అతణ్ణి మరిచిపోండి అంటే మరిచిపోగలరా?'' అంటూ ఎదురు ప్రశ్నవేసింది. ఆమె అంటు న్నది కిరీటిని గురించేగా అని అనుకొని తను దిగ్భ్రాంతురాలైంది. అలా ఆలోచిస్తూ మనస్సంతా చికాగ్గా అయిపోయి వస్తూన్న మాధురిని ఆపి "అమ్మాయి! నీ పేరేమిటో గాని నీకో విషయం చెప్పాలని వచ్చాను. నిన్ను చూస్తే గౌరవంఅయిన కుటుంబం లోనే పుట్టినట్లున్నావు నీలాంటి పిల్లలకి ఇలాంటి పనులు తగవు. నీతల్లి లాంటి దాన్ని. కోపంగా అలా పొరుషపడి చూడకు. నీ మేలు కోరి చెప్తున్నాను'' అంది సువర్చల.

"తమరికి అభ్యంతరం అయిన పనులేంచేశాను? రోడ్డుమీద నుంచోబెట్టి ఈ నీతి బోధ ఏమిటి? అసలింతకీ మీరెవరు?'' అంటూ మెడమీద ఉన్న సైతన్కోపుని ఇటూ అటూ రెండు చేతులతోటీ బుజాలమీదకి సాగదీసి పట్టుకుని నిర్లక్ష్యంగా నిల బడింది మాధురి.

"నువ్వు కిరీటి సంగతి మరచిపో ...వాడి పెళ్ళి నీతో జరగదు."

"అతని సంగతి మాట్లాడ్డానికి మీరెవరు? అతనికి మీరేమౌతారు?"

"ఏం కాకపోయినా, అన్నీ నేనే!" అంది సువర్చల.

ఆమె కిరీటికి ఏంకాదు అని తెలియడంతో మాధురి గుండెలు కొంచెం కుదుట బడ్డాయి ఇంతవరకూ ఆమె కిరీటి తల్లి ఏమో అని భయపడింది. ఈసారి ఆ భయం ఏం లేకుండా కంఠంలో సాధ్యమైనంత నిర్లక్ష్యాన్ని కనబరుస్తూ "దారిని పోయే పిన్ని గారూ! ఇలా చూడండి. పాపం చాలా శ్రమపడి ఏదో చెప్పబోయారు. కాని మీ శ్రమ అంతా దండగ. రేపీపాటికి నేను కిరీటిని పెళ్ళాడతాను అలా చూస్తూ ఉండండి" అంది. సువర్చల కళ్ళ చివర్లు ఎర్రబడ్డాయి "ఆ! కిరీటితో నీ పెళ్ళి ఎలా అవుతుందో చూస్తా" అంది.

"ఎలా కాదో నేను చూస్తాను" అంటూ విసురుగా తల తిప్పి మాధురి వెళ్ళి పోయింది.

17

జగత్పతిరావు ఇంట్లో మాధురి పెళ్ళి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. మర్నాడే ముహూర్తం పెట్టించమన్న కూతురు ఆలోచన ఏమిటో అర్థంకాక, 'సరే పెళ్ళికి ఒప్పుకొంది' అదే చాలు అని తృప్తిపడి ఉత్సాహంగా పెళ్ళి పనులు చేయించ సాగాడు అతని అభిప్రాయం ప్రకారం శేఖరే పెళ్ళికొడుకు! కాని అదికాదనీ మాధురి పెళ్ళి కిరీటితోటే జరుగుతుందనీ శేఖర్‌కీ మాధురికీ ఇద్దరికే తెలుసు! కాని తెల్లవారి లేచి చూసేసరికి రాణీ ఇంట్లో లేకపోవడం, "జగత్పతిరావుగారి ఆశీర్వచనంతో తనకీ వీర్రాజుకీ ఆరాత్రి పెళ్ళి జరగబోతోంద"ని రాణీ రాసిన చీటీ మంచంమీద కనిపించడం, జగత్పతిరావుగారి ఇంటికి వెళ్ళి చూస్తే అక్కడ మాధురి పెళ్ళి ప్రయత్నాలు జరుగుతూ ఉండడం, ఇవన్నీ చూసేసరికి రవణయ్యకి మాధురి పెళ్ళి కిరీటితో జరగబోతోందనీ, రంగంనుంచి తన రాణీని తప్పించడంకోసమే జగత్పతిరావు తన రాణీకి వీర్రాజుతో ఆ ముహూర్తానికే పెళ్ళి ఏర్పాటుచేసి ఉంటాడనీ అనుమానం తగిలింది.

దాంతో అతనికి జగత్పతిరావు మీద కోపం, పగా విజృంభించాయి. తన మేన కోడలు రాణీనీ వీర్రాజునీ ఈ జగత్పతిరావు ఎక్కడో దాచేసి ఉంటాడు. అతని కూతుర్ని తను దాచేస్తేసరి. అటు కిరీటితో మాధురి పెళ్ళి తప్పించినట్లూ ఉంటుంది. తన మేనగోడల్ని అతను దాచినందుకు అతనిమీద కక్ష తీర్చుకున్నట్లూ ఉంటుంది. ఆ తర్వాత వీలు అయ్యాక రాణీని వెతికి పట్టుకుని దాని పెళ్ళి కిరీటితో జరిపించవచ్చు. అందుకు వీలుగా అవసరం అయితే "రాణీని పెళ్ళిచేసుకుంటాను" అని కిరీటిచేత బల వంతంగా భయపెట్టి ఏస్టాంపు అంటించిన కాగితంమీదో సంతకం పెట్టిస్తేసరి. రాణీ కిరీటుల పెళ్ళికి ఆ కిరీటి మేనత్తని కావలిస్తే భయపెట్టి ఒప్పించవచ్చు. ఇలా కక్ష,

కార్పణ్యం, పగా, పట్టుదలా పెంచేసుకొని రవణయ్య, ఆ మధ్యాహ్నమే ఊళ్ళో ఉన్న ఒక గూండాల మురాని కలుసుకున్నాడు. పైకి టాక్సీడ్రైవర్లుగా జీవితం గడుపు కుంటూన్న ఆ మురా జనం, రవణయ్య చెప్పిందంతావిని, అతని దగ్గర అయిదు వందలు బయానా తీసుకుని, ఇంక తమ పని తాము ప్రారంభించడం మొదలెట్టారు.

ఒకడు సువర్చలని సమీపించి "మీ కిరీటికి కారు ప్రమాదంలో దెబ్బలు తగి లాయి, హాస్పిటల్‌లో ఉన్నాడు. మిమ్మల్ని తీసుకు రమ్మన్నాడని" చెప్పి ఆమెని తీసుకుని గోల్కొండ శిథిలాలవేపు టాక్సీని వేగంగా తీసుకుపోయాడు. ఆ మాటే మరొకడు మాధురికి చెప్పి మాధురినికూడా అక్కడికే చేర్చాడు." మీ అత్తయ్య చాలా ప్రమాద స్థితిలో ఉంద"ని చెప్పి ఇంకో టాక్సీ డ్రైవరు కిరీటిని గోల్కొండ శిథిలాల వైపు తీసుకుపోయాడు.

తనముందు నుంచి మూడు విడివిడి టాక్సీలలో కిరీటీ, మాధురీ, సువర్చలా వెళ్ళడం చూసి, ఏదో ప్రమాదం జరిగిందని గ్రహించి, రాణీని తీసుకెళ్ళి జగత్పతిరావు గారింట్లో శేఖర్ దగ్గర దిగబెట్టి వద్దాం అని వెళ్ళాడు వీర్రాజు. శేఖర్ ఇంకా హాస్పటల్ నుంచి రాలేదు. ఏవో పెళ్ళిపనులమీద జగత్పతిరావుగారు ఊళ్లోకి వెళ్ళారు. అక్కడ బావాజీ మాత్రం అప్రిమితంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఓ గంట క్రితం ఎవరో మాధురితో కంగారుగా మాట్లాడి టాక్సీలో తీసుకుపోవడం తను చూశాడు. గది లోంచి బయటికి వచ్చి నలుగురికీ కనిపించడం ఇష్టంలేక గదిలోనే ఉండి పోయాడు. ఆలోచించగా ఆలోచించగా మాధురి ఏదో ప్రమాదంలో చిక్కుకొంది అని బావాజీకి అర్థంఅయింది. అతను సంకోచంవదిలి గదిదాటి బయటికి వచ్చాడు. నలుగురూ తనవి చూస్తే చూశారు అని తెగించాడు. జగత్పతిరావు వచ్చేదాకా ఆగడమా, వెంటనే ఆ టేక్సీని వెంబడించడమా అని తటపటాయిస్తూన్న సమయంలో వీర్రాజు రాణీని ఆటో రిక్షాలో తీసుకువచ్చి అక్కడ దింపాడు.

రెండు ముక్కల్లో, వీర్రాజుకూడా అదే ప్రయత్నంలో ఉన్నాడని తెలుసుకుని, ఇల్లంతా రాణికి అప్పజెప్పి, తను ఆటోరిక్షా ఎక్కాడు బావాజి రెండు బుజాల మీంచీ జారుతున్న శాలువాని పంటితో పైకి లాక్కుంటూ

ఆటోరిక్షా శరవేగంమీద గోల్కొండ శిథిలాలవైపు దూసుకుపోయింది. కొంత దూరం వెళ్ళాక టేక్సీ ఇంజన్లల్లోంచి ధారగా కారిన క్రూడ్ ఆయిల్ గుర్తులు ఆధారంగా ఆటోరిక్షాని పోనియ్యసాగాడు వీర్రాజు. ఆ ప్రకారం అసలు దారి తప్పించి పక్కదారిన ఒక మైలు వెళ్ళగా అక్కడో కొండవారని మూడు టేక్సీలూ కనిపించాయి. ఒక చిన్న గుహలాగ ఉన్న ప్రదేశంనుంచి మాటలు వినిపిస్తున్నాయి. బయట ఆటోరిక్షా ఆపి ఆ గుహలోకి, వీర్రాజూ, బావాజీ వెళ్ళారు, అక్కడ కిరీటీ, మాధురీ, సువర్చలతో పాటు, రవణయ్యనికూడా కాళ్ళూ చేతులూ కట్టి పడేశారు టేక్సీడ్రైవర్లు.

"ఓరి పిచ్చివాడా నువిచ్చే అయిదు వందలకోసం ఈ పని అంతా చేశాం అనుకున్నావా? ఇదిగో ఈ అమ్మాయి తండ్రి పెద్దషావుకారులా వున్నాడు. ఆ మేడా అదీ చూస్తే. ఓ పాతికవేలు ఇస్తే ఇప్పుడీ పిల్లని వదుల్తాం అని కబురుచేస్తాం" అని రవణయ్యతో అంటూ వాళ్ళు ఓ కాగితం మాధురి ముందుపెట్టి. "దీనిమీద సంతకంపెట్టు" అంటూ ఆమె చేతినున్న కట్లు విప్పసాగారు.

ఆ సమయంలో "అమ్మాయీ సంతకం పెట్టకు" అంటూ అరిచి బావాజీ ఆ టాక్సీ డ్రైవర్లమీద ఒక్క ఉరుకు వురికాడు. ఈ లోగా వీర్రాజు నలుగురి కట్లూ విప్ప సాగాడు. కిరీటీ, మాధురితోబాటు సువర్చల కూడా టాక్సీడ్రైవర్లని ఎదుర్కోవడంలో బావాజీకి సాయం చెయ్యసాగారు. రవణయ్య మాత్రం బావాజీని తేరిపారచూసి కోపంతోనూ కక్షతోనూ ఊగిపోయి, కట్లు ఊడదియ్యడమే తరవాయిగా, బయటికి పారిపోయాడు పోలీసుల్ని తీసుకురావడంకోసం. కిరీటి, మాధురీ, సువర్చలా, వీర్రాజూ కలిపి టాక్సీ డ్రైవర్లను కర్రలతోనూ రాళ్ళతోనూ బాది బావాజీ కాళ్ళదగ్గర పడెయ్యడం అతను కాళ్ళతో తన్ని వాళ్ళని మళ్లీలేవకుండా చెయ్యడం, ఇలా కొంచెంసేపు జరిగేసరికి డ్రైవర్లుముగ్గురూ పారిపోయారు. కిరీటినీ, సువర్చలనీ, మాధురీన్నీ తీసుకుని వీర్రాజూ బావాజీ గుహవదిలి ఇవతలకి వచ్చేసరికి రవణయ్య పోలీసుల్ని తీసుకుని ఎదురయ్యాడు.

"ఇతనేసార్! నరసాపురం నావ ముంచేసిన కేసులో ముద్దాయి భీమ్‌సింగ్. ఇన్నాళ్లూ ప్రభుత్వం కళ్ళుకప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇప్పుడు రౌడీల సహాయంతో ఈ ముగ్గురినీ బంధించి, తప్పించబోయిన నన్ను పీక పిసికి చంపబోయాడు" అంటూ రవణయ్య పోలీసులికి బావాజీని చూపించాడు. సువర్చల ఏదో చెప్పబోయింది. వీర్రాజూ ఏదో అనబోయాడు.

'నామాట వినండి" అన్నాడు భీమ్‌సింగ్. "అంతా కోర్టులో చెప్పుకోవచ్చు. ముందు నడు," అంటూ పోలీసులు భీమ్‌సింగ్‌ని తీసుకుపోయారు. సువర్చలా, కిరీటీ, వీర్రాజులతో సహా మాధురి తన ఇంటికివచ్చింది.

కళ్యాణ మండపం దగ్గర దిగాలుపడి కూర్చున్న జగత్పతిరావు లోపలికి అడుగు పెడుతూన్న మాధురిని చూసి "అమ్మా క్షేమంగా వచ్చావా? ఈరాణీ చెప్పినదాన్నిబట్టి నువ్వు ఏమైపోయావో అని క్రుంగిపోతున్నాను తల్లీ" అంటూ వెర్రిగా అరిచాడు అతని కంఠంవిని వులిక్కిపడి సువర్చల తలెత్తి చూసింది. ఆశ్చర్యం, ఆనందం అవధులు దాటింది. పట్టలేని సంతోషంతో ' మీ . రా" అంటూ పిచ్చిగా కేకపెట్టింది.

అనుకోని అదృష్టం హఠాత్తుగా ఎదురుకావడంతో ఒళ్ళు తెలియని ఆనందంతో "ఎవరు? డార్లింగ్!" అన్నాడు జగత్పతిరావు ఇద్దరి శరీరాల్లోనూ చలనంలేదు.

ఇద్దరి మనస్సులలోనూ ఆలోచనలేదు.

ఇద్దరి కళ్ళకీ రెప్పపాటులేదు.

పద్దెనిమిది ఇరవై సంవత్సరాల ఎడబాటువల్ల గుండెల్లోంచి ఉవ్వెత్తుగా లేస్తూన్న సంతోష తరంగం.

ఎన్నాళ్ళకి తిరిగి కలుసుకున్నాం అనే ఆనందంతో ఇద్దరి ముఖాల్లోనూ వెలిగి పోతూన్న కాంతిపుంజం. మాటలకందని మధురానుభూతిలో ఒకరినొకరు చూస్తూ అచేతనంగా అలా ఎంతసేపు వుండిపోయారో! అంతసేపూ, కాలం ఆగిపోయింది. సంతోషం వెల్లివిరిసిపోయింది. ఆశ్చర్యం ఆనందం రాజ్యం ఏలింది.

ఇన్నేళ్ళూ తను ఈ ముహూర్తంకోసమే కదా బ్రతికివుంది! తీరా సమయం వచ్చేసరికి తను ఆ ఆనందాన్ని భరించలేనంత నీరసంగా అయిపోతోందేవిటి? సంతోషంతో తబ్బిబ్బుపడి గుండె ఇలా వేగంగా కొట్టుకుంటోంది. తలమున్కలైన ఈ ఆనందం తనని బ్రతకనిచ్చేనా? పట్టలేని ఆనందంతో కళ్ళు రెండూ చలమైపోతూ వుంటే పక్కనేవున్న మాధురిని తటాలున కౌగలించుకొని వెక్కివెక్కి ఏడ్వసాగింది. సువర్చల. తెల్లబోయి చూస్తూన్న మాధురితో "అమ్మా మాధురీ! ..మీ మమ్మీ" అన్నారు జగత్పతిరావు ఆనందోద్వేగాలతో.

"ఆ!" అని మాధురి ఒక్క కేకవేసి "మమ్మీ!" అంటూ సువర్చలని కౌగలించుకొంది. తల్లీ కూతుళ్ళనిచూసి కళ్ళల్లోంచి ముత్యాలులా రాలుతూన్న ఆనందాన్ని కండువాతో ఒత్తుకున్నారు జగత్పతిరావు.

ఆ సమయంలో హాస్పటల్‌నుంచి జయని డిస్‌ఛార్జిచేసి ఆమెని తీసుకుని అక్కడికి వచ్చాడు శేఖర్ ఒక్కనిముషంలో జరిగింది అంతా జయకీ శేఖర్‌కీ అర్థం అయి ఇద్దరూ ఆశ్చర్యంగా అందరికేసీ తర్వాత ఒకళ్ళ నొకళ్లూ చూసుకున్నారు. వాళ్ళు అలా ఒకళ్ళ నొకళ్ళు ఆప్యాయంగా చూసుకోడాన్ని మాధురి చూసింది.

"ఏవిటి మా అత్తయ్య మాధురి తల్లా" అన్నాడు కిరీటి ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ.

"ఇంక ఇప్పటినుంచి ఆవిడనీకు ఉత్త అత్తయ్యకాదు-అత్తగారు" అన్నాడు శేఖర్ కిరీటి వీపు తడుతూ.

"అంటే ఆ సరే సరే.. అలాగైనా నాకు ఇష్టమే. కానయితే ఇప్పటిదాకా డాక్టరు అల్లుడవుతా ఉనుకున్నది. శాస్త్ర మార్చుకొని, కవి అల్లుడౌతాడని అనుకోవాలి. అంతేగా?" అన్నారు జగత్పతిరావు నవ్వుతూ

"వాడూ డాక్టర్ అవుతాడు. పి. హెచ్. డిలో సీటు వచ్చింది" అన్నాడు శేఖర్.

"నిజంగా" అంటూ మాధురితోపాటు అంతా గట్టిగా ఆనందంతో అడిగారు. శేఖర్ పక్కన నిలబడ్డ జయకేసి సువర్చల సాభిప్రాయంగా చూసింది. జయనవ్వి ఇంక నీ కూతురు దొరికింది కనుక నన్ను వదిలెయ్యి పిన్నీ. నీకోరిక ప్రకారం నీ కూతుర్ని ముద్దుల మేనల్లుడికిచ్చి పెళ్ళిచెయ్యి" అంది.

''ఇంతకజ్జాకోరు పిల్లవి. నిన్ను ఊరికే వదిలేస్తే ఎల్లా. ఏ శేఖర్‌లాంటి గట్టి డాక్టర్ కేరాఫ్‌లోనో కట్టిపెట్టాలి'' అంది మాధురి కొంటెగా. కళ్ల చివరనుంచి జయ శేఖర్‌ని పరిశీలించింది. శేఖర్‌లో చలనం కలగలేదు సరికదా ముఖంలో విషాదం ఆవరించింది. మాధురి కళవళపడి అతనికేసి జాలిగా చూసింది. శేఖర్‌ది గంభీరమైన హృదయం. తననుంచి జయమీదకి మనస్సు మళ్లించుకోడానికి అతనికి కొంతకైము అవసరం అనుకొంది.

''కిరీటీ! మా అమ్మాయిని నీకు ఇవ్వడానికి నాకు అభ్యంతరంలేదు. అయితే ఒక్క షరతు'' అన్నాడు జగత్పతిరావు గంభీరంగా.

అంతా అతనికేసి చూశారు.

''మాధురిని నీతో పంపించేది లేదు, నువ్వే రావాలి మా యింటికి ఇల్లరికం'' అన్నాడు జగత్పతిరావు. అంతా నవ్వారు. కిరీటి ముఖం ఎర్రబడింది. సువర్చలకేసి చూశాడు సువర్చల నవ్వుతూ జగత్పతిరావుతో ''అదేం కుదరదు మీ అమ్మాయితో సహా మీరే మా యింటికి ఇల్లరికం రావాలి'' అంది.

''అంటే ?'' అర్థంకాక ఆగిపోయాడు జగత్పతిరావు.

''అంటే ఈ ఇల్లూ మేడా ఆస్థీ ఇదంతా సువర్చలగారిది అన్నమాట. దీని కంతకీ ఆమె అధికారిణి. ఇక్కడ ఆమె తన మేనల్లుడితో వుంటారు. మీరే మీ అమ్మాయిని తీసుకుని ఇక్కడికి ఇల్లరికానికి వస్తారు అర్థమైందా?'' అన్నాడు వీర్రాజు.

''ఓ అదా సంగతి! .అయితే సరే'' అన్నాడు జగత్పతిరావు హాలు మారు మ్రోగిపోయేలా నవ్వుతూ. మాధురి పెళ్ళి పై నెలకి మార్చి మర్నాటి సాయంత్రం జగత్పతిరావు వెళ్ళి భీమ్‌సింగ్‌ని బెయిల్ మీద విడుదలచేసి తీసుకువచ్చాడు.

''సమయానికి ఈయన దేవుడులా వచ్చి అడ్డుకోకపోతే మేం ముగ్గురం ఏమై పోయి ఉందుమో-ఇవాళ మనం అంతా ఇలా సంతోషంగా కలుసుకున్నాం అంటే ఈయనే కారణం'' అంది సువర్చల భీమ్‌సింగ్‌కి గౌరవంగా నమస్కరిస్తూ.

''ఇవాళ మనల్ని ఇలా కలిపిన పెద్దమనిషే ఆ రోజున మనం అలా విడిపోడానికి కారణం అయాడు. ఇతనికోసం కాకపోతే నేను అలా ఆ రోజున నాటకం వెయ్యకపోదును. అవునూ? ఆ రోజున నువ్వు ఆ ఊరు ఎందుకు వచ్చావు? రైలు ప్రమాదంలో బ్రతికి బైట పడ్డప్పుడు కోపంతో ఇన్నేళ్ళూ ఉండి పోకపోతే వెంటనే నా దగ్గరికి ఎందుకు రాకపోయావు డార్లింగ్!'' అంటూ ప్రశ్నించాడు జగత్పతిరావు.

''కోపమా? క్రోధమా? ఏం లేదు. ఏం జరిగిందంటే నా చిన్ననాటి స్నేహితురాలు సావిత్రి, చిన్నప్పుడే భర్త పోయి తన కొడుకైన ఈ కిరీటితో నరసాపురంలో తమ్ముడి దగ్గర ఉండేది. ఒక రోజున తమ్ముడూ మరదలూ గోదావరిలో మునిగిపోతే, ఆ బాధ భరించలేక ఒకటి రెండు రోజులలో తమ్ముడు కూతురు ఈ జయనీ, తన కొడుకు

ఈ కిరీటినీ తీసుకుని పట్నం వచ్చేసింది. భీమ్‌సింగ్ కోరికమీద మీరు నాటకం వేసింది ఆ పట్నంలోనే-నాకు తెలియదు తనకు వచ్చిన కష్టాలన్నీ రాసి ఓ మారు వచ్చి చూసి పొమ్మంటే. మీరు ఎల్లాగూ ఊర్లో లేరు కదా, మీరు వచ్చేటప్పటికి తిరిగి వచ్చెయ్యొచ్చనే ఉద్దేశంతో ఆ పట్నం వచ్చాను. నేనూ సావిత్రీ మాట్లాడుకొంటూ ఉంటే వీధిలోంచి కిరీటి నాటకంపేపరు పట్టుకువచ్చాడు. మీరు మళ్ళీ నాటకం వేస్తున్నారనీ, నా దగ్గర ఇలా కపటనాటకం ఆడారనీ తెలిసి, అయినా ఇది ఎంతవరకూ నిజమో అని సావిత్రీ పిల్లలతో కలిసి మాధురిని తీసుకుని నాటకానికి వచ్చాను. నిజంగానే మీరు నాటకం వేస్తున్నారు. మాధురి స్టేజిమీదకి వచ్చి చేరుకుంది. దాన్ని తీసుకుని వెనకాలే వచ్చి నన్ను బతిమాలకుండా ఉంటారా అనే ధీమాతో. సావిత్రినీ కిరీటినీ జయనీ తీసుకుని మన ఊరు వెళ్ళే రైలు ఎక్కాను. అది యాక్సిడెంటే అయింది. మా కెవరికీ ఏ దెబ్బా తగలలేదు. సామాన్లు మాత్రం చిందర వందరగా పోయాయి. సావిత్రికైతే చాలా ప్రమాదకరమైన గాయం తగిలింది. అంబులెన్స్‌మీద దాన్ని తీసుకువెళితే పిల్లల్ని తీసుకుని నేనూ దానితో కారులో వెళ్ళిపోయాను. వారం రోజులు మృత్యువుతో పోరాడి చివరకి చచ్చిపోయింది. చచ్చిపోయేటప్పుడు నరసాపురంలో తన ఆస్థులూ, తమ్ముడి భూములూ, వాటికి సంబంధించిన కాగితాలన్నీ నాకు అప్పగించి, పిల్లల్నిద్దర్నీ నా చేతిలో పెట్టి కన్ను మూసింది. ఆ తర్వాత రెండు మూడు రోజులకి కాని పిల్లల్ని తీసుకుని నేను మన ఊరికి రావడానికి వీలు లేకపోయింది. అప్పుడు వచ్చి చూస్తే ఏముంది? అప్పటికే మీరు అన్నీ అమ్మేసి ఎక్కడికో వెళ్ళిపోయారు. ఎక్కడికి వెళ్ళిందీ పక్కవాళ్ళు ఎవ్వరూ మాకు తెలియదు అన్నారు. అప్పటినుంచీ ఇవాల్టిదాకా, మీరు ఎక్కడేనా నాటకంలో వేషం వేసినట్లు వార్త వస్తుందేమోనని రోజూ ఆశగా పేపరు చూస్తూ, ఎప్పటికేనా కలుసుకోక పోతామా అనే ఆశతో నరసాపురంలో ఈ కిరీటినీ జయనీ పెంచుతూ కాలక్షేపం చేసుకుంటూ బతుకుతున్నాను'' అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ సువర్చల.

''ఆ తర్వాత నేను నాటకంలో వెయ్యలేదు. అందుకే నా ఎడ్రస్ నీకు దొరకలేదు'' అన్నాడు జగత్పతిరావు.

''ఇంతకీ నరసాపురంలో నదిలో మునిగిపోయిన మీ సావిత్రి తమ్ముడూ మరదలూ కేసులోనే మా భీమ్‌సింగ్ ఇరుక్కున్నాడు'' అన్నాడు జగత్పతిరావు.

ఆ మాట విని రాణీ కెవ్వున అరిచి ''ఇతనేనా మా నాన్ననీ అమ్మనీ ముంచేసి చంపేసింది. ఇదిగో నా దగ్గర ఫోటో ఉంది. మావయ్యపెట్టె అడుగున ఉంటే దాన్ని తీసి, అమ్మా నాన్నా జ్ఞాపకార్థం నా దగ్గర దాచుకున్నాను'' అంది. వీర్రాజు ఆ ఫోటో చటుక్కున తీసుకుని జాగ్రత్తగా పరిశీలించి ''ఇది ఖరీదైన కెమెరాతో తీసింది. దీని

నెగిటివ్ కనక సంపాదిస్తే, దాన్ని బాగా పెద్దదిగా ఎన్‌లార్జి చేసి చూడొచ్చు'' అన్నాడు. మర్నాడు వీర్రాజుని జగత్పతిరావు నరసాపురం పంపించాడు. అతి ప్రయత్నంమీద ఆ ఫొటోగ్రాఫర్ని పట్టుకొని వీర్రాజు నెగిటివ్‌సంపాదించాడు. అది ఎన్‌లార్జి చేస్తే భీమ్‌సింగ్ చెబుతూన్నది నిజం అని స్పష్టంగా అర్థం అయిపోయింది. చిన్న ఫొటోలో అయితే వెంకట్రావూ, భీమ్‌సింగూ పెనుగులాడుతున్నట్లు కనిపించింది కానీ, అదే పెద్ద ఫోటోలో, వెంకట్రావు నావ అడుగున ఉన్న ఒక బిరడా తీసి నావని ముంచెయ్యడానికి ప్రయత్నించడం భీమ్‌సింగ్ అతని చేతిలో బిరడా లాక్కొని, నావకి పెట్టి నావలోకి నీళ్ళు రాకుండా చెయ్యాలని పెనుగులాడడం కనిపించింది. వెంకట్రావుచేతిలో బిరడా, నావలోకి వస్తూన్న నీళ్ళూ.

కోర్టువారు అతనిమీద వున్న హత్యానేరాన్ని ఫొటో చూస్తూనే కొట్టేశారు. ఇక రవణయ్యని రెండు చేతుల్తోటీ పీక పిసికి చంపడానికి, గోల్కొండ శిథిలాలదగ్గర ప్రయత్నించాడని ఆరోపణ. ''అయ్యా భీమ్‌సింగ్‌గారూ! మీ భుజాలమీద వున్న ఆ కాశ్మీరు శాలువా జార్చేయండి'' అన్నాడు ముద్దాయి తరఫు లాయరు. కోర్టు అంతా ఒక్కమాటు కెవ్వున అరిచింది. భీమ్‌సింగ్‌కి చేతులు లేవు. సావిత్రికి గాయాలు తగిలిన ఆ రైల్వే యాక్సిడెంట్‌లోనే అతని రెండుచేతులూ జబ్బలదగ్గరికి తెగిపోయాయి. ఆ రోజున తెగిపోయిన ఆ చేతులతోటే నరకయాతన అనుభవిస్తూ రైలు అవతలనుంచి చీకట్లో వెళ్ళిపోయాడు భీమ్‌సింగ్. అక్కడ వుంటే నరసాపురం హత్యకేసు అంటూ పోలీసులు తనని ఎక్కడ అరెస్టు చేస్తారో అనే భయంతో, దగ్గర్లో ఒక ప్రకృతి ఆశ్రమానికి చేరుకొని పసర్లూ, ఆకులూ, కట్లూ వీటితో ఆరునెలలకి ఎలాగైతేనేం గాయాలు మాన్పుకొని ఉత్తరదేశం అంతా పది పదిహేనేళ్లు తిరిగి తిరిగి ఇంక తిండికి గడవక నానా అవస్థలూపడి, బాల్యస్నేహితుడు జగత్పతిరావుకి కబురుపెట్టి అతనితో కలిసి ఇంటికి వచ్చి ఇన్నాళ్ళనుంచీ బావాజీగా రహస్యజీవితం గడుపుతున్నాడు.

చేతులు లేనివాడు పీక పిసకడం ఏమిటి అనే ప్రశ్నకి తోడు, అసలు ఈ రవణయ్యే గూండాలచేత మాధుర్ని వాళ్ళనీ బంధించాడని ఏమిటి కేసుపెడితే రవణయ్యే యోగం కుదురుతుంది అంటూ కోపంతో ఘూర్ణిల్లాడు జగత్పతిరావు. కాని రాణీ బతిమాలడంతో ఆ ప్రయత్నం విరమించాడు. వీర్రాజు రవణయ్యని బలవంతంగా జగత్పతిరావు ఇంటికి తీసుకువచ్చాడు. వచ్చి ''ఏమండీ మరి రాణీ కోరికప్రకారం నేను వస్తాదునీ కాను ఆరడుగుల ఎత్తూ నూటయాభై పౌనుల బరువూలేను. మీకోరికప్రకారం తెలుగు ఎమ్మే కూడా కాను. మీ మేనకోడల్ని నాకు పెళ్ళిచేస్తారామరి!'' అన్నాడు వీర్రాజు.

"పైల్వాన్ కూతురు మరో పైల్వాన్నే పెళ్ళాడాలనుకుంది అది సహజమే అయినా ఇప్పుడు నా పెర్మిషన్ ఏముంది? ఇదిగో భీమ్‌సింగ్ నీ కూతురే రాణీ. ఆ రోజునే మీ ప్రేమని నేను అంగీకరిస్తే ఈ అనర్థాలేవీ రాకపోను" అన్నాడు రవణయ్య పశ్చాత్తాపంతో.

"నాన్నా" అంటూ కౌగలించుకొన్న కూతుర్ని తలమీద ముద్దుపెట్టుకుని "కౌగలించుకోడానికి నాకు చేతుల్లేవు అమ్మా" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు భీమ్‌సింగ్.

"ఏరా కిరీటీ? ఇంక నేనా ఊహాలోకాల్లో తేలిపోతూ కలల ప్రపంచంలో కరిగిపోతూ గులాబీలనీ మల్లెల్నీ ప్రేమించే ఆ బొటానికల్ లవ్ కట్టిపెట్టి అసలు ప్రపంచంలో పడతావా?" అన్నాడు శేఖర్.

"ఊహూఁ" అంటూ సిగ్గుపడ్డాడు కిరీటి.

"అందరి ఎదురుగుండా ఇలా సిగ్గు నటిస్తారు డాడీ! ఒక్కళ్ళూ వుంటే ఎంతలేసి మాటలంటా రనుకున్నావు? ఓ మాటు నన్ను ఒంటరిగా చూసి అజంతా సుందరీ అంటూ పిలిచారు" అంది మాధురి వచ్చేనవ్వు ఆపుకుంటూ.

"ఏమయ్యా పిలిచావా? మాట్లాడవేం? .చెప్పు గస్ తీశానో మళ్లీ గాభరా పడిపోతావు జాగ్రత్త" అన్నాడు జగత్పతిరావు.

"కిరీటితో నీపెళ్ళి ఎలా అవుతుందో చూస్తానన్నావుగా మమ్మీ" అందిమాధురి.

"అవును. ఇప్పుడూ అమాటే అంటున్నాను కన్యాదానం పీటలమీద కూర్చుని ఎలా అవుతుందో కళ్ళకి నిండుగా మరీ చూస్తాను సరా?"

"అమ్మా మాట మార్చావు."

"మాటమార్చడానికీ మాటతప్పడానికీ నేనేమైనా నాటకాల మనిషిని అయితే కదా?" అంటూ సుకన్యల జగత్పతిరావుకేసి సోగగా చూసింది.

జగత్పతిరావు గతాన్ని జ్ఞాపకం తెచ్చుకుని నవ్వాడు

వీర్రాజు ఆడిన నాటకాన్ని చెప్పబోతున్నోంది రాణీ.

"మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటే చాలా మరమ్మత్తు చెయ్యాలి" అంటోంది కిరీటితో మాధురి నవ్వుతూ.

శేఖర్ ఏదో ఊస్తూ సిగరెట్ కాల్చుకుంటూ కూర్చుంటే మమతలన్నీ కళ్ళల్లో నింపుకొని అతనికేసి జాలిగా చూస్తూవుంది జయ.

ఇలా ఎవరి పట్టుకి వాళ్ళు ఏదో పనిలోవుంటే, ఏపనీ లేకుండా వున్నది ఒక్క రవణయ్య మాత్రమే! మూలకూచున్న రవణయ్యకి ఏ ఆలోచనాలేదు కాని భీమ్‌సింగ్‌కి

అన్నీ ఆలోచనలే. అక్కడున్న వాళ్ళల్లో ఒక్కొక్కళ్ళని చూస్తూంటే అతనికి ఒక్కొక్క రకమైన ఆలోచన రాసాగింది.

"ప్రేమ ఎంతబలమైందో అంత చిత్రమైంది. సువర్చలా జగత్పతిరావూ ఒక ర్నొకరు గాఢంగా ప్రేమించుకోవడంవల్లే ఇతర స్త్రీలతో వేషంవేస్తున్నాడని ఆమెకి అతనిపై కోపంరావడం. చివరకి ఇద్దరూ విడిపోయి. ఇన్నాళ్ళయినా బంధాలు చెడకుండా, మళ్ళీ కలుసుకోవడం జరిగింది. తనకి సీతతో పెళ్ళి అయి తమ ప్రేమఫలిస్తే తనకథ కూడా ఇంకోరకంగావుండివుండును. తను సీతని అంత అమితంగా ప్రేమించాడు కనకే ఆమెని ఆమె భర్త చంపడానికి తీసుకు వెళ్ళాడని తెలిసి. చూస్తూ ఊరుకోలేక పోయాడు. అందుకే హత్యానేరంలో చిక్కుకున్నాడు కూడా అన్యాయంగా.

ప్రేమ చిత్రమైంది కనకే పైల్వాన్‌ని పెళ్ళి చేసుకోవాలనికూడా, తన కూతురైన రాణీ, ఆ లక్షణాలేవీ లేని వీర్రాజుని మనస్సా ప్రేమించి పెళ్ళి చేసుకోబోతోంది.

మాధురి మాత్రం? తన తెలివికి చురుకుకీ నిజానికి ఆమె శేఖర్‌ని పెళ్ళాడ వలసింది! కాని అదే చిత్రం! ఎంత ప్రయత్నించినా ఆమె మనస్సు కిరీటివైపే పరిగెట్టింది కాని శేఖర్ అంటే ఇష్టపడలేదు.

పోనీ శేఖర్‌పట్ల ఈ ప్రేమ సజీవుగా ప్రవర్తించిందా? తనని కాదంటూన్న మాధురివైపే అతని మనస్సుని మళ్ళించింది కాని, తనే కావాలని తపస్సు చేస్తూన్న జయవైపు ససేమిరా ముఖం తిప్పనిస్తోందా? తనలా విషాదాలు కాకపోయినా, తనతోపాటు, వీళ్ళ జీవితాలన్నీ వేటికవే బలే తమాషాగా చిత్రంగా ఉన్నాయి. ఇవన్నీ కలిపితే ఒక రామాయణం అంత రామ! . రామ! . ఒక ప్రేమాయణం అంత కథ అవుతుంది " అంటూ తనలో తను నవ్వుకోసాగాడు భీమ్‌సింగ్ .

"ఏమిటలా నీలో నువ్వు నవ్వుకుంటున్నావు?" అని అడిగాడు జగత్పతిరావు. భీమ్‌సింగ్ మొదట చెప్పలేదు. "ఏదో పిచ్చి ఆలోచన పోనిద్దూ" అన్నాడు కాదు కూడదని జగత్పతిరావుతో సహా అంతా చెప్పమని పట్టు పట్టేసరికి భీమ్‌సింగ్ తన ప్రేమాయణం తాలూకు ఆలోచనల్ని చమత్కారంగా చెప్పాడు. శేఖర్, జయా, రవణయ్యా తప్ప అంతా ఘొల్లుమని నవ్వారు. వాళ్ళ నవ్వులతో ఆ మహల్ అంతా మారు మ్రోగింది.

(ఐపోయింది)

Edited and Published by V. Leelavathy Raghavaiah, 40/1 Moosasait Street, Madras-600 017 and Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600 001.